thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 143 | కరీంనగర్ శుక్రవారం, 1 ఆగస్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే విధ్వంసమే

చెన్నై : ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు.

పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు.




## తవ్వేకొద్దీ బయటపడుతున్న...

## డా. నమ్రత అద్దెగర్భాల వ్యవహారాలు

సంతానం లేకపోవడంతో రాజస్థాన్ నుంచి వచ్చి సికింద్రాబాద్ లో ఉంటున్న ఓ జంట డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. ఆమె వైద్య పరీక్షలు నిర్వహించి సరోగసీతో బిడ్డను కనొచ్చని విడతల వారీగా రూ.30 లక్షలు వసూలు చేశారు. సరోగసి మహిళ ఖర్చులు అదనంగా తీసుకున్నారు. విశాఖపట్నంలోని ఆసుపత్రిలో ఆ మహిళ గర్భంలో బిడ్డ ఊపిరి పోసుకుంటుందని నమ్మించారు. సరిగ్గా తొమ్మిది నెలలు పూర్తైన తర్వాత పుట్టిన బిడ్డను తీసుకొచ్చి చేతుల్లో పెట్టారు. ఆ బిడ్డకు క్యాన్సర్ రావడం, తర్వాత డీ.ఎన్.ఏ. పరీక్ష చేయించడంతో.. ఆ దంపతులతో మ్యాచ్ కాలేదు. వారి ఫిర్యాదుతో మొదలైన సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ డా. నమ్రత వ్యవహారాలు అటు అహ్మదాబాద్ నుంచి ఇటు విశాఖ వరకూ ఉన్నాయి. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అవును... డాక్టర్ నమ్రత వ్యవహారాలపై బాధితులు క్యూ కడుతున్నారని తెలుస్తోంది. ఈ సమయంలో తాజాగా సరోగసీతో బిడ్డను కనొచ్చని ఓ జంట నుంచి విడతల వారీగా రూ.25 లక్షలు వసూలు చేసిన డా. నమ్రత... తొమ్మిది నెలల తర్వాత ఆశగా వెళ్లిన దంపతులకు... మగబిడ్డ శ్వాస సమస్యతో మరణించాడని చెప్పి, బోల్తా కొట్టించారు! ఇదే తరహాలో మరి కొందరు ఆమె ఆగడాలు వెల్లడిస్తున్నారు. ఈ విధంగా... దంపతుల నుంచి అండాలు, వీర్యకణాలు సేకరించి.. అద్దెగర్భంతో బిడ్డను ఇస్తామని నమ్మించి.. వారి నుంచి లక్షల రూపాయల సొమ్ము వసూలు చేసి, సరిగ్గా తొమ్మిది నెలలు పూర్తిన తర్వాత నవజాత శిశువులను కొనుగోలు చేసి వీరి చేతికిచ్చేయడం చేసేవారు. ఈ నేపథ్యంలో... సరోగసీ ముసుగులో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లో పెద్దఎత్తున మోసాలకు పాల్పడినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మోసాలతో సంబంధం ఉన్న ఆసుపత్రులు, వైద్యులు, శిశు విక్రయ ముఠాల లింకులను ఛేదించేందుకు పోలీసులు సిద్ధమయ్యారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో... వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుని లోతైన దర్యాప్తు చేపట్టారని సమాచారం! తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది! ఈ క్రమంలో... సికింద్రాబాద్ లో మొదలైన ఈ దందా విశాఖలో ముగిసేలా ప్లాన్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... సికింద్రాబాద్ సెంటర్ లో సంతానం లేని దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. అనంతరం వారిని ప్రత్యేక వైద్య పరీక్షల కోసమని చెప్పి విమానాల్లో విశాఖకు తీసుకెళ్లేవారట. అక్కడ పరీక్షలు నిర్వహించేవారట. ఇదే సమయంలో... సరోగసీకి అంగీకరించిన మహిళను వీరికి పరిచయం చేసేవారు. ఇదే సమయంలో... పుట్టబోయే బిడ్డ కోసమని వీర్యకణాలు, అండాలు సేకరించేవారట. ఈ క్రమంలో.. నెలరోజుల అనంతరం సరోగసీ విధానం విజయవంతమైందని, మరో 9 నెలల్లో బిడ్డను అందిస్తామని చెప్పి... డెలివరీ సమయాన్ని ముందుగానే చెప్పి రూ.లక్షల్లో వసూలు చేసేవారని చెబుతున్నారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన సిగాచి పరిశ్రమ ఘోర పేలుడు ప్రమాదంపై తెలంగాణ హైకోర్టులో పిల్ దాఖలు అయ్యింది. సిగాచి పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించలేదని న్యాయవాది కె.బాబూరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీంతో సిగాచి పరిశ్రమ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. పేలుడు ఘటనలో ఇంకా 8 మంది ఆచూకీ లభించలేదని ఫిటిషన్‌లో పేర్కొన్నారు బాబూరావు. బాధితులకు ప్రకటించిన పరిహారం ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని స్పష్టం చేశారు. సిగాచి పరిశ్రమ యజమానిని ఇప్పటివరకూ అరెస్టు చేయలేదని.. ప్రమాదంపై సీఎం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక బయటపెట్టాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జూన్ 30న సంభవించిన ఘోర పేలుడు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి న్యాయం చేయాలని పిటిషనర్ కోరారు.

# స్పీకర్‌కు డెడ్‌లైన్!

## మూడు నెలల టైమ్!!

## తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలి: సుప్రీం కోర్టు




దిల్లీ: తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. ఏ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు.. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రాజకీయ ఫిరాయింపులు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందని, అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని తీర్పులో ధర్మాసనం అభిప్రాయపడింది. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలను కూడా పరిశీలించామని సీజేఐ తెలిపారు. "రాజేష్ పైలట్, దేవేంద్రనాథ్ మున్షీలా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి.

తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రైబ్యునల్‌గా వ్యవహరిస్తారు. స్పీకర్ అలా వ్యవహరిస్తూనే రాజ్యాంగపరమైన రక్షణని పొందలేరు. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నాం. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుంది" అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది.

ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ తీర్పు వెలువడింది.

# కేంద్రంలో భారీ మార్పులు..





## పది రోజుల్లో కీలక పరిణామాలు

## మంత్రివర్గంలో పూర్తి స్థాయిలో మార్పులు - చేర్పులకు అవకాశం!

దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకోనున్నాయా? అధికార బీజేపీకి నూతన అధ్యక్షుడి నియామకంతోపాటు కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు ఉండే అవకాశాలు ఉన్నాయని రాజధాని ఢిల్లీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరో వారం పది రోజుల్లోనే పార్టీ, ప్రభుత్వంలో ప్రక్షాళన ఉండొచ్చని కమలం పెద్దలు సంకేతాలు పంపుతున్నారు. అయితే కొత్త అధ్యక్షుడు కాబోయే నేత పార్టీతోపాటు ప్రభుత్వంపైనా పట్టు సాధించేలా ఉండాలని సంఘ్ పరివార్ కోరుకుంటుందనే ప్రచారమే ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రధాని మోదీ శకం నడుస్తోంది. 2014లో ప్రధానిగా మోదీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వం, బీజేపీలో మోదీ వన్ మేన్ షో నడిచేది.. ప్రస్తుతం నడుస్తుంది కూడా.. అయితే ఈ పరిస్థితిలో మార్పు రావాలని సంఘ్ పరివార్ కోరుకుంటోందని అంటున్నా రు. మోదీ మూడోసారి ప్రధాని పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా బీజేపీ బలంగా ఉండాలనే ఆలోచ నతో ఉన్న సంఘ్ పరివార్ పార్టీ అధ్యక్షుడిగా బలమైన నేత ఉండాలని కోరుకుంటున్నారని అంటున్నారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన ఆర్‌ఎస్‌ఎస్ తాజా సూచనలను బీజేపీ పెద్దలు పాటించాల్సిన అనివార్య పరిస్థితులు ఉన్నాయంటున్నారు. దీంతో మరో వారం రోజుల్లోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతోపాటు పార్టీలోనూ భారీ మార్పులు ఉంటాయంటున్నారు. అదే సమయంలో నాలుగైదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించే అవకాశం ఉందని అంటున్నా రు. దేశంలో మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ, మిత్రపక్షాల ప్రభుత్వాలే ఉన్నప్పటికీ గత సార్వత్రిక ఎన్నికల్లో అత్తెసరు సంఖ్యలో గెలవడం, మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని కొనసాగించాల్సి రావడాన్ని బీజేపీ పెద్దలతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ అగ్ర నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఇదే సమయంలో కచ్చితంగా ఓడిపోతాయని సర్వేలు తెలిపిన మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలల్లో ఆఎస్‌ఎస్ ఫార్ములా వర్క్ అవుట్ అవ్వడాన్ని గుర్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా ఈ ఫార్ములా అమలు కావాలంటే బలమైన నేత పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ సూచిస్తోందని అంటున్నారు. మరోవైపు కేంద్ర మంత్రివర్గంలో ఉన్న కొందరు మంత్రులను తప్పించా లని సూచనలు ఉన్నాయంటున్నారు. ప్రజలతో నేరుగా సంబంధం లేని చాలా మంది కేంద్ర మంత్రులుగా ఉన్నారని, దీనివల్ల ప్రజలను ఆకర్షించలేకపోతున్నామని ఆర్‌ఎస్‌ఎస్ అభిప్రాయపడుతోందని అంటున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా పనిచేసిన కొందరి ప్రతిభ ఆధారంగా కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవడం వల్ల రాజకీయంగా ప్రయోజనం దక్కడం లేదని ఆర్‌ఎస్‌ఎస్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో ఐపీఎస్ గా పనిచేసి రాజీనామా చేసిన తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై వంటివారిని కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ నుంచి సూచనలు వస్తుండటం గమనార్హం అంటున్నారు. ఇదేవిధంగా కొంతమంది గవర్నర్ల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తోందని బీజేపీతోపాటు ఆర్‌ఎస్‌ఎస్ నేతలు అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారని చెబుతున్నారు. తమిళనాడు గవర్నర్ రవి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో వివాదం పెట్టుకోవడం, తమిళనాడు ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించడమే కాకుండా నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలతో దక్షిణాదితో పార్టీని వేరు చేసే వ్యూహాన్ని అమలు చేయడాన్ని బీజేపీ పెద్దలు సీరియస్ గా తీసుకున్నారని అంటున్నారు. ఈ రాజకీయ వ్యూహం నుంచి బయటపడాలంటే గవర్నర్ ను మార్చాలనే అంశాన్ని పరిశీలిస్తున్నారని అంటున్నారు. అయితే ఒక్క తమిళనాడు గవర్నర్ ను మార్చితే స్టాలిన్ ప్రభుత్వానికి తలొగ్గినట్లు అవుతుందనే ఆలోచనతో దేశవ్యాప్తంగా నలుగురైదుగురు గవర్నర్లను మార్చాలనే ప్రతిపాదన పరిశీలిస్తున్నారని అంటున్నారు. దీంతో ఆగష్టు మొదటి వారం లేదా రెండవ వారంలో దేశ రాజకీయాల్లో భారీ మార్పులు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది.



# విచారణ నివేదికను సమర్పించిన కాళేశ్వరం కమిషన్

హైదరాబాద్: కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించి విచారణ నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఇవాళ జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.



# ఎట్టకేలకు బోనులో చిక్కిన చిరుత

హైదరాబాద్: రాజధాని శివారు గండిపేట, మొయినాబాద్, షేక్‌పేట మండలాల్లో స్థానికులకు నిద్రలేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. దాదాపు 20 రోజులుగా సురక్షిత ప్రాంతాలను ఎంచుకొనే క్రమంలో సంచరిస్తూ అటవీ అధికారులకు సవాల్ విసిరిన చిరుత.. మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. కాసేపట్లో అటవీశాఖ అధికారులు చిరుతను జూపార్క్‌కు తరలించనున్నారు.

# అవును, ట్రంప్ చెప్పింది నిజమే.. భారత్‌ది ఒక డెడ్ ఎకానమీ: రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ, జులై 31: ఇండియన్ ఎకానమీ గురించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల గాంధీ పూర్తిగా సమర్థించారు. ట్రంప్ చెప్పినట్టు ఇండియన్ ఎకానమీ.. డెడ్ ఎకానమీనే అని రాహుల్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ చెప్పింది నిజమేనని.. ప్రధాని మోదీ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థను చంపేశారని సంచలన కామెంట్స్ చేశారు. మోదీ నే దేశ ఎకానమీని చంపేశారన్నారు. ఇవాళ పార్లమెంట్ ఆవరణలో ట్రంప్ చేసిన కామెంట్స్ పై రాహుల్ రియాక్ట్ అయ్యారు. అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమే.. ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈ విషయం తెలుసునని రాహుల్ గాంధీ అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని చెప్పారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బిజెపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. కాగా, ఇండియా మీద అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిన్నటి నుంచి వరుసగా వ్యాఖ్యలు చేస్తున్నారు. భారత్ పై 25 శాతం సుంకంతోపాటు జరిమానా కూడా విధిస్తామని ప్రకటన చేసిన ట్రంప్.. ఆ తర్వాత ఇండియాది డెడ్ ఎకానమి అంటూ వ్యాఖ్యానించారు. ఇండియా.. రష్యాతో స్నేహం కోరుకుంటోందని.. కానీ రష్యా లాగే ఇండియన్ ఎకానమీ కూడా డెడ్ ఎకానమీ అని ట్రంప్ అన్నారు.

ఈ రెండు దేశాలు పతనమైన ఆర్థిక వ్యవస్థలను మరింత కిందికి తీసుకెళతాయని, అయితే దానిని తాను అస్సలు పట్టించుకోనంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు.




# యూపీఐ లావాదేవీలు.. పేమెంట్ అగ్రిగేటర్లకు షాక్..!

## యూపీఐ లావాదేవీలు.. పేటీఎం, గూగుల్‌పేకు ఐసీఐసీఐ షాక్

యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గల్లీ దుకాణాల దగ్గర్నుంచి మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు సిద్ధమైంది ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది.

ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు సమాచారం.

**కళ్లతో చెల్లింపులు చేయొచ్చు.. పిన్ అవసరం లేదు...** ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తోంది. ఈ క్రమంలోనే ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు. "ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలి" అని అన్నారు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.

# రోహింగ్యాలపై సుప్రీంకోర్టు ఆసక్తికర ప్రశ్నలు

ఢిల్లీ, జులై 31: రోహింగ్యాల విషయమై కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆసక్తికర ప్రశ్నలు అడిగింది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇవాళ(గురువారం) విచారణ చేపట్టింది. రోహింగ్యాలను శరణార్థులుగా ప్రకటించేందుకు అర్హులేనా? అని ప్రశ్నించిన సుప్రీంకోర్టు.. అసలు రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేల్చాలని ఆదేశించింది. ఒకవేళ రోహింగ్యాలు చొరబాటుదారులైతే బహిష్కరిస్తున్నారా? అని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, రోహింగ్యాల బహిష్కరణకు కేంద్రం, రాష్ట్రాలు తీసుకున్న చర్యలేంటని కూడా అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపంకర్ దత్తా ఇంకా ఎన్.కోటీశ్వర్ సింగ్ లతో కూడిన బెంచ్ ఈ అంశంపై విచారణ జరిపింది. రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేలాక ఇతర సమస్యలు, పర్యవసానాల గురించి మాట్లాడవచ్చని అభిప్రాయపడింది. ఒకవేళ రోహింగ్యాలు శరణార్థులుగా ప్రకటిస్తే, వారికి ఏ రక్షణలు లేదా హక్కులు ఉన్నాయో చెప్పాలని బెంచ్ ప్రశ్నించింది. అక్రమ వలసదారులైతే, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? వారిని నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిల్‌పై విడుదల చేయవచ్చా.. అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని పిటిషనర్ల తరపున న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని పేర్కొంది. కాగా, రోహింగ్యాలు దేశంలో 12 రాష్ట్రాల్లో నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ, ఢిల్లీ, యూపీ, వెస్ట్ బెంగాల్, తమిళనాడులో అధికంగా, మరికొన్ని రాష్ట్రాల్లో తక్కువగా రోహింగ్యాలు ఉన్నట్టు సమాచారం.

# పార్టీ ఫిరాయింపులపై సుప్రీం తీర్పు.. మంచి పరిణామం: రామచందర్‌రావు




హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటుందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

# ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్‌కు సుప్రీంకోర్టు సూచనలు మాత్రమే చేసింది: అద్దంకి దయాకర్



హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. "భారత రాష్ట్ర సమితి నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు భారత రాష్ట్ర సమితి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బతికించాం. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై మేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం"అని అద్దంకి దయాకర్ అన్నారు.

# 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి: కేటీఆర్



హైదరాబాద్: 'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. "రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం



గజ్వేల్: ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నేతలతో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు.

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు భేటీకి హాజరయ్యారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఈ అంశంపై నేతల మధ్య చర్చ జరిగినట్టు సమాచారం.

# సుప్రీంకోర్టు తీర్పును భారాస స్వాగతిస్తోంది: ఎమ్మెల్యే కేపీ వివేకానంద

హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే కేపీ వివేకానంద చెప్పారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్ర లో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంపై ముఖ్యమంత్రికి గౌరవం ఉంటే వెంటనే 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. గతంలో న్యాయవ్యవస్థను శాసించే విధంగా సీఎం వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.



# ఈడీ ఎంట్రీతో జగన్ సీన్ చేంజ్!

విజయవాడ, జులై 31: ఏపీలో సంచలనంగా మారిన లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఈడీ ఎంట్రీ ఇచ్చింది. ఈ కేసులో భాగంగా రూ.11 కోట్ల సీజ్‌కు సంబంధించిన వివరాలు కావాలని సిట్‌ను ఈడీ కోరింది. లిక్కర్ కేసులో ఇప్పటికే ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిన్న శంషాబాద్ కాచారంలో సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఈడీ కోరింది.

**జగన్ అరెస్ట్ అవుతారంటూ..!...** ఇదే కేసులో ఇప్పటికే రాజ్ కేసిరెడ్డి స్టేట్మెంట్ రికార్డు చేసిన ఈడి.. ఇటీవల చంద్ర రెడ్డి సైతం విచారించింది. తాజాగా ఈ రూ.11 కోట్లు సీజ్ చేసిన వ్యవహారంలో మరికొందరికి ఈడీ నోటీసులు ఇవ్వనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఓవైపు సిట్, మరోవైపు ఈడీ విచారణను వేగవంతం చేసింది. ఇదిలా ఉంటే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ స్కామ్ కేసులో అసలు పాత్రధారి జగనే అంటూ కొన్ని కథనాలు వచ్చాయి. ఒకవేళ ఇప్పటికే ఈ కేసులో అరెస్టైన నిందితులు ఇచ్చే స్టేట్మెంట్ లో జగన్ పేరు వస్తే ఆయన్ను అరెస్ట్ చేస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. మరి ఈ కేసు ఎటు దారి తీస్తుందో వేచి చూడాలి.

**మరో కీలక నిందితుడు అరెస్ట్..** లిక్కర్ స్కామ్ కేసులో మరొకరిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కీలక నిందితుడు వరుణ్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. A1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కలెక్షన్ గ్యాంగ్‌లో వరుణ్ కీలక వ్యక్తిగా గుర్తించారు. అయితే ఈ లిక్కర్ కేసు నమోదైన వెంటనే వరుణ్‌ను కొందరు కీలక వ్యక్తులు దేశం దాటించారు. ఇప్పటికే వరుణ్‌పై విజయవాడ కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ అయింది. ఈ కేసుకు సంబంధించి వరుణ్ నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. ఇవాళ, రేపు మరికొన్ని ప్రాంతాల్లో సిట్ అధికారులు సోదాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డితో సహా మరో 12 మందిని సిట్ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# భారత జాతీయోద్యమ పిత బాలగంగాధర తిలక్ - ఆగస్టు 1...తిలక్ వర్ధంతి



బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 – ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యగమూర్తుల్లతో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భారత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహోనేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు. బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో–వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ల సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3-డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజపత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్-బాల్-పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరిచే భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చునే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు చరిత్రను గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆయనకు ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే అతను "గీతారహస్యం" అనే పుస్తకం రాశారు. తిలక్ చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని ఆయన అభిప్రాయం. భగవద్గీతపై ఆయన రచించిన భాష్యం–856 పేజీల గీతా రహస్యం అనే ఉద్గ్రంథం మొదటి కూర్పు ఆరు వేల ప్రతులు ఒక పక్షంలోనే అమ్ముడు పోయాయంటే అది ఎంత ప్రజాభిమానమైన గ్రంథమో స్పష్టం అవుతున్నది. అనేక భారతీయ భాషల్లో దాని అనువాదాలు వెలువడ్డాయి. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్‌ని స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్య భారత దేశంలో గ్రామ గ్రామాన తిరిగారు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్‌లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొన సాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో ఆయన లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రెటరీ ఆఫ్ స్టేట్ మాంటెగ్యు "బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారత దేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచ డానికి వీలుగా అన్ని పాలనాశాఖల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్ని వ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించారు. బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది 20 వేలమంది ఫ్రెషర్లను నియమించుకుంటామని ప్రకటించింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 17 వేల మందిని నియమించుకున్నామని, మరో 20వేల మంది కాలేజీ గ్రాడ్యుయేట్లను ఈ ఏడాది నియమించుకుంటామని కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్ వెల్లడించారు. ఈ మేరకు ఓ ఆంగ్ల దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐ, వేతనాల పెంపు వంటి అంశాలపైనా మాట్లాడారు. దాదాపు 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామన్న టీసీఎస్ ప్రకటన వేళ ఇన్ఫీ నుంచి ఈ ప్రకటన వెలువడడం గమనార్హం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నైపుణ్య శిక్షణ వంటి అంశాల్లో ఇన్ఫోసిస్ వ్యూహాత్మకంగా ముందుకెళుతోందని సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో ఉన్న 2.75 లక్షల మందికి ఉద్యోగులకు ఆయా విభాగాలలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఏఐతో ఆటోమేషన్ సాధ్యమవుతుందని, అదే సమయంలో ఉన్నతస్థాయి నైపుణ్యం కలిగిన మానవవనరుల అవసరం కూడా ఉంటుందని తెలిపారు. ఇన్ఫోసిస్ దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా ఉద్యోగుల సంఖ్యను ముమ్మందు మరింత పెంచుకుంటుందని చెప్పారు.

ఏఐ ఆధారిత ఆటోమేషన్ వల్ల సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విషయంలో 5 నుంచి 15 శాతం మేర ఉత్పాదకత పెరుగుతోందని సలీల్ పేర్కొన్నారు. నిపుణుల పర్యవేక్షణలో చేపట్టిన ఆటోమేషన్ కారణంగా తమ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్ ఇన్ఫోసిస్ ఫినాకిల్ 20 శాతం అదనపు ఉత్పాదకత సాధించినట్లు పేర్కొన్నారు. కాబట్టి ఏఐకి నైపుణ్యం కలిగిన మానవ వనరులు తోడైతే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. వేతన పెంపు గురించిన ప్రశ్నకు.. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రక్రియ పూర్తయ్యిందని, తదుపరి పెంపు గురించి సరైన సమయంలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.




ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల్ని నియంత్రించేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ జిల్లా యంత్రాంగం కీలక చర్యలకు సిద్ధమైంది. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా పెట్రోల్ పంపుల వద్దకు వస్తే.. వారికి ఇంధనం నింపేందుకు అనుమతి నిరాకరించనుంది. ఈ నిర్ణయం ఆగస్టు 1 నుంచే అమలులోకి వస్తుందని అధికారులు బుధవారం వెల్లడించారు. మంగళవారం జరిగిన సమావేశంలో రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించేలా, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్టులు పెట్టుకొనేలా ఇందౌర్‌లో ఓ క్యాంపెయిన్ చేపట్టాలని సప్రే ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లేకుండా వస్తే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించనున్నట్లు ఇందౌర్ జిల్లా మెజిస్ట్రేట్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే.. సంబంధిత పెట్రోల్ బంకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏడాది జైలు శిక్ష లేదా రూ.5వేల జరిమానా లేదా రెండూ ఉండే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఇందౌర్ రోడ్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఇటీవల మధ్యప్రదేశ్ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన నేపథ్యంలో ఇందౌర్ జిల్లా యంత్రాంగం కఠినచర్యలకు ఉపక్రమించింది.

# తల్లిపాలకు మించిన ఆహారం లేదు... తల్లిపాలకు ప్రత్యామ్నాయం కానరాదు

## ఆగష్టు 1నుండి 7వరకు... తల్లిపాల వారోత్సవాల సందర్భంగా



పిల్లలకు తల్లిపాలు అత్యంత శ్రేష్ఠమనీ, చంటి పిల్లలకు చనుబాలిస్తేనే తల్లికి జన్మ ధన్యమైనట్లనీ, పాలిచ్చేతల్లి ఉంటే చంటిపిల్లలకు ఇంక ప్రపంచంలో ఏమీ అవసరం లేదనీ ఒకనాడు భావించే వారు. పిల్లల్ని కనడం, పాలివ్వడం ఒక వరంగా, మాతృత్వానికి పరాకాష్టగా భావించేవారు ఆనాడు. తల్లిపాల ద్వారా ప్రపంచం లోని క్షీరదాలు తమ పిల్లలను తమ పాలతోనే పెంచుతున్నప్పటికీ, ప్రకృతి సహజంగా ప్రసాదించిన తల్లి పాలను ఉపయోగించుకోక పోవడం మానవజాతి పరిణామంలో ఒక చిత్రాతి చిత్రమైన పరిస్థితి. నేడు వివిధ కారణాల వల్ల తల్లిపాలకు ప్రత్యమ్నాయం అనుసరించడం అత్యంత బాధాకరం. తల్లిపాలను భారత దేశంలో కేవలం 37 శాతం మంది పిల్లలే ఆరునెలల వరకు తాగుతున్నారు. అంటే పిల్లలకు ఎంత తక్కువ పాళ్ళల్లో తల్లి పాలు అందిస్తున్నారో అర్థం అవుతోంది. కారణం తల్లిపాల గొప్పతనం తెలియక పోవడం కావచ్చు, కొంతమంది వక్షోజాలు అందం తగ్గుతుందనో, లేదా ఇచ్చే వెసులుబాటు లేకపోవడమో కానీ చాలామంది శిశువులకి తల్లిపాల రుచి అందడం లేదు. నిజానికి చనుబాలు పిల్లలకు ప్రత్యేక ఔషధంగా పనిచేస్తాయి. తల్లిపాలను సరిగ్గా పిల్లలకు ఇవ్వగలిగితే ఏటా 8.23 లక్షల మంది పిల్లలను ఐదేళ్ల లోపు మరణించకుండా కాపాడు కోవచ్చు. పిల్లలకు చనుబాలు ఇవ్వక పోవడం వల్ల, రొమ్ము కేన్సర్లతో మరణిస్తున్న మహిళల సంఖ్య 20 వేల వరకు ఉంది అంటే ఈ సమస్య ఎంత ఎక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తల్లి పాల విశిష్టతను తెలిపే రీతిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగష్టు నెల మొదటి వారం రోజులు తల్లిపాల వారోత్సవాలుగా వాబా (వరల్డ్ అలైన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ ఎక్షన్ ) సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యు. హెచ్.ఓ, యునిసెఫ్, బి.పి.ఎన్.ఐ వంటి అంతర్జాతీయ, జాతీయ సంస్థల అనుబంధంగా జరుపు తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. పుట్టిన పసి పిల్లలకు శక్తితో పాటు, శారీరక అనారోగ్య సమస్యలు, మానసిక పరమైన సమస్యలను తల్లి పాలు దరిచేర నియ్యవు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వకుంటే భవిష్యత్తులో పలు విధాలైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శిశువుకు తల్లిపాలను మించిన ఆహారం లేదు. ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన తల్లిపాలను తాగించినప్పుడే బిడ్డ ఆరోగ్యంగా పెరగ గలుగుతుంది. తల్లి పాలలో కార్బోహైడ్రేట్స్ 7.1%, ఫాట్స్ 4.5%, ప్రోటీన్స్ 0.9%, మినరల్స్ 0.2%, డైజెస్టివ్ ఎంజైమ్స్, హార్మోన్లు, విటమిన్లు, యాంటీ బాడీలు, లింఫోసైట్లు ఉంటాయి. అందుకే తల్లిపాలను తప్పని సరిగా తాగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తోంది. కన్న బిడ్డకు తల్లిపాలు పట్టించడం చాలా అవసరం. తల్లి పాలు తాగడం వల్ల పుట్టిన బిడ్డ రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కనుక బిడ్డకు కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. మార్గదర్శకాల ప్రకారం 6 నెలల తర్వాత చనుబాలు మరిచి పోయేలా చేసి మరో ప్రత్నామ్నాయ ఆహారం ఇవ్వడం ప్రారంభించాలి. బిడ్డకు అవసరమైన పోషకాలు తల్లిపాల ద్వారా లభించాక, ఇతర ఆహారాల ద్వారా పిల్లలకు పోషకాలను అందించాలి. తల్లి బిడ్డకు తన చను పాలు ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుంది. అంతేకాకుండా తల్లికి కూడా మేలు జరుగుతుంది. తల్లిపాలు పట్టించడం వల్ల శిశుకు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ, డయేరియా, వాంతుల సమస్య నుంచి రక్షణ లభిస్తుంది. పిల్లలు పెద్దయ్యాక ఊబకాయం, మరికొన్ని ఇతర అనారోగ్య సమస్యల ముప్పు తగ్గుతుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. ప్రసవమయిన మొదటి రోజు నుండీ నాలుగు రోజుల వరకూ రొమ్ముల నుండీ చిక్కటి పసుపు పచ్చటి ద్రవం స్రవిస్తుంది. దీనిని కొలోస్ట్రమ్ లేదా "ముర్రుపాలు" అంటారు. ఆ తర్వాతే తెల్లటి పాలు వస్తాయి. ఈ ముర్రుపాలు శిశువులకు చాలా ముఖ్యం. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా బిడ్డకు జీర్ణకోశ సంబంధిత సమస్యలు ఉండవు. జీర్ణకోశ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. చాలా తేలికగా అరుగుదల జరుగుతుంది. బిడ్డకు మలబద్ధక సమస్య ఉండదు. తల్లిపాల వలన ఆస్తమా, చెవి సంబందించిన వ్యాధులు రాకుండా కాపాడుతుంది. తల్లిపాల వలన... స్థూలకాయం ఉండదని శాస్త్రవేత్తల పరిశోధన వలన తేలింది. తల్లిపాలు... పిల్లల దశలో లుకేమియా వ్యాధి రాకుండా, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి పెద్ద వయస్సులో రాకుండా కాపాడుతుంది. తల్లిపాలు – పిల్లల తెలివి తేటలను పెంచుతుంది. తల్లి పాలలో చాలా ఫాటీ ఆసిడ్స్ ఉన్నందున, ఇవి పిల్లలలో మెదడు పెరుగుదలకు ఉపయోగ పడుతుంది. తల్లి పాలకు ఖర్చు పెట్టవలసిన అవసరం లేదు. తల్లి ఒడిలో బిడ్డ ఉన్నందున బిడ్డ చాలా అనుకూలమైన స్థితిలో ఉంటుంది. తల్లి బిడ్డల మధ్య బాంధవ్యం పెరుగుతుంది. అలాగే తల్లికి కల లాభాలలో తల్లిపాలు ఇచ్చినందు వలన తల్లికి ప్రసవానంతర సమయంలో బరువు తగ్గుటకు దోహద పడుతుంది. మానసిక వత్తిడిని తగ్గించి బాలింత దశలో రక్తస్రావాన్ని తగ్గిస్తుంది. తల్లికి రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ లాంటివి రాకుండా స్త్రీని కాపాడుతుంది. ఎంత ఎక్కువ కాలం తల్లి బిడ్డకు పాలు ఇస్తే అంత మంచిది. వ్యాధులు నుండి అంతే ఎక్కువ కాపాడుతుంది. ఆవు లేక గేదె పాలు తీసుకున్న పిల్లలు ఎక్కువ అలర్జీ సమస్యలకు గురి అవుతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




పహల్గాం ఉగ్ర దాడి ముష్కరులను 'ఆపరేషన్ మహాదేవ్' ద్వారా హతమార్చామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం లోక్‌సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఈవిషయాన్ని ఆయన ధ్రువీకరించారు. ఈ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు చివరిసారిగా ఎం–9, రెండు ఏకే 47 తుపాకులు ఉపయోగించారు. ఆ తర్వాత మూడు నెలల పాటు ఉగ్రవాదులు సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్ ఎవరికంటా పడకుండా దాక్కున్నారు. అయితే.. పాకిస్థాన్ జాతీయులైన వీరు తిరిగి తమ దేశానికి వెళ్లలేకపోయారు. భద్రతా దళాల వ్యూహం కారణంగా వారు తప్పించుకోలేకపోయారు. పహల్గాం దాడి అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఉన్నతాధికారులు కశ్మీర్‌కు వెళ్లిన సమయంలోనే ఈ వ్యూహాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ముష్కరులు తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూడాలని అమిత్ షా భద్రతా బలగాలకు స్పష్టంచేసినట్లు సమాచారం. ఉగ్రవాదులు వినియోగించిన 8 కి.మీ. మార్గాన్ని భద్రతా బలగాలు గుర్తించి.. ఆ ప్రాంతంలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశాయి. ముష్కరులు చొరబాటుకు ఉపయోగించిన ఓ రహస్య టన్నెల్‌ను భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సొరంగాలను వరదలతో ముంచెత్తించారు. దీంతో ఉగ్రవాదులు తప్పించుకునే మార్గం లేకుండా పోయింది. ఆ తర్వాత దళాలు ముష్కరులు ఉన్న ప్రాంతాన్ని ట్రాక్ చేసి.. వారిని మట్టుబెట్టాయి. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో చనిపోయింది పహల్గాంలో దాడికి పాల్పడిన వారా? కాదా? అనే విషయాన్ని నిర్ధరించుకున్న తర్వాతే పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేశారు. "ముగ్గురు ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఒక ఎం–9, రెండు ఏకే–47 తుపాకులను సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో శ్రీనగర్ నుంచి చండీగఢ్ పంపాం. అక్కడి కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాం. ఆ తుపాకుల నుంచి తూటాలు ప్రయోగాత్మకంగా నిపుణులు పేల్చి చూశారు. అనంతరం ఖాళీ తూటాలను.. పహల్గాం వద్ద లభ్యమైన వాటితో పోల్చి చూశారు. పహల్గాం ఊచకోతలో వాడింది ఈ తుపాకులేనని మంగళవారం తెల్లవారుజామున 4.46 గంటలకు ఆరుగురు ఫోరెన్సిక్ నిపుణులు వీడియోకాల్ ద్వారా నాకు తెలియజేశారు" అని అమిత్ షా పేర్కొన్నారు.

# ఆ 2వేలమందికోసం కోర్టు చాలదు..స్టేడియం కావాలి:

## తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీం వ్యాఖ్యలు

మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విషయంలో తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేశారని బాలాజీపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విచారణను తమిళనాడు ప్రభుత్వం కావాలని ఆలస్యం చేస్తున్నట్లు కనిపిస్తోందని ఇప్పటికే ఈ కేసు విచారణలో భాగంగా సుప్రీం ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం కేసును మూసివేయడానికి ప్రయత్నిస్తే న్యాయశాఖ అడ్డుకుందని తాజాగా మందలించింది. "ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులు ఉన్నారు. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమో. అలాగే ఆ నిందితులందరికీ ఈ కోర్టు గది సరిపోదు.. ఒక క్రికెట్ స్టేడియం కావాలి" అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరిట కొందరి నుంచి లంచాలు తీసుకున్నారంటూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన డీఎంకేలో చేరి మంత్రి అయ్యారు. పాతకేసులో సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 2023లో అరెస్టు చేసింది. ఏడాదికిపైగా జైల్లో ఉన్న ఆయన గతేడాది బెయిల్‌పై బయటికొచ్చారు. ఆయనను స్టాలిన్ సర్కారు వెంటనే మళ్లీ మంత్రిని చేసింది. ఈ కేసులో సుప్రీంకోర్టు కు చేరడంతో సెంథిల్‌బాలాజీ తన పదవికి రాజీనామా చేసిన సంగతి విదితమే. నిన్నటి విచారణలో.."నాడు ఉద్యోగాల కోసం డబ్బులు ముట్టజెప్పిన 2 వేల మంది నుంచి 2,500 మంది బాధితులను.. లంచాలిచ్చిన వారంటూ రెండు కేసుల్లో నిందితులుగా చేర్చడానికి కారణమేమిటి? వారందరినీ విచారించడం ఎప్పటికి పూర్తవుతుంది?" అని మందలించిన సంగతి తెలిసిందే.

# ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవం... జ్ఞాన విప్లవానికి నాంది పలికిన దినం - ఆగస్టు 1...ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవం




ఆధునిక సమాచార విప్లవాన్ని చాటే మైలురాయిగా నిలిచింది ప్రపంచ వ్యాప్త వెబ్ ఆవిష్కరణ. ఇది కేవలం సాంకేతిక సౌలభ్యానికి మించిన మార్పు. ఇది ప్రపంచాన్ని కొత్తగా అనుసంధానించిన సామూహిక విజ్ఞాన వేదిక. వెబ్ అనేది ఒక సాంకేతిక ఆవిష్కరణకే కాదు, మానవతా దృక్కోణానికి ప్రతిరూపం. జ్ఞానం అందరికి అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రయాణం, ప్రపంచాన్ని ఒక ఊరి వంటిదిగా మార్చింది. ఈ వెబ్ అభివృద్ధికి, అందరికీ వినియోగ యోగ్యంగా మారడాన్ని పురస్కరించుకొని, జ్ఞానాన్ని, సంప్రదింపును, సంబంధాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఈ వ్యవస్థ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1న ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. వరల్డ్ వైడ్ వెబ్ సృష్టికి ఆద్యుడు బ్రిటిష్ కంప్యూటర్ శాస్త్రవేత్త టిమ్ బెర్నర్స్-లీ. 1989లో స్విట్జర్లాండ్ లోని యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రీసెర్చ్ లో పనిచేస్తున్నప్పుడు, సమాచారాన్ని సులభంగా పంచుకోవడానికి మరియు నిర్వహించడానికి ఒక మార్గం అవసరాన్ని ఆయన గుర్తించారు. దాని ఫలితంగా, ఆయన 1989లో "ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్: ఎ ప్రపోజల్" అనే పేరుతో ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు, ఇది వెబ్ పునాదికి దారితీసింది. సర్ టిమ్ బెర్నర్స్-లీ రూపొందించిన వర్ల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ) అన్నిటికంటే ముందుగా, సమాచారాన్ని స్వేచ్ఛగా, విస్తృతంగా పంచుకునే సాంకేతిక పరిష్కారంగా పరిగణించబడింది. 1991లో ఇది ప్రజలకు అందుబాటులోకి రాగా, 1993లో మొదటి గ్రాఫికల్ బ్రౌజర్ "మోజాయిక్" విడుదలైనప్పటి నుంచి వెబ్ వినియోగంలో విపరీతమైన వృద్ధి కనిపించింది. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 5.5 బిలియన్ల మందికి పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. అంటే ప్రపంచ జనాభాలో 65 శాతానికి పైగా ప్రజలు ఇంటర్నెట్ ద్వారా కనెక్ట్ అయ్యారు. వీరిలో దాదాపు 92 శాతం మంది మొబైల్ ద్వారా ఇంటర్నెట్‌ను వాడుతున్నారు. రోజుకు కనీసం 300 కోట్ల మందికి పైగా వెబ్‌సైట్లను సందర్శిస్తున్నారు. ప్రతిరోజూ సగటున 4.7 గంటల సమయాన్ని మనం ఇంటర్నెట్ వినియోగంలో గడుపుతున్నాం. ఇది మానవ జీవనశైలిని ఎలా మార్చిందన్నదికి ప్రతీక. వెబ్ ద్వారానే ప్రపంచవ్యాప్తంగా విద్య, వ్యాపారం, ఆరోగ్యం, వార్తా ప్రసారం, కమ్యూనికేషన్, వినోదం, ప్రభుత్వ పరస్పర చర్యల వరకూ అందుబాటులోకి వచ్చాయి. విద్యారంగంలో ఆన్‌లైన్ క్లాసులు, ఓపెన్ యూనివర్సిటీలు, వీడియో లెక్చర్లతో నిర్జన గ్రామాల్లో ఉన్న విద్యార్థులకూ ప్రపంచ స్థాయి విద్యను చేరవేసింది. వ్యాపార రంగంలో ఈ-కామర్స్, ఆన్‌లైన్ పేమెంట్స్ ద్వారా వినియోగదారులు, వ్యాపారులు ఒకే వేదికపైకి వచ్చారు. ఆరోగ్యరంగంలో టెలీ మెడిసిన్, డిజిటల్ హెల్త్ రికార్డులు, టెస్ట్ రిపోర్టులు డిజిటల్ ద్వారా అందుబాటులోకి రావడం ద్వారా వైద్య సేవలు వేగవంతమయ్యాయి. ఈ ప్రయోజనాల నడుమ కూడా కొన్ని ప్రధాన సవాళ్లు నిలిచినవే. డిజిటల్ విభజన పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇంకా దాదాపు 2.7 బిలియన్ల మందికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు. వీరిలో చాలా మంది మహిళలు, గ్రామీణ ప్రాంతాలవారు, అభివృద్ధి చెందని దేశాల ప్రజలు. ఈ అసమానతలను తొలగించేందుకు ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సామరస్యానికి ప్రయత్నాలు జరుగుతున్నా, మరింత సమర్థవంతంగా, సమగ్రంగా అవి జరగాల్సిన అవసరం ఉంది. మరోవైపు డేటా భద్రత, గోప్యత, నకిలీ సమాచారం వ్యాప్తి, హేట్ స్పీచ్, డార్క్ వెబ్ వంటి సమస్యలు వెబ్ వినియోగంలో ఉన్నత ప్రమాణాలకు సవాలుగా నిలుస్తున్నాయి. ఇటువంటి తరుణంలో నిబంధనలు, అంతర్జాతీయ ఒప్పందాలు, సాంకేతిక భద్రతా వ్యవస్థలు అవసరం. అంతేకాక, ప్రజలలో డిజిటల్ సావధానతపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉంది. సర్ టిమ్ బెర్నర్స్ లీ "వెబ్ ఈజ్ ఫర్ ఎవరివన్" అని అన్నదానికి అనుగుణంగా, ఇది అన్నివర్గాల ప్రజలకు సమానంగా, న్యాయంగా లభించాలి. వెబ్ ఆధారిత ప్రపంచంలో సమాచారం మాత్రమే కాదు, అవకాశాలు, అవకాశాలుగా మారిన నెవిగేషన్ కూడా అందరికీ సమానంగా ఉండాలి. అదే సత్యాన్ని ప్రపంచ వ్యాప్త వెబ్ దినోత్సవం ప్రతి సంవత్సరం మనకు గుర్తు చేస్తోంది. ఈ సందర్భంగా మనం వెబ్‌ను కేవలం వినియోగించడానికే కాదు, దానిని బాధ్యతగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపయోగపడే సాధనంగా అభివృద్ధి చేయాలన్న దిశగా ముందడుగు వేయాలి. ఇదే నిజమైన స్మార్ట్ ప్రోగ్రెస్, ఇదే డిజిటల్ మానవతా వికాస దిశగా ఆగస్టు 1 దినోత్సవం మనకు సందేశమిస్తోంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


# ముగ్గురు చక్రాలు, ఒక జీవిత యానం...ఆటో డ్రైవర్లు మానవీయతకు ప్రతి రూపం - ఆగస్టు 1... ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవం



ఆటో రిక్షా... నిత్యం నగర వీధుల్లో పరుగులు పెట్టే మూడు చక్రాల ఈ రవాణా వాహనం ఎన్నో కుటుంబాలకు జీవనాధారం, లక్షలాది ప్రయాణికులకు ప్రయాణ మాధ్యమం. ఈ వృత్తిని నిబద్ధతతో, నిరంతర శ్రమతో నడిపిస్తూ సమాజానికి సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా, వారిని గౌరవించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 1న "ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవం" నిర్వహించ బడుతోంది. అనధికారికంగా నైనా సామాజికంగా, వృత్తిపరంగా ప్రాధాన్యం పొందిన ఈ దినోత్సవం ఆటో డ్రైవర్ల హక్కులపై చైతన్యం పెంచే వేదికగా మారుతోంది. నగర జీవనంలో తప్పనిసరి మార్గ సాధనంగా మారిన ఈ మూడు చక్రాల వాహనం లక్షలాది ప్రజల ప్రయాణాన్ని, వేలాది కుటుంబాల జీవనాధారాన్ని మోస్తోంది. వీటిని నడిపే ఆటో డ్రైవర్లు తమ శ్రమతోనే నగరాన్నంతా కదిలించే చక్రధారులుగా నిలుస్తున్నారు. ఆటో డ్రైవింగ్ వృత్తి ఎంత సులువైనదో అనే అపోహ సమాజంలో ఉంది. కానీ వాస్తవంగా ఇది అనేక ఒత్తిడులతో కూడిన శ్రమాధారిత జీవనం. తెల్లవారు జామున నుంచే వీధుల్లోకి వచ్చి రాత్రి అర్ధరాత్రి వరకు వందలాది కిలోమీటర్లు నడిపించే ఆటో డ్రైవర్లు, ఒంటరి ప్రయాణికుల భద్రతకు పర్యాయంగా మారడం మొదలుకొని, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తీసుకెళ్లే మానవ సేవల వరకూ, అనేక విధాలుగా సమాజానికి ఉపయోగ పడుతున్నారు. వృద్ధులకు, చిన్నారులకు, మహిళలకు, విద్యార్థులకు, చిన్న చిన్న వాణిజ్య వ్యవహారాలకు ఆటో ఒక ముఖ్యమైన ప్రయాణ మాధ్యమం. ముఖ్యంగా బస్సు, మెట్రో, రైలు వంటి ప్రాధాన్య రవాణా మార్గాలకు చేరుకునే 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'గా ఆటో సేవలు కీలకంగా నిలుస్తున్నాయి. ట్రాఫిక్ లో నిలిచిన ఆటో ఒకటి కాదు... దాని వెనుక నడిచే జీవితం ఉంది. ట్రాఫిక్‌తో పోరాటం, ప్రయాణికుల తొందర, ఇంధన ధరల భారంగా తయారైన ఓ నిత్య శ్రమ. అయితే ఇటీవలి కాలంలో అనేక రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనంలో తీవ్రమైన ప్రభావం పడింది. ముఖ్యంగా చిన్న ప్రయాణాల కోసం ఆటో సేవలను ఉపయోగించే మహిళలు %-% ఉచిత బస్ సౌకర్యం అందుబాటులో రావడంతో ఆటో సేవలకు మళ్లక పోవడం ద్వారా ఆటో డ్రైవర్ల ఆదాయంలో గణనీయమైన తగ్గుదల చోటు చేసుకుంది. ఇది లక్షలాది డ్రైవర్లపై ఆర్థికంగా తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రయాణికుల సంఖ్య తగ్గిపోవడంతో ఆటో నడిపిన గంటలకు గిరాకీ తగ్గిపోవడం, కాలినడకన తిరుగుతూ ఖాళీ ఆటోతో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళల కోసం ఉచిత బస్ ప్రయాణం నిస్సందేహంగా సామాజికంగా ముందడుగు. అయితే అదే సమయంలో ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని కోల్పోతే, వారి కుటుంబాలు బతకలేని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ఉచిత బస్ ప్రయాణ పథకాల అమలుతో పాటు ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయ భద్రత పథకాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. వారికి ఇంధన సబ్సిడీ, బీమా సౌకర్యం, వార్షిక ఉపాధి భద్రతా నిధి వంటి విధానాలు అమలులోకి రావాలి. ఆటో వృద్ధి నిధి, వాహన నిర్వహణకు రాయితీపై రుణాలు వంటి చర్యలు తీసుకుంటేనే ఈ వృత్తి జీవించ గలదు. ఇకపోతే టెక్నాలజీ ఆధారిత క్యాబ్ సేవల పోటీతోనూ ఆటో డ్రైవర్లు ఎదురు దెబ్బలు తింటున్నారు. ఓలా, ఉబెర్ వంటి యాప్‌ల వలన ప్రయాణికులకు నూతన వెసులుబాట్లు ఏర్పడుతున్నా, ఈ పోటీలో సంప్రదాయ ఆటో డ్రైవర్ల ఆదాయం తగ్గిపోతోంది. యాప్ ఆధారిత సేవల్లో కమీషన్ల వ్యవస్థ, ప్రయాణ రేటింగ్‌ల ఒత్తిడి, నిర్దిష్ట స్థిర ఆదాయం లేకపోవడం వంటివి ఆటో డ్రైవర్ల జీవితాన్ని సంక్లిష్టం చేస్తున్నాయి. అంతేకాక ప్రభుత్వాల స్థాయిలో ఆటో వృత్తిని సమర్థించడానికి సరైన చట్టపరమైన సహాయాలు లేవు. డ్రైవర్ల శ్రామిక హక్కులు, ఆరోగ్య సౌకర్యాలు, వృత్తి గౌరవానికి చట్టబద్ధమైన అండ అవసరం. ట్రాఫిక్ పోలీసులు విధించే జరిమానాలు, నగదు లేమి వల్ల చిల్లర సమస్యలు, ప్రజల నుంచి ఎదురయ్యే అనవసర వాదనలు డ్రైవర్ల మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. చలి, చీకటి, ఎండ, వర్షం లాంటి ప్రాకృతిక పరిస్థితుల్లోనూ డ్రైవింగ్ చేయాల్సిన పరిస్థితి మరింత శ్రమ దాయకం. అయినా వీరి కృషికి సమాజం గుర్తింపు ఇవ్వక పోవడం దురదృష్టకరం. ప్రయాణికులు కూడా ఆటో డ్రైవర్ల పట్ల గౌరవంగా ప్రవర్తించాలి. చిన్న ప్రయాణాలకు ఇబ్బంది పడకుండా, సకాలంలో చెల్లింపులు చేసి, మానవీయ దృక్పథంతో ప్రవర్తించాలి. ప్రపంచ ఆటో డ్రైవర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనేక నగరాల్లో ఆటో యూనియన్లు సన్మానాలు, ఆరోగ్య శిబిరాలు, బహుమతుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఇది ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా వృత్తి గౌరవ సాధనకు మార్గంగా ఉండాలి. ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వాలు సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలి. ప్రతి నగరానికీ ఆటో డ్రైవర్ల కోసం వెల్ఫేర్ బోర్డు, ఉపాధి గ్యారంటీ పథకాలు, డిజిటల్ చెల్లింపులకు పునరుత్సాహం వంటి మార్గాలు అవసరం. మూడు చక్రాల వెనుక తిరిగే జీవితాన్ని గుర్తించి, వృత్తి గౌరవానికి గళం కలిపే రోజు ఇది. మహిళలకు ఉచిత ప్రయాణం లాంటి పథకాలు కొనసాగుతూ, ఆటో డ్రైవర్ల జీవనానికి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలి. ప్రయాణికులు, పాలకులు, సంఘాలు - అందరూ కలిసి ఈ వృత్తి పరిరక్షణకు పాటు పడితేనే నగర జీవన వ్యవస్థ మానవీయంగా ముందుకు సాగుతుంది. ఈ దినోత్సవం ద్వారా శ్రమకు గౌరవం, సేవకు గుర్తింపు అనే భావజాలం పటిష్ఠంగా స్థిరపడాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# భారత ఆధునిక జీవశాస్త్ర పితామహులు భార్గవ - ఆగస్టు 1...పుష్ప మిత్ర భార్గవ వర్ధంతి



పుష్ప మిత్ర భార్గవ ( ఫిబ్రవరి 22, 1928 – ఆగస్టు 1, 2017) (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలలో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (%జజవీదీ%) వ్యవస్థాపక డైరెక్టర్. భారత దేశంలో ఆధునిక జీవశాస్త్రం వాస్తుశిల్పిగా ప్రసిద్ధి చెందారు. భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు మరియు "జెనెటిక్ ఇంజనీరింగ్" అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. 70 వ దశకంలో బయో టెక్నాలజీ విభాగం ఏర్పాటులో భార్గవ కీలక పాత్ర పోషించారు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ మరియు రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 ఫిబ్రవరి 22 న అజయ్మేరు ( రాజస్థాన్ ) లో ఒక మధ్య తరగతి కుటుంబంలో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి భార్గవ దంపతులకు జన్మించారు. 29ఏళ్ళప్రాయంలో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి నేరుగా బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరారు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944 లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తో బీఎస్సీ, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఐఐసీటీలో, ఉస్మానియా యూనివర్సిటీలో పరోశధకుడిగా పనిచేశారు. తర్వాత 1953 నుంచి 56 వరకు అమెరికా వెళ్ళి అక్కడి యూనివర్సిటీ ఆఫ్ విస్కానిసన్, మెడిసన్‌లో ప్రఖ్యాత శాస్త్రవేత్త హెడెల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశారు. 1956– 57 వరకు లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రిసెర్చ్‌లో పనిచేసి, 1977లో ఇండియాకు వచ్చి తిరిగి హైదరాబాద్ లోని సెంట్రల్ లాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో చేరారు. తర్వాత ఐఐసీటీలో పనిచేస్తూనే, ఆధునిక జీవశాస్త్ర విభాగాలలో పరిశోధన సంస్థ అయిన హైదరాబాద్ సెంటర్ ఆఫ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీని స్థాపించారు. 1977 ఏప్రిల్ 1 న అది సెమీ అటానమస్ కేంద్రంగా స్థాపించ బడింది. 1990 లో డైరెక్టర్ పదవి నుంచి రిటైర్ అయ్యారు. భార్గవ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీలలో పనిచేశారు. 50 కి పైగా దేశాలలో పర్యటించారు. భార్గవ భారత ప్రభుత్వ విధానాల గురించి బాగా తెలిసిన వ్యక్తి. నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌లో వైస్ ఛైర్మన్ పదవిని పొందారు. జాతీయ భద్రతా సలహా మండలిలో సభ్యుడిగా, భారత ప్రభుత్వ జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీలో భారత సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. భార్గవ చాలాకాలంగా సైన్స్ మరియు హేతుబద్ధతను ప్రోత్సహించడంలో, మూఢనమ్మకాలను వ్యతిరేకించడంలో పాలు పంచు కున్నారు. 1946 లో శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌గా స్థాపించబడిన అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియా తో సంబంధం కలిగి ఉన్నారు. 1976 లో 42 వ రాజ్యాంగ సవరణలో భారతదేశ పౌరుల ప్రాథమిక విధిగా శాస్త్రీయ స్వభావాన్ని పొందు పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మాలిక్యులర్ బయాలజిస్ట్ గా ఆయన అందించిన సేవలకు గాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భార్గవ 100 కి పైగా జాతీయ మరియు అంతర్జాతీయ గౌరవాలు, పురస్కారాలను అందుకున్నారు. భార్గవ వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. 550 కి పైగా ప్రముఖ వ్యాసాలు, ఆరు పుస్తకాలు రాశారు. 125 కి పైగా శాస్త్రీయ పత్రాలను ప్రచురించారు. హైదరాబాదు లోని ఉప్పల్‌లోని ఐదు అంతస్తుల నివాసంలో ఒక అంతస్తును పరిశోధన శాలకు, మరో అంతస్తును లైబ్రరీకి కేటాయించారు. ఇటీవల వరకూ ఆయన అనేక ఫార్మా కంపెనీలకు సలహాదారుగా పని చేశారు. ఆయన సంభవన ట్రస్ట్, భోపాల్, మరియు ప్రాథమిక పరిశోధన, విద్య మరియు అభివృద్ధి సంఘం (%దీ=జూాణ%), న్యూఢిల్లీలో 2005 మరియు 2007 మధ్య నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశ వ్యాప్తంగా అసహనం, దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ.. 2016లో పద్మభూషణ్ అవార్డును వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించారు. భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయాలలో అకడమిక్ కోర్సులను ప్రవేశపెట్టాలని మరియు జ్యోతిషశాస్త్రంలో సైన్స్ డిగ్రీలను అందించాలని నిర్ణయించుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వ్రాతపూర్వక పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సిన్హా ఈ మెరిట్‌లెస్ పిటిషన్‌ను కోర్టుకు తీసుకు వచ్చినందుకు ఎలాంటి శిక్షా ఖర్చులు విధించలేదు. భార్గవ కూడా సుప్రీం కోర్టులో సంబంధిత మంత్రిత్వ శాఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాలు చేశారు. దీనిని భారత అత్యున్నత న్యాయస్థానం కూడా తోసిపుచ్చింది. పదవులు చేపట్టడానికి ఎప్పుడూ భయపడని, అధికారానికి ఎప్పుడూ తలవంచని, నచ్చని విషయాలను వ్యతిరేకించే వ్యక్తిత్వం ఉన్న పుష్ప మిత్ర భార్గవ ఆగస్టు 1, 2017 న హైదరాబాదులో మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

## సంపాదకీయం

# బంగ్లాదేశ్-చైనా-పాకిస్తాన్ సాన్నిహిత్యం

# భారత్‌కు భవిష్యత్ ముప్పు?

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దూసుకుపోతోంది. ఇటీవలే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో స్థానానికి చేరింది. ఇది దేశానికి గర్వకారణమే అయినప్పటికీ, పెరుగుతున్న అభివృద్ధి కొన్ని సవాళ్లను కూడా తీసుకొస్తుంది. ముఖ్యంగా చుట్టూ ఉన్న దేశాలతో సంబంధాలు, వాటి నుంచి ఎదురయ్యే సంభావ్య ముప్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్... చైనా ,పాకిస్తాన్‌లతో సన్నిహిత సంబంధాలు పెంచుకోవడం భారత్‌కు ఒక ప్రధాన భద్రతాపరమైన ఆందోళనగా మారుతోంది.

**పాకిస్తాన్ కుట్రలు కొనసాగుతున్నాయి...** పాకిస్తాన్ నుంచి భారత్‌కు భద్రతాపరమైన ముప్పులు ఎప్పటినుంచో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం, దేశంలో అంతర్గత అశాంతిని రెచ్చగొట్టడంలో పాకిస్తాన్ కీలక పాత్ర పోషిస్తోంది. కాశ్మీర్ విషయంలో పాక్ తన వైఖరిని మార్చుకోలేదు. ఇప్పుడు చైనాతో కలిసి పాకిస్తాన్ చేస్తున్న దూకుడు భారత భద్రతా వ్యవస్థకు గట్టి పరీక్షనే పెడుతోంది.

**చైనాతో బంగ్లాదేశ్ సాన్నిహిత్యం ఆందోళనకరం...** ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్, చైనా మధ్య వాణిజ్య, ఆర్థిక ఒప్పందాలు గణనీయంగా పెరిగాయి. చైనా అందిస్తున్న భారీ రుణాలపై బంగ్లాదేశ్ ఆసక్తి చూపడం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో భాగంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవడం భవిష్యత్తులో భారత్‌కు సవాలుగా మారే అవకాశం ఉంది. చైనా-బంగ్లాదేశ్ సంబంధాలు బలపడితే, భారత్‌కు వ్యతిరేకంగా ఒక సమీకృత శత్రుశక్తిగా ఎదిగే ప్రమాదం ఉంది.

**భారత ప్రజాస్వామ్యానికి ముప్పు?...** బంగ్లాదేశ్ ఒకప్పుడు భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించింది. అయితే, ప్రస్తుతం రాజకీయంగా కొంత దూరం పాటిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాదేశ్ కూడా చైనా, పాకిస్తాన్‌లతో కలిసి భారత్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తే, అది అంతర్గత స్థాయిలో భారత శక్తిని దెబ్బతీసే అవకాశం ఉంది.

**భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలి...** శత్రుదేశాల కలయిక భారత్‌కు ఎంత ప్రమాదకరమో చరిత్రే చెబుతోంది. అలాంటి పరిస్థితుల్లో భారత్ తన సమీప దేశాలతో సానుకూల దౌత్య సంబంధాలు కొనసాగించడమే కాకుండా, భద్రతాపరమైన చర్యల్లో ముందుండాలి. అంతర్జాతీయ స్థాయిలో మిత్రదేశాల మద్దతు కూడగట్టుకుంటూ, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల మధ్య బలపడుతున్న సంబంధాలను సరిదిద్దే విధంగా భారత్ తన వ్యూహాలను సిద్ధం చేయాలి. భారత్ అభివృద్ధి చెందుతున్న సమయంలో చుట్టూ ఉన్న పొరుగు దేశాలు శత్రువుల ముసుగులో కలిసి పనిచేయడం దేశ భద్రతకు తీవ్ర హెచ్చరిక. ఇది పెద్ద సమస్యగా మారకముందే, భారత్ తగినంత ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చురకలు



# పదేళ్లలో 18 మంది

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే బదిలీపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన కె.వినోద్‌రెడ్డి బదిలీపై దేవాదాయశాఖ హైదరాబాద్ కార్యాలయానికి డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న రాధాబాయి ఈ నెల 13న ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను చేపట్టారు.

**మొదటి నుంచీ ఇంతే..**

మొదటిసారిగా 1956లో ఆలయానికి కార్యనిర్వహణాధికారిని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 80 మంది ఈవోలుగా బాధ్యతలు నిర్వహించారు. కొందరు రెండు, మూడు దఫాలుగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ వారు సైతం ఏడాదిలోపే బదిలీ అయ్యారు. 1956 నుంచి 1965 వరకు రూప్‌లాల్ ముంతాజియం ఒక్కరే పదేళ్లపాటు ఈవోగా బాధ్యతలు నిర్వహించగా.. మిగిలిన వారిలో ఏ ఒక్కరూ చాలాకాలం పని చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. పదేళ్లలో 18 మంది ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. ఈవో రాజేశ్వర్ 2014 నుంచి 2017 వరకు విధులు నిర్వహించారు. అనంతరం 2019 వరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. క్రిష్ణప్రసాద్ 2020 నుంచి 2022 వరకు తిరిగి 2022 నుంచి 2024 బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత రామక్రిష్ణారావు కేవలం 36 రోజులు మాత్రమే ఈవోగా ఉన్నారు. ఆ తరువాత వినోద్ కుమార్ నెలపాటు విధులు నిర్వహించిన అనంతరం ఆగస్టు 2024 నుంచి 13 జూన్ 2025 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. 17 జనవరి 2022 నుంచి 9 ఆగస్టు 2022 వరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించి ఎనిమిది నెలల్లోనే బదిలీ అయ్యారు.

**పట్టు సాధించేలోపే..**

ఆలయ కార్యనిర్వహణాధికారుల బదిలీల వెనుక అనేక కారణాలున్నా



యని ప్రచారం జరుగుతోంది. పైస్థాయి అధికారుల ప్రమేయం, రాజకీయ ఒత్తిళ్లు, ఆలయంలో ప్రొటోకాల్ వివాదాలు, విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న అవకతవకల వంటివి కారణంగా భావిస్తున్నారు.

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆలయంలో అనేక సంస్కరణలు చేపట్టారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉన్న కొద్దికాలంలో భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేసి భక్తులు మన్ననలు పొందారు. సంస్కరణలు గిట్టని కొందరు ఆలయ ఉద్యోగులు, నాయకులు ఇక్కడి నుంచి సాగనంపారనే ఆరోపణలు ఉన్నాయి. ఈవోలుగా వచ్చిన వారు ఆలయంలోని వివిధ విభాగాలపై అవగాహనకు వచ్చి పట్టు సాధించేలోపే బదిలీ కాలవడంతో భక్తులకు మెరుగైన సేవలు అందలేకపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన వినోద్‌కుమార్ పట్టు సాధించి సంస్కరణలు చేస్తున్న క్రమంలో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రాధాబాయికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో వేలల్లో వచ్చే భక్తులకు ఏ మేరకు సేవలు అందుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఆలయానికి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలనే డిమాండ్ భక్తుల్లో, స్థానిక నాయకుల్లో వినిపిస్తోంది.

# చెరువులను చెరబట్టారు

పెద్దపల్లి: ఇటుక బట్టీ నిర్వాహకులు చెరువులను చెర బడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించి వాటి విధ్వంసానికి పాల్పడుతున్నారు. చెరువులో పూడిక తీస్తున్నారని నీటిపారుదలశాఖ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గనులశాఖ, గ్రామానికి చందాలిస్తున్నారని గ్రామాభివృద్ధి కమిటీలు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలోని చెరువులు రూపం కోల్పోతున్నాయి. యంత్రాలతో తోడటమే కాకుండా, జలాశయాల్లోని మట్టిని పూర్తిగా తరలించేందుకు చెరువుల మధ్యలో రోడ్లు నిర్మించారు. ఎక్కడ, ఎంత లోతులో తీయాలనే అంశాలేవి బట్టీ నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది.

**అంతటా అదే దోపిడీ**

ఉమ్మడి జిల్లాలో ఇటుక తయారీ పరిశ్రమకు సంబంధించి పెద్దపల్లి ప్రాంతంలో నాణ్యమైన చెరువు మట్టితోపాటు ఎన్టీపీసీ బూడిద అందుబాటులో ఉండటంతో.. ఈ ప్రాంతంలో 200కుపైగా ఇటుక తయారీ పరిశ్రమలున్నాయి. వీటికి అవసరమైన మట్టిని సమీప చెరువుల నుంచి తరలిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ తరలింపు ప్రక్రియ తరుచూ వివాదస్పదమవుతోంది. చెరువులో ఒక మీటరు కంటే ఎక్కువ లోతు మట్టి తీయొద్దనే నిబంధన ఎక్కడ అమలు కావడంలేదు. భారీ యంత్రాలతో తరలించడంతో కనీసం పది నుంచి 20 అడుగుల గుంతలు ఏర్పడుతున్నాయి.

**రెట్టింపు పరిమాణంలో తరలింపు**

తాజాగా పెద్దపల్లి మండలం బొంపల్లిలోని రాచర్లకుంటలో ఏకంగా రోడ్డును నిర్మించి, మట్టిని తరలిస్తున్నారు. వర్షం నీరు చెరువులోకి రాకుండా చుట్టూ కందకాలు తవ్వి, నీటిని బయటకు పంపించేందుకు కచ్చా కాలువలు తవ్వారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో చెరువుల నుంచి అనుమతించిన దాటికంటే రెట్టింపు పరిమాణంలో మట్టిని తరలిస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో చెరువులతోపాటు మానేరు జలాశయం నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. గతేడాది ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి మట్టి తరలించడం వివాదానికి దారితీసింది.

**భారీగా వసూళ్లు**

బట్టీ నిర్వాహకుల బలహీనతను ఆసరా చేసుకొని మట్టి ధరను రెట్టింపు చేయడంపై ఉన్న దృష్టి చెరువు పరిరక్షణపై లేకుండా పోతుంది. నిబంధనల ప్రకారం మట్టి లేదా ఇసుకకు క్యూబిక్ మీటర్ చొప్పున రేటు నిర్ణయించి పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో టిప్పర్(సుమారు 40 మెట్రిక్ టన్నులు)కు రూ.వెయ్యి వరకు చెల్లిస్తే సరిపోతుంది. అయితే పెద్దపల్లిలో మాత్రం దాదాపు రూ.2700 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు బావుల మాదిరిగా మారిపోయి, దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. చెరువుల్లో మోటార్లు పెట్టుకొని రైతులు సాగు చేసే దుస్థితి వచ్చినా ఆశ్చర్యం కలగకపోవచ్చు.

# ప్రాథమిక బడుల్లో ప్రీప్రైమరీ తరగతులు



కరీంనగర్ : నూతన విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసి ప్రవేశాలు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని 81 పాఠశాలల్లో పూర్వప్రాథమిక విద్య తరగతులను ప్రారంభించింది. ఇప్పుడు మరిన్ని పాఠశాలల్లో మొదలు పెట్టాలని సమగ్ర శిక్షా, విద్యాశాఖల ఉన్నతాధికారులు డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తాజాగా 59 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను బోధించి వచ్చే విద్యాసంవత్సరంలో వారికి 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఈ ఏడాది వేసవి సెలవులకు ముందు పూర్వప్రాథమిక విద్య తరగతులు ఏర్పాటు చేయడానికి ఆయా జిల్లాల విద్య, మహిళ, శిశుసంక్షేమ, వైద్య, ఆరోగ్య సంక్షేమ శాఖలు ఇచ్చిన వివరాల ప్రకారం పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యాసంవత్సరం ఆరంభంలో పెద్దపల్లి జిల్లాలో 46 పాఠశాలల్లో, జగిత్యాలలో 32, కరీంనగర్‌లో 3 పాఠశాలల్లో ఈ తరగతులను ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం ఏర్పాటు కాలేదు. తాజాగా జగిత్యాల జిల్లాలో 15, కరీంనగర్‌లో 19, పెద్దపల్లిలో 12, రాజన్న సిరిసిల్లలో 13 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు.

**ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా**

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ప్రతి పాఠశాలకు ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలోని ఎంపికల కమిటీ నియమించాలని రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్, ఆయాకు 7వ తరగతి విద్యార్హతలు ఉండాలి. పాఠశాలగల హాబిటేషన్, పంచాయతీ పరిధిలోని వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ప్రవేశాలు పొందిన బాలల పేర్లు యూడైస్‌లో పొందుపర్చడంతోపాటు మధ్యాహ్న భోజనం, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి బలవర్ధక ఆహారాన్ని అందిస్తారు.

**నియామకాలతో మేలు**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత నెలలో కొత్తగా ఏర్పాటైన 81 పాఠశాలల్లోని ప్రీప్రైమరీ తరగతులకు ఇప్పటివరకు ఇన్‌స్ట్రక్టర్లను ప్రభుత్వం నియమించలేదు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులే బోధిస్తుండటంతో వారిపై అదనపు భారం పడుతోంది. అలాగే పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వీటి బాధ్యతలను కూడా చూస్తున్నారు. తాజాగా ఉన్నతాధికారుల మార్గనిర్దేశాలతో నియామకాలు చేపడితే పూర్వ ప్రాథమిక విద్యలో చేరిన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. అదే విధంగా ప్రవేశాలు కూడా పెరుగుతాయి.

# నిర్లక్ష్యం.. తాగునీటి సరఫరాకు శాపం



సిరిసిల్ల : జ్యోతినగర్ రిజర్వాయర్‌లో చెడిపోయిన షట్టర్ వాల్వును పక్కనపెట్టగా ప్రస్తుతం పని చేస్తున్న వాల్వు నాలుగు వరుసల్లో తిప్పుతూ నడిపిస్తున్నారు. అది కూడా ఏ సమయంలో ఆగిపోతుందో తెలియదు. ఒకటి రిజర్వ్‌లో ఉంచుకోవాల్సి ఉండగా మూడుకు మూడు పని చేయని స్థితిలో ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయాలంటే ఆదిలాబాద్‌కు పరుగులు పెట్టాలి. కనీసం నాలుగు రోజుల సమయం పడుతుంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో హైలెవల్ జోన్ పరిధి జ్యోతినగర్ రిజర్వాయర్ నుంచి అన్ని ట్యాంకులకు నీటి పంపిణీ జరుగుతోంది. సుమారు 30 డివిజన్ల ప్రజలకు ఈ రిజర్వాయర్ ద్వారానే తాగునీటి సరఫరా అవుతోంది. అలాంటిచోట ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. మోటార్లు, వైరింగ్, స్టాటర్లు, ఫ్యూజులు సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉంటుంది.

**షట్టర్ మూసుకుంటే నీటి సరఫరా బంద్**

జ్యోతినగర్ రిజర్వాయర్‌లో షట్టర్లు మూసుకుపోతే అంబేడ్కర్‌నగర్, జ్యోతినగర్, మల్కాపూర్, ఎస్‌ఆర్‌ఆర్ ట్యాంకుల పరిధిలో నీటి సరఫరా పూర్తిగా బంద్ అవనుంది. ఒకటి మరమ్మతుల కేంద్రంలోనే ఉండగా మరొకటి చెడిపోయింది. ఇంకొకటి అప్పుడో.. ఇప్పుడో అన్నట్లు తయారైంది. ఇప్పటికే తరచూ అంబేడ్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో చీటికీమాటికి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇంజినీరింగ్ అధికారులు నీటి సరఫరాకు సమస్యలు రాకుండా ముందుగానే ప్రణాళికలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**కాలిన మోటార్లు కాలినట్లే..**

ఫిల్టర్‌బెడ్ మొదలుకొని పంపింగ్ చేసే రిజర్వాయర్ల వరకు మోటార్లు కాలిపోతే మరమ్మతులు చేయడం లేదు. స్టాండ్‌బై మోటార్లు లేకపోవడం, ఏదైనా కాలితే అప్పటికప్పుడు బిగించి నీటి సరఫరా చేసేలా అదనంగా మోటార్లు ఉండటం లేదు. జ్యోతినగర్ రిజర్వాయర్‌లో మూడు మోటార్లు రోజుల తరబడి మూలనపడి ఉన్నాయి.

**అంతరాయం లేకుండా చర్యలు**

– లచ్చిరెడ్డి, డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. షట్టర్లు, మోటార్లు మరమ్మతులు చేయిస్తున్నాం. టెండర్‌లో లేని వాటికి బిల్లులు పెడితే ఆడిట్‌లో ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ఇబ్బందికరంగా ఉంది.

అంబేడ్కర్‌నగర్, ఎస్‌ఆర్‌ఆర్, మల్కాపూర్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేయాలంటే మోటార్లు నిరంతరం నడిపించాలి. ప్రస్తుతం అన్ని మోటార్లు నడుస్తుండగా ఏ ఒక్క మోటారు స్టాండ్‌బైలో లేదు. రెండు 40 హెచ్‌పీ మోటార్లు, ఒకటి 30 హెచ్‌పీ మోటార్లు మరమ్మతు చేయకుండా అక్కడే వదిలేశారు. వీటితోపాటు విలీన కాలనీల్లోని మోటార్లు అలాగే నిర్లక్ష్యంగా వదిలేశారు.

# నిబంధనలు సఫలమేనా!



ఖమ్మం : మాతృత్వం, మాధుర్యం.. రెండూ విడదీయలేని పదాలు. అమ్మదనపు కమ్మదనాన్ని అనుభవించేందుకు మహిళలు గర్భందాల్చింది మొదలు ఎన్నో ఇబ్బందుల్ని పంటిబిగువన అణుచుకుంటారు. కంటిలోనే దాచుకుంటారు.. దురదృష్టవశాత్తు దంపతుల్లో తలెత్తే శారీరక సమస్యల కారణంగా సంతానోత్పత్తి కాకపోతే వారి మానసిక వేదన చెప్పనలవి కాదు.. కడుపున పుట్టే బిడ్డతో 'అమ్మా, నాన్న' అనిపించుకోవాలని తపిస్తుంటారు. కనిపించిన దైవాలకూ మొక్కుతుంటారు. అలాంటి దంపతుల బాధలు తీర్చేలా అత్యాధునిక చికిత్సా పద్ధతులు ముందుకొచ్చాయి. దురదృష్టవశాత్తు సంతానలేమితో బాధపడేవారి కాంక్షలను కొన్ని ప్రైవేటు వైద్యశాలలు సొమ్ము చేసుకుంటున్నాయి. సరోగసీ పేరుతో హైదరాబాద్‌లో జరిగిన తాజా ఉదంతం ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాల్లో చీకటి కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. విలువలకు తిలోదకాలిచ్చిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలో సంతాన సాఫల్య కేంద్రాల పరిస్థితి ఏంటి? అనుమతులు ఎన్నింటికి ఉన్నాయి? నిబంధనలు ఏం చెబుతున్నాయి? అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది తదితర వివరాలతో కథనం.ఖమ్మం నగరంలో ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాల సంఖ్య కొన్నేళ్ల వ్యవధిలో బాగా పెరిగాయి. సంతాన సాఫల్య చికిత్సకు ఖమ్మం చిరునామాగా మారింది. భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తున్నారు. కొన్ని కేంద్రాలు ధనార్జనే ధ్యేయంగా సేవలందిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తూ బాధితుల నుంచి వసూళ్లే పరమావధిగా ముందుకెళ్తున్నారు. **1 ఏడింటికే అనుమతులు**ఖమ్మం నగరంలో ఏడు కేంద్రాలకు మాత్రమే ఇన్‌ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) చికిత్సలకు అనుమతులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ నిర్ధారించింది. అందులో రెండింటిలో మాత్రమే సరోగసి చికిత్సలకు ప్రభుత్వం అంగీకరించింది. క్షేత్ర స్థాయిలో చూస్తే పదుల సంఖ్యలో కేంద్రాలు పనిచేస్తున్నాయి. అనుమతులు లేకుండా చికిత్స చేస్తున్నా చర్యలేవీ ఉండటం లేదు.

**2.చికిత్స స్థాయి.. తెలిసేదెలా?**

'ఎల్–1' కేంద్రాల్లో టెస్ట్‌ట్యూబ్ ప్రక్రియకు అవకాశం ఉండదు. వాటిల్లో శుక్రకణాలు, అండాలను నిల్వచేయటం సాధ్యపడదు. నగరంలో వీటి సంఖ్య రెండు. మిగిలిన అయిదు ఎల్–2లు. వీటిలో టెస్ట్‌ట్యూబ్ ప్రక్రియకు ఆస్కారం ఉంటుంది. నిజానికి ప్రతి కేంద్రం తమ చికిత్స అర్హతలను బోర్డులపై డిస్‌ప్లే చేయాలి. నిబంధన చాలాచోట్ల అమలు కావటం లేదు.

**3. లెక్కాపత్రం లేదు**

సంతాన సాఫల్య కేంద్రాల్లో ప్రతి నెలా ఎంతమందికి చికిత్స చేస్తున్నారు. ఏ పద్ధతులు అవలంబిస్తున్నారు? సక్సెస్ రేటు ఎంత? ఇవన్నీ జిల్లా వైద్యాధికారుల వద్ద గణాంక రూపంలో ఉండాలి. ఇంతవరకూ వారి వద్ద స్పష్టమైన వివరాలేవీ లేకపోవటం గమనార్హం. దీంతో కొందరు ఇష్టారీతిగా సక్సెస్ రేటు చూపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

**4. తనిఖీలు ఏవి?**

నగరంలోని కేంద్రాలపై ఎక్కడా పటిష్ఠ నిఘా వ్యవస్థ లేదు. ఐవీఎఫ్ సెంటర్లను ఉన్నతాధికారులు తనిఖీ చేయటం లేదు. నిబంధనలు పాటించని, అనుమతుల్లేని వాటిని గుర్తించటం లేదు. ఐవీఫ్ సెంటర్ ఏర్పాటు, పర్యవేక్షణ వేర్వేరు చేతుల్లో ఉండటమే సమస్య. అనుమతుల విషయంలో జిల్లా వైద్యశాఖ బాధ్యత పరిమితం.

**5 .ఇక్కడా మధ్యవర్తులు**సాధారణ వైద్యంతో పోల్చితే ఎక్కువ కమీషన్‌కు ఆస్కారం ఉంటుండటంతో కొందరు గ్రామీణ వైద్యులు చికిత్సలో మధ్యవర్తుల అవతారం ఎత్తుతున్నారు. గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే దంపతుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ఆసుపత్రులు తామే మధ్యవర్తుల్ని ఏర్పాటు చేసుకుని వారికి రాయితీలు, బహుమతులు ప్రకటిస్తున్నాయి. చికిత్స తీరును బట్టి ఒక్కో కుటుంబం నుంచి రూ.1.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్యాకేజీ వసూలు చేస్తున్నారు. **6.ఇదేం కౌన్సెలింగ్..**క్లినిక్‌లో తప్పనిసరిగా మానసిక కౌన్సిలర్లు ఉండాలి. ప్రతి సందేహాన్ని వారు నివృత్తి చేయాలి. ఇందుకు భిన్నంగా కొన్నిచోట్ల రోగుల ఆర్థిక సామర్థ్యాన్ని గుర్తించే సాధనంగా వినియోగించుకుంటున్నారు. భార్యాభర్తలను విడివిడిగా కౌన్సెలింగ్ చేస్తూ ఆదాయ వివరాలు రాబడుతూ అందుకనుగుణంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.'సంతాన సాఫల్య కేంద్రాల అనుమతులు మా పరిధిలో ఉండవు. వాటిల్లో అందుతున్న చికిత్సల వివరాలు ఇకమీదట లెక్కిస్తాం. ఆసుపత్రులను తనిఖీలు చేస్తాం. ఎవరైనా బాధితులుంటే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.'కళావతిబాయి, డీఎంహెచ్‌వో

# మీనం మెరవాలె.!

కమ్మర్‌పల్లి : రాష్ట్రంలోనే చేప పిల్లల ఉత్పత్తికి అనువైన ప్రదేశం పోచంపాడ్. ఇక్కడ నెలకొల్పిన జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్ర సామర్థ్యమూ ఎక్కువే. ఏటా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలుస్తున్న దీనికి మరోసారి భారీ లక్ష్యాన్ని విధించారు. మత్స్యశాఖ అధికారులు తల్లి చేపలను సేకరిస్తూ నీటికుంటల్లో నిల్వ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే జులైలో విత్తనోత్పత్తి చేపడతారు.

**ఎనిమిది కోట్లు.. :** భూవిస్తీర్ణం, నీటి లభ్యతతో పోచంపాడ్ విత్తన చేపకు అనువుగా మారింది. ఈఏడాది 8 కోట్ల స్పాన్, 45 లక్షల అడ్వాన్స్ ఫ్రై లక్ష్యంగా విధించారు. దీనిని సాధించాలంటే జులై మొదటి వారంలోనే ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించాలి. వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ప్రక్రియ చేపడితేనే గుడ్డు(సెన) స్పాన్(చిచ్చుర చేప)గా మారుతుంది. వాటిని సిమెంట్ కుండీల్లో వేసి పెంచాలి. పెంచిన చేప పిల్లలు అడ్వాన్స్‌డ్ ఫ్రై(35–40 ఎం.ఎం) సైజులోకి రాగానే మత్స్యకారులకు పంపిణీ చేస్తారు.

**చైనీస్, ఎకో హెచరీలతో.. :** 2016లో రూ.4.30 కోట్ల ఫిష్‌సీడ్ ఫారం నిధులతో కేంద్ర సామర్థ్యాన్ని పెంచారు. 114 పాత సిమెంట్ నర్సరీ(నీటికుండీలు)లకు అదనంగా మరో 140 నిర్మించారు. ఈ కేంద్రంలోని మొట్టమొదటి జార్ హెచరీ లీకేజీలతో నిరుపయోగంగా మారగా, ఈసారి కొత్తగా నిర్మించిన చైనీస్ హెచరీతోపాటు ఎకో హెచరీతో ఉత్పత్తి చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న రెండు యూనిట్ల ఎకో హెచరీలకు అదనంగా నిర్మల్ నుంచి తెచ్చిన మరో



యూనిట్‌ను సిద్ధం చేశారు. ఒక యూనిట్‌లో 30 లక్షల చొప్పున.. మూడింటిలో మొత్తం 90 లక్షలు, చైనీస్ హెచరీలో 50 లక్షల స్పాన్ ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. వీటికి ఆహారంగా తవుడు, పశువుల పేడ, ఇతర పదార్థాలు ఇవ్వాల్సి ఉండడంతో సమకూరుస్తున్నారు.

**1000 కిలోల తల్లి చేపలు**

ఈ ఏడాది కేంద్రానికి భారీ లక్ష్యం విధించడంతో 1000 కిలోల తల్లి చేపలు అవసరం కాగా.. ఇప్పటివరకు బొత్స, రవ్వ, మిరగ, బంగారు తీగ రకాలతో 300 కిలోల తల్లి చేపలను సేకరించారు. మిగతా 700 కిలోలను సమీపంలోని చెరువుల్లో సేకరిస్తున్నారు.

జులైలో ప్రారంభిస్తాం: దామోదర్, మత్స్యశాఖ అధికారి, పోచంపాడ్ ఉత్పత్తికి సన్నాహాలు మొదలయ్యాయి. అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భారీ లక్ష్యం విధించారు. జులైలో ఉత్పత్తి ప్రక్రియ చేపడతాం. రాష్ట్రంలో మళ్లీ ప్రథమస్థానంలో నిలువడానికి కృషి చేస్తాం.

# భారం.. ఇక దూరం

ఇందల్‌వాయి: నెల వారీగా అద్దె చెల్లించడంలో తీవ్ర జాప్యంతో పలు సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు తాళాలు పడేవి. పాఠశాలల్లో సరైన వసతులు లేనప్పటికీ ప్రిన్సిపాళ్లు యజమానులను గట్టిగా అడగలేని పరిస్థితులుండేవి.. ఇలా చివరకు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మరికొన్నిచోట్ల అద్దె ఒప్పందం ముగియడంతో యజమానులు భవనం ఖాళీ చేయించడంతో నూతన భవనం కోసం అధికారులు నానా కష్టాలు పడేవారు. ఇలాంటి వాటికి ఈ విద్యాసంవత్సరం నుంచి తెర దించాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. బోధకులకు వేతనాలతోపాటు గురుకుల భవనాలకు నెలవారీగా అద్దె చెల్లించనున్నట్లు ప్రకటించడంతో ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**సగం విద్యాసంస్థలు.. :** సామాజిక వర్గాల వారీగా విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యనందించేందుకు అయిదో తరగతి నుంచి డిగ్రీ వరకు గురుకులాలు ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 49 గురుకులాలుంటే.. 24 విద్యాసంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా సొసైటీలు నెలకు రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నాయి. భవన యజమానులతో చేసుకున్న ఒప్పందం మేరకు రెండేళ్లకోసారి అద్దెలను సవరించాల్సి ఉంటుంది. సంక్షేమ సొసైటీలు బిల్లులను ట్రెజరీ కార్యాలయానికి పంపిస్తున్నా.. పలు ఆంక్షలతో అక్కడే నిలిచిపోతున్నాయి. ఫలితంగా రూ.కోట్లలో అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.

**వసతులు మెరుగవుతాయి..**ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఉన్నతాధికారులు నెలవారీగా బోధకుల వేతనాలతో పాటే భవనాల అద్దె చెల్లించాలని నిర్ణయించారు. ఇది అమలైతే ప్రిన్సిపాళ్లపై చాలా వరకు భారం తగ్గుతుంది. నెలవారీగా అద్దె చెల్లిస్తే యజమానులను సైతం వసతులు కల్పించాలని డిమాండ్ చేయవచ్చు.

పూర్ణచంద్రరావు, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకులాలు

# పర్యావరణంపై అవగాహనకు ఎకో క్లబ్‌లు

కామారెడ్డి : పర్యావరణ హితానికి విద్యార్థులు అడుగులు వేస్తున్నారు. పుడమి తల్లిని రక్షించుకోవడానికి పాటుపడుతున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్యావరణంపై మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. బడుల్లో మరిన్ని ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర సర్కారు 'మేరి లైఫ్' పథకంలో భాగంగా ఈ ఏడాది కూడా పర్యావరణం– వనరుల పునర్వినియోగం పేరిట కార్యక్రమాలను నిర్వహించనున్నారు.**నిత్యం ఒక్కో అంశం ఆధారంగా..**

ఉమ్మడి జిల్లాలో 2,247 ప్రభుత్వ బడులు ఉన్నాయి. ఇందులో 1.56 లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హరిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. నిత్యం ఒక్కో అంశం ఆధారంగా కార్యక్రమాలను చేపట్టనున్నారు. వివిధ బడుల్లో చేపట్టే కార్యక్రమాల చిత్రాలు, దృశ్యాలు చిత్రీకరించి విద్యాశాఖకు పంపాల్సి ఉంటుంది. పాఠశాల, మండల స్థాయిలో పంచాయతీరాజ్, వ్యవసాయ, అటవీశాఖల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలి.

**నాటిన మొక్కలకు పేర్లు** బడుల్లో పర్యావరణ పరిరక్షణకు నాటిన మొక్కలను తల్లిలా భావించి సంరక్షించాలని అధికారులు సూచించారు. ప్రతి విద్యార్థి నాటిన మొక్కకు తల్లి పేరు పెట్టాలని పేర్కొన్నారు. పర్యావరణ హితంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థికి తెలిసిన మొక్కపై ప్రత్యేక వ్యాసం రాయాల్సి ఉంటుంది.

చురకలు



# పోరుకు సన్నద్ధం

నల్గొండ : స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ వీడింది. 90 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు బెంచ్ ఆదేశాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. ముందుగా పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగే జిల్లా, మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే మండల పరిషత్తు అధికారు(ఎంపీడీవో)ల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంటు ఎన్నికల ముందు జిల్లా నుంచి సుమారు 20 మంది ఎంపీడీవోలు సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. వారు తిరిగి నల్గొండకు వచ్చే అవకాశం ఉంది. బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అధికారుల వివరాలు పంపించాలని జిల్లా పరిషత్తు అధికారులకు ఆదేశాలు అందడంతో వివరాలు సేకరించి జాబితా పంపించే పనిలో నిమగ్నమయ్యారు.

**రాష్ట్రంలోనే పెద్ద జడ్పీ**

రాష్ట్ర అసెంబ్లీ తర్వాత నల్గొండ జిల్లాపరిషత్తు మినీ అసెంబ్లీని తలపించ నుంది. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల, మండలాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుతో రాష్ట్రంలోనే నల్గొండ పెద్ద జిల్లాగా రూపాం తరం చెందింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాలో రెండు కొత్త మండలాలు ఏర్పాటుతో 31 జడ్పీ స్థానాల నుంచి 33 వరకు చేరాయి.



మండల పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాలు 349 ఉండగా పునర్విభజనతో 352 స్థానాలకు చేరాయి. ఇక్కడ జడ్పీ ఛైర్మన్‌కు దాదాపు సహాయ మంత్రి హోదా దక్కనుండటంతో చాలా మంది నేతలు జడ్పీ ఛైర్మన్ కుర్చీపై ఆశలు పెట్టుకున్నారు.

**ఏర్పాట్లు పూర్తి..!**

ప్రాదేశిక సమరానికి ఎప్పుడు ప్రకటన వచ్చిన ఎన్నికలు నిర్వహించేం దుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే రిజర్వేషన్లు మినహా ఇతర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎంపీటీసీల పునర్విభజన, ఓటర్ల విభజన వంటి ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించే అధికారులు, సిబ్బందికి ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనుండటంతో దీనికి ఉపయోగించే పేపరును దిగుమతి చేసి నిల్వ ఉంచారు.

# సీడీపీ నిధులకు గ్రహణం

నల్గొండ : నియోజకవర్గ అభివృద్ధి పథకానికి గ్రహణం పట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్నా.. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పథకం(సీడీపీ) కింద వచ్చే నిధులు మాత్రం విడుదల కావడం లేదు. దీంతో ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది.

**గతంలో ఇలా..** ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం, సదుపాయాల కల్పన, తక్షణ అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.3 కోట్లు కేటాయించగా, ఆ నిధులను 2022–23లో భారాస ప్రభుత్వం రూ.5 కోట్లకు పెంచింది. ఇందులో రూ.3 కోట్లను ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టే అవకాశం ఉండగా, మిగిలిన రూ.2 కోట్లు విద్యాశాఖలో పాఠశాలల అభివృద్ధికి వెచ్చించాలని పేర్కొంది. అయితే విద్యాశాఖకు కేటాయించిన నిధులను గత ప్రభుత్వం నేరుగా ఆ శాఖకు విడుదల చేసేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా ఈ నిధులను నిలిపివేయడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడుతుంది. నిధులు విడుదల చేస్తే తాగునీరు, రహదారులు, అసంపూర్తి భవనాల పూర్తి , గ్రామాల్లో సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించే అవకాశం ఉంటుంది.

**ఎస్‌డీఎఫ్‌తోనే అభివృద్ధి పనులు**

సీడీపీ నిధులను ప్రభుత్వం కేటాయించకపోవడంతో నియోజకవర్గాల్లో ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)తోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.10 కోట్లు మంజూరవుతాయి. ఈ నిధులను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా వాటిలో సూర్యాపేట నియోజకవర్గం మినహా అన్ని నియోజ కవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. సూర్యాపేటలో మాత్రం భారాస ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి సీడీపీ నిధులు విడుదల కాకపోవడంతో కొంతమంది ఎమ్మెల్యేలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సీడీపీ నిధులు విడుదల చేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని, అలాగే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రులారా.. మా గోడు వినండి!

సుంకిడి : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏర్పాటు 16 ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. తొలుత సబ్ మార్కెట్‌యార్డు అనుకున్నా పూర్తిస్థాయి ప్రత్యేక మార్కెట్‌యార్డు అడుగులు ముందుకు పడినా అది స్థల సేకరణకే పరిమితమైంది. మార్కెట్ యార్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తలమడుగు మండలంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి పర్యటన ఉన్నందున మూడు మండలాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని రైతులు విన్నవిస్తున్నారు. ఆదిలాబాద్‌లో వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో ఆదిలాబాద్ గ్రామీణం, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన

పత్తి, సోయా, శనగలు, కందులు, జొన్న పంటలను విక్రయించేం దుకు ఆదిలాబాద్ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. విక్రయాల వేళ రైతులంతా పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భీంపూర్, తలమడుగు, తాంసి మండలాల్లోని పలు గ్రామాల రైతులు 45 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి ఆదిలాబాద్ పట్టణానికి పంట తీసుకొస్తూ అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలో ఆరు మండలాలకు చెందిన 40 వేల మంది రైతులు ఉన్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో పంట విక్రయించేందుకు అక్కడే రెండు నుంచి మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. మూడు మండలాల రైతుల ప్రయోజనార్థం సుంకిడిలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్ల నుంచి ఉంది. తద్వారా 15 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. రైతుల పడిగాపుల ఇబ్బందులు దూరమవుతాయి. సుంకిడిలో మార్కెట్ యార్డు నిర్మాణం జరిగితే 24 వేల మంది అన్నదాతలకు ప్రయోజనం కలుగుతుంది.

# దోమలతో తస్మాత్ జాగ్రత్త



సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ పంచాయతీలో మురుగునీరు వెళ్లలేని పరిస్థితి. ఈ గ్రామంలో రెండ్రోజులుగా పలుగురు జ్వరాలతో బాధపడుతుండగా.. ఒకరు డెంగీ లక్షణాలతో జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా అంతటా ముసురు వర్షాలు ముంచెత్తాయి. పంచాయతీల్లో వరద, మురుగునీరు నిలిచి చాలా చోట్ల కుంటలను తలపిస్తున్నాయి. ఇలాంటి ప్రాంతాలు దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఉంది. వ్యాధులు ముసురుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో జూన్, జులై నెలల్లో 3,311 సాధారణ జ్వరాలు.. ఈ ఏడాదిలో ఇప్పటికీ 11 డెంగీ జ్వరాలు నమోదయ్యాయి. పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు దోమల నివారణకు తీసుకునే చర్యలు కనిపించడం లేదు. కారణం చాలా పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. వ్యాధులు వచ్చాక చేసే హడావుడికంటే.. వాటి నివారణకు చర్యలు చేపట్టాలి.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలోని 260 పంచాయతీలకు 98 పెద్దవి, 132 చిన్న ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. వారంలో ఒక రోజు డ్రైడే పాటిస్తున్నట్లుగానే ఒక రోజు ఫాగింగ్ చేయాలి. డ్రైడే నిర్వహణకు వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. వీటితోపాటు ఫాగింగ్ చేయాల్సిన యంత్రాలు మాత్రం కదలడం లేదు. పెద్ద ఫాగింగ్ యంత్రం ఒకసారి నడపాలంటే కనీసం రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. డీజిల్, మలాథిన్ (దోమల నివారణ రసాయనం), ఆటోను అద్దెకు తీసుకొని గ్రామాల్లో వార్డుల వారీగా ఫాగింగ్ చేయాలి. చిన్న యంత్రానికి రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. జిల్లాలోని చాలా పంచాయతీల్లో ఈ మాత్రం కూడా నిధులు వెచ్చించలేని పరిస్థితులు ఉన్నాయి.

పంచాయతీలకు 18 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కావడంలేదు. చివరగా 2024 జులైలో ఒకసారి నిధులు వచ్చాయి. కాగా అవి అప్పటికే చేసిన పనుల పెండింగ్ బిల్లులకే సరిపోని పరిస్థితి. పదిహేను రోజుల క్రితం స్టేట్ మ్యాచింగ్ గ్రాంటు కింద జిల్లాకు రూ.7 కోట్లు విడుదలయ్యాయి. వీటిని పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మేజర్ పంచాయతీలు మండల కేంద్రాలు మినహా మిగతా పంచాయతీల్లో సాధారణ నిధులు లేవు.

పంచాయతీల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, తీసుకున్న చర్యలపై డీఎల్‌పీవో నరేష్‌ను సంప్రదించింది. 'పరిస్థితి తీవ్రతను బట్టి కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించి పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రూ.కోటి నిధులు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

# అధ్వానంగా అంతర్గత రోడ్లు



సిరిసిల్ల : ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట జ్యోతినగర్‌లోనిది. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలుగా మారుతుండగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతు న్నారు. బురద కారణంగా అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదా రులు వాపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమై ఏళ్ల గడిచినా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇది సిరిసిల్ల నుంచి పెద్దబోనాల వెళ్లే రోడ్డు. ఈ దారిగుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు అధ్వానంగా మారుతుంది. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్టీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన, లింకు, విలీన గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు కావడం, మరమ్మతులకు నోచుకోకపోవ డంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడమే కాకుండా, రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. విలీన గ్రామాల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. చంద్రంపేట, జ్యోతినగర్, ఇప్పలపలి, పెద్దూరు తదితర గ్రామాల్లో ఇప్పటికీ చాలాచోట్ల మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. బురద రోడ్ల మీదనే ప్రయాణాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**బురదతో అవస్థలు**

చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. బురద రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ చంద్రంపేట

సీసీ నిర్మాణం చేపట్టాలిపట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లపై వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. బురద రోడ్లపై ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాజు, 12వ వార్డు

సిరిసిల్ల పట్టణ స్వరూపం

| | |
|---|---|
| వార్డులు | : 39 |
| పట్టణ జనాభా | : 1,16,938 |
| పట్టణంలో రోడ్లు | : 276.91 కి.మీ |
| బీటీ రోడ్లు | : 40.33 కి.మీ |
| సీసీ రోడ్లు | : 137.44 కి.మీ |

# నిధులు రాలే.. వసతులు మెరుగవలే!

పెద్దపల్లి : ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) ప్రోత్సాహక నిధులు అందని ద్రాక్షలా మారాయి. జాతీయస్థాయి నిర్దేశిత ప్రమాణాలను పాటించిన ఆసుపత్రులకు నిధుల మంజూరులో నిరీక్షణ తప్పడం లేదు. రెండేళ్లుగా నిధుల కేటాయింపు కాగితాలకే పరిమితమైంది. ఫలితంగా ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపడటం లేదు.

ప్రక్రియ ఇలాపైవేటుకు దీటుగా వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్రం చేయూతనిస్తోంది. ఓపీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఆక్సిలరీ, ఐపీడీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి వార్డు విభాగాల్లో సేవలు, రికార్డులు, పరిసరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది. సేవలకు పాయింట్లు కేటాయించి అత్యధిక స్కోరు సాధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏటా రూ.3 లక్షలు, ఉప వైద్య కేంద్రాలకు రూ.1.50 లక్షలు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు ఒక్కో బెడ్‌కు రూ.10 వేల చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తారు. ఏటా 25 శాతం అటెండర్ స్థాయి నుంచి వైద్యుల వరకు పొందుతారు. 75 శాతం కుర్చీలు, బెంచీలు, వైద్య పరికరాలు, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు. వైద్య సేవల్లో ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన ఇతర వనరులు సమకూర్చుతారు.

**ఎంపికైనా ..**

కల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీ ఎన్‌క్వాస్‌కు ఎంపికైనా వసతులు మెరుగవక ప్రసవాలు జరగడం లేదు.

కోరుట్ల, ఎలిగేడు, ఎస్సారుగుట్ట పీహెచ్‌సీలలో ప్రాథమిక వైద్యమే అందుతోంది. వీణవంకలో రోగులకు సరిపడా సదుపాయాలు లేవు. ప్రమాదాల బారిన పడి వెళ్లిన రోగులకు ప్రథమ చికిత్సతో సరిపెడుతున్నారు. సరైన కుర్చీలు, బెంచీలు లేక నిలబడే పరిస్థితి నెలకొంది. వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు సరిపడా వసతులు లేవు.

నిధులు రాకున్నా పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు ఇబ్బంది లేదని, సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని పెద్దపల్లి జిల్లా వైద్యాధికారి ప్రసన్నకుమారి చెప్పారు. ప్రోత్సాహక నిధులు విడుదలైతే వసతులు మరింత మెరుగుపడనున్నాయని వివరించారు.

రెండేళ్లలో ఎంపికైన ఆసుపత్రులు

| | |
|---|---|
| పెద్దపల్లి : | 8 |
| జగిత్యాల : | 9 |
| కరీంనగర్ : | 4 |
| రాజన్న సిరిసిల్ల : | 9 |

# సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 'సెస్' జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్ర తినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవు తున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్లు గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించా రు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగు తోంది. సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతు న్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

# వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం


సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతి రేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సన్నద్ధమవుతోంది. మెదక్ ఎంపీ రఘునం దన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తల తో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# ‘వీధి’రాత మారేలా...!

మిర్యాలగూడ : రోజువారీ వ్యాపారాలు, పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న వీధి వ్యాపారులకు మరింత భరోసా ఇచ్చే విధంగా ప్రభుత్వం సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2009 నుంచి కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల హక్కుల రక్షణ చట్టం రూపొందించింది. ఈ చట్టం ప్రకారం వీధి వ్యాపారాలను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేసి, పట్టణాల్లో వ్యాపార జోన్లు నిర్ణయించి నిర్ణీత సమయాల్లో వ్యాపారాలు చేసుకునేలా రక్షణ కల్పించాలని నిర్ణయించారు. 2011 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించగా.. పట్టణాల్లో వీధి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని గుర్తించిన మెప్మా విభాగం వారు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత వారికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వం నుంచి విడతల వారీగా రుణాలు అందజేశారు. మొదట రూ.10వేలు, ఆ తర్వాత రూ.20వేలు, మూడోదశలో రూ.30వేల రుణాలు అందించారు. సక్రమంగా చెల్లింపులు జరిపిన వారికి బ్యాంకుల నుంచి వెంటనే రుణాలు అందేలా



మెప్మా అధికారులు పర్యవేక్షించారు. ఎన్నికలు ఇతర కారణాలతో మూడేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వీధి వ్యాపారులను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి మహిళా సంఘాల తరహాలో రుణాలు అందించాలని నిర్ణయించింది. దీంతో నల్గొండ జిల్లాలోని ఎనిమిది పురపాలికల్లోని మెప్మా అధికారులు సంఘాలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 17,166 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించగా.. ఇప్పటి వరకు 15 సంఘాలను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల తరహాలోనే వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే వారిని వారి వ్యాపారాలకు తగిన విధంగా గుర్తించి సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని మెప్మా పట్టణ మిషన్ కో- ఆర్డినేటర్ బక్కయ్యకు తెలిపారు.

# ఔషధం అరకొరే..!

నల్గొండ : నకిరేకల్‌కు చెందిన బి.సైదులు, జ్వరం ఇతర సమస్యలతో బాధపడుతూ నకిరేకల్ సర్కారు వైద్యశాలకు వచ్చాడు. వైద్యులు రక్త, మూత్ర పరీక్షలు చేయించారు. మూడు రకాల మాత్రలు, ఒక సిరప్ రాశారు. ఆసుపత్రిలో మాత్రలు ఇచ్చి సిరప్ లేదన్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో బయట మందుల దుకాణంలో సిరప్ కొనుగోలు చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని ఉచితంగా అందుతాయని వచ్చానని, సగం మందులే దొరికాయని అతను వాపోయాడు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు జిల్లాలో విజృంభిస్తున్నాయి. రోగులు అదే స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. కాని దానికి తగినట్లుగా పూర్తి స్థాయిల్లో మౌలిక వసతులు, మాత్రలు, సర్జికల్స్ లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులతో పాటు కిందిస్థాయి ఫార్మాసిస్టులు, సిబ్బంది ముందు చూపు లేమి కారణంగా మందుల కొరతల సమస్యలు తలెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో 562 రకాల మాత్రలు, 620 రకాల సర్జికల్స్ అందుబాటులో ఉండాల్సి ఉండగా.. 25 శాతం వరకు కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్యులు రాసే కొన్ని రకాల మాత్రలను బయట షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, నకిరేకల్, మర్రిగూడ ఏరియా ఆసుపత్రుల్లో 410 రకాల మందులు, 480 రకాల సర్జికల్స్ ఉండాల్సి ఉండగా 40 శాతం వరకు కొరత ఉన్నట్లు కన్పిస్తుంది. జిల్లాలో 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు యూపీహెచ్‌సీల్లో సైతం 35 నుంచి 40 శాతం కొరత ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో 562 రకాల మాత్రలు, 620 రకాల సర్జికల్స్ ఉండాల్సి ఉండగా.. అన్నిరకాల మాత్రలు, సర్జికల్స్ ఉన్నాయని స్టోర్ ఇన్‌ఛార్జి జగదీశ్వర్ తెలిపారు. నకిరేకల్‌లో అత్యవసర పరిస్థితి ఉంటే ఆసుపత్రి నిధి నుంచి స్థానికంగా



ఆ మందులు తెప్పించి చికిత్సలు అందిస్తున్నామని వైద్యులు అంటున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని బస్తీ దవాఖానాలకు అరకొరగానే మందులు సరఫరా అవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో మురికివాడల్లో నిరుపేదలకు వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలకు నిర్ణీత ప్రణాళిక ప్రకారం మందులు సరఫరా చేయడం లేదు. జ్వరం, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు మాత్రమే మందులు అందిస్తున్నారు. ఇతర సమస్యలకు అవసరమైన మందులు సకాలంలో సరఫరా చేయడం లేదు. రోగులకు వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించకపోవడంతో ఆశించిన మేరకు రోగులకు వైద్య సేవలు అందడం లేదు.

**ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**

డా. మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో కావాల్సిన మాత్రలు అందుబాటులో ఉన్నాయి. లేని మాత్రలు, సర్జికల్స్ ఆరోగ్యశ్రీ పథకం కింద వచ్చే నిధులతో రోగులకు అందిస్తున్నాం. ఎక్కడైనా మందులు లేవని బాధితులు ఫిర్యాదు చేస్తే వెంటనే సీడీఎస్ నుంచి దిగుమతి చేసి అందుబాటులో ఉంచుతాం. రోగులకు మెరుగైన వైద్యంతో పాటు కావాల్సిన మాత్రలు ఇస్తున్నాం.

# ఆపత్కాలంలో అండగా..




కరీంనగర్ : అగ్ని, రోడ్డు, భవనాలు, పరిశ్రమల్లో ప్రమాదాలు ఏర్పడితే ప్రాణ, ఆస్తిని రక్షించడానికి ఎస్‌డీఆర్‌ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ముందుంటుంది. ఇదే విభాగాన్ని ఇప్పుడు ఉమ్మడి జిల్లా కేంద్రంగా కరీంనగర్ అగ్నిమాపకశాఖలో సైతం ఏర్పాటు చేశారు. **9 నెలల శిక్షణ** కొత్తగా ఏర్పాటైన ఎస్‌డీఆర్‌ఎఫ్ విభాగం సిబ్బంది మూడు నెలలపాటు జాతీయ విపత్తు, రక్షణ విభాగం నాగ్‌పూర్‌లో వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అత్యవసర సహాయం చేయడానికైనా వెళ్లనున్నారు. నాలుగు రోజుల కింద పటాన్‌చెరువు మండలం పాశమైలారంలోని మందుల పరిశ్రమ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం జరగ్గా కరీంనగర్‌కు చెందిన ఈ విభాగం అక్కడికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంది. ఈ విభాగానికి కొత్తగా 3 రెస్క్యూబోట్లు, 50 లైఫ్ జాకెట్స్, 50 లైఫ్‌బైయ్స్, ఒక ట్రాలీ బోట్‌ను కేటాయించారు. మరికొన్ని రోజుల్లో పూర్తి స్థాయిలో ఈ విభాగం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**ఉమ్మడి జిల్లా కేంద్రంగా..**

అగ్నిప్రమాదాలు, భూకంపాలు, వరదలు, నీటి ప్రమాదాలు జరిగిన సమయంలో ఇప్పటి వరకు అగ్నిమాపకశాఖ సిబ్బంది మాత్రమే తమవంతు సాయం అందించేవారు. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ఇతర అగ్నిమాపక కేంద్రాల సహాయం తీసుకోవాల్సి ఉంటోంది. ఇలాంటి ఘటనలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా కేంద్రంగా 13 అగ్నిమాపక కేంద్రాలకు అత్యవసర విభాగం కింద ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో అత్యవసర సేవలు అందించాలంటే ఈ విభాగం తక్షణం అక్కడికి వెళ్తుంది. కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారి పర్యవేక్షణలో లీడ్ ఫైర్‌మెన్‌తోపాటు 10 మంది సిబ్బందిని కేటాయించారు. ఈ ప్రత్యేక విభాగానికి మినీ బస్సు, సామగ్రి తరలించేందుకు వ్యాన్ కేటాయించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ పెద్ద ప్రమాదం జరిగినా వీరు అక్కడికి వెళ్తారు.

ఎంతో ఉపయోగం

–శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ అగ్నిమాపక శాఖ అధికారి

అగ్నిమాపక శాఖకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విభాగం అన్ని విపత్కర పరిస్థితుల్లో సహాయక చర్యలను చేపడుతుంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా సేవలందించనుంది. ప్రత్యేక సిబ్బందిని సైతం కేటాయించడంతో అగ్నిమాపకశాఖకు మరింత బలం చేకూరింది.

# ఇంధన దోపిడీపై చర్యలేవీ!



జగిత్యాల : జగిత్యాల పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణ తదితర అవసరాల కోసం వాహనాలకు వినియోగించే డీజిల్ కొందరికి నిత్య ఆదాయ వనరుగా మారింది. పాలకవర్గం లేకపోవడం, కమిషనర్లు తరచూ బదిలీ అవుతుండటంతో ఇంధన వినియోగం పూర్తిగా దారి తప్పింది. పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణకు మొత్తం 72 వాహనాలున్నాయి. వీటికి రెండేళ్లుగా ప్రతి నెలా రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల్లోపు డీజిల్ బిల్లు అవుతోంది. కాగా గత మార్చి నెలలో అత్యధికంగా రూ.16,27,157 వ్యయం కావడం చర్చనీయాంశమైంది.

**పర్యవేక్షణ మృగ్యం**

వాస్తవంగా వాహనాలకు ఇంధనం నింపే క్రమంలో బాధ్యుడైన అధికారి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పురపాలక వాహనం నంబరు ఆధారంగా ఏ వాహనానికి ఎంత మేర డీజిల్ వాడారనే పక్కా సమాచారం ఉండాలి. ఇవేవీ లేకుండానే డీజిల్ బిల్లులు రూపొందించారు. మార్చి నెలలో బాధ్యతలు చేపట్టిన కమిషనర్ స్పందన బిల్లులు మంజూరు చేశారు. పురపాలక ఇంధన వినియోగంలో పెద్ద మొత్తంలో తేడా రావడం విమర్శలకు తావిచ్చింది. వాహనాలు, వినియోగం సాధారణంగానే ఉన్నా ఏకంగా రూ.6 లక్షలు అధికంగా వ్యయం కావడంపై కమిషనర్ సైతం ప్రత్యేక దృష్టి సారించారు. ఏప్రిల్‌లో బాధ్యులను కట్టుదిట్టం చేయడంతో బిల్లు రూ.11 లక్షల మేర వచ్చింది. ఆ తర్వాత ఇంధన వినియోగం పర్యవేక్షణ బాధ్యతను కమిషనర్ వార్డు అధికారికి అప్పగించారు. వార్డు అధికారి ఇచ్చిన వోచర్ ఆధారంగా బంకుల్లో డీజిల్ నింపుతున్నారు. బంకుల్లో ఇచ్చే రసీదు ఆధారంగా బిల్లులు చెల్లిస్తున్నారు. మే నెల బిల్లు మరింత తగ్గి రూ.9 లక్షలు మాత్రమే వ్యయం కావడం గమనార్హం.

**మూడు నెలలైనా చర్యలు కరవు**

పురపాలికలో డీజిల్ వినియోగంలో రూ.6 లక్షల మేర అదనపు వ్యయం చూపి అక్రమాలకు పాల్పడిన వారిపై ఇప్పటివరకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కమిషనర్ స్వరూపరాణి హయాంలో ఒకే నెలలో రూ.4 లక్షల మేర అక్రమాలు జరిగాయి. ఆమె వెంటనే సిబ్బందిపై చర్యలు చేపట్టడంతో వరుసగా 4 నెలల్లో ప్రతి నెలా రూ.4 లక్షలు ఆదా చేశారు. రెవెన్యూ, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఒకరిద్దరు సిబ్బంది డీజిల్ అక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ఉన్నతాధికారులు వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. బల్దియా వాహనాలకు డీజిల్ వినియోగంపై పర్యవేక్షణ పెంచామని, దుబారా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ స్పందకు తెలిపారు.

# ముందస్తు టీకా.. జీవాలకు రక్ష



నల్గొండ : వర్షాకాలంలో గొర్రెలు, మేకల్లో వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. కొత్తగా మొలకెత్తిన గడ్డిపైకి బురదలోని బ్యాక్టీరియా చేరుతుంది. ఆ గడ్డిని తిన్నప్పుడు జీవాల్లో సమస్యలు తలెత్తుతాయి. ఈ క్రమంలో జీవాల్లో పారుడు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయనున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకలు 3 నెలల నుంచి ఏడాది లోపు ఉన్న వాటికి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ అందించనున్నారు. నల్గొండ జిల్లాలో గొర్రెలు 9,12,625, మేకలు 3,36,182 ఉన్నాయి. జూన్ 28 నుంచి ఈనెల 10 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

పారుడు వ్యాధి ఒక జీవానికి సోకితే మిగతా వాటికి వ్యాపించే అవకాశం ఉంది. అన్ని గ్రామాల్లోని జీవాల్లో పశువైద్యులతో పాటు సిబ్బంది కేంద్ర ప్రభుత్వం అందించే వ్యాక్సిన్ వేయనున్నారు. అయిదేళ్లు వరుసగా వ్యాక్సిన్ అందించడం వల్ల జీవాల్లో పారుడు వ్యాధి తగ్గుతుంది. మరణాలు సంఖ్య తక్కువగా ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. టీకాలు వేసేందుకు మండలాల వారీగా బృందాలు ఏర్పాటు చేశారు. జిల్లా మొత్తం 58 వరకు పనిచేస్తాయి. వ్యాక్సిన్ వేశాక వైద్యులు జీవాల సంఖ్యను యాప్‌లో నమోదు చేస్తారు.

**వ్యాధి లక్షణాలు..**

ఇది వైరస్ వల్ల వస్తుంది. వ్యాధి సోకినప్పుడు అది ఒక గొర్రె, మేక నుంచి మిగతా వాటికి సోకే అవకాశం ఉంది. జీవాలకు అధిక జ్వరం వస్తుంది. మేత మేయకుండా ఉంటాయి. పేగులు చెడిపోయి.. విరేచనాలు అధికంగా అయి కొన్ని సార్లు జీవాలు మరణిస్తాయి.

**నియామకం**

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ ఛైర్మన్‌గా కోమటిరెడ్డి నర్సింహారెడ్డిని నియమిస్తూ ఆసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి, రాష్ట్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులకు నర్సింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన గతంలో జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షులుగా సేవలందించారు.

**పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి**

జీవీ రమేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నల్గొండ

పారుడు వ్యాధి వ్యాక్సిన్ గ్రామాల్లో పశు వైద్యులు గొర్రెలు, మేకలకు వేస్తున్నారు. జీవాల పెంపకందారులు దీనిని ఉపయోగించుకోవాలి. దీనికోసం మండలాల వారీగా బృందాలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో వ్యాక్సిన్ వేసే ఒక రోజు ముందు టాంటాం చేయిస్తాం.

# పొదుపే శ్వాస.. అధికవడ్డీ ఆశ

మిర్యాలగూడ : సాధారణ పేద, మధ్య తరగతి ప్రజలు..రోజు వారీ పనులు చేసి సంపాదించే దాంట్లో కొంత దాచుకోవాలని అనుకుంటారు. ఇంట్లో దాచిపెడితే ఏదో ఒక అవసరానికి వాడేస్తామనే భయంతో తెలిసిన వారి వద్ద.. బంధువులకు తెలిసిన వారి వద్ద చిట్టీలు కట్టడం సహజం. ఇటీవల కాలంలో పలువురు చిట్టీల వ్యాపారులు కొంత కాలం తర్వాత బోర్డు తిప్పేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్యతరగతి ప్రజలకు డబ్బుపై ఆశతో పాటు..అనేక అవసరాలు ఉంటాయి. దీనిని ఆసరాగా చేసుకుంటున్న మోసగాళ్లు..చిట్టీలు, లక్కీడ్రా స్కీమ్‌లు, అధిక వడ్డీల పేరిట అప్పులు తీసుకుని రూ.కోట్లలో దోచుకుని ఉడాయిస్తున్నారు. వీరు తొలుత కొంత కాలం నమ్మకస్తులుగా ఉంటూ..వారికి క్రమం తప్పకుండా చెల్లింపులు చేస్తారు. చిట్టీలు కట్టించుకునే వారు..చిట్టీ అయిపోయిన, పాడుకున్న వారి వద్ద నుంచి అధిక వడ్డీల ఆశ చూపి నిర్వాహకులే నగదు తీసుకుంటున్నారు. పెద్ద మొత్తం నగదు వస్తే ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతుందనే మధ్య తరగతి ప్రజల అమాయకత్వాన్ని చూసి..నట్టేట ముంచుతున్నారు. మరో వైపు ప్రతి నెలా కొంత నగదు కట్టించుకుని..డ్రా తీస్తూ..విజేతలకు ఖరీదైన బహుమతులు అందిస్తామని..చివర్లో తాము చెల్లించిన నగదుకు సరిపడా బహుమతి ఇస్తామని ఇటీవల కొన్ని బోగస్ సంస్థలు వేలాది మంది నుంచి



రూ.కోట్లలో వసూలు చేసి బోర్డు తిప్పేశాయి.

**ఇటీవల జరిగిన ఘటనలు కొన్ని...**

ః మిర్యాలగూడ ప్రాంతంలో లక్కీ డ్రా పేరుతో ఓ సంస్థను స్థాపించి వేలాది అమాయకుల నుంచి రూ.కోట్లతో నగదు వసూలు చేసి కనిపించకుండా పోయారు.

ః పీఏ పల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి అమాయక గిరిజనుల నుంచి అధిక వడ్డీల పేరుతో రూ. కోట్లలో అప్పులు తీసుకుని జల్సాలు చేస్తున్న ఉదంతం ఇటీవల కలకలం సృష్టించింది.

ః మిర్యాలగూడ పట్టణంలో చిట్టీలు, వడ్డీల పేరుతో రూ.కోట్లతో వసూలు చేసి..తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

కె. రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ ఆర్థిక లావాదేవీల అంశంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వారి వద్ద, అనుమతులు లేని వారి వద్ద చిట్టీలు వేయడం, బహుమ తులు, రెట్టింపు నగదు ఆశ చూసే సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. అధిక వడ్డీల ఆశతో అప్పులు ఇవ్వడం కూడా సరైంది కాదు. ఆర్బీఐ అనుమతులు ఉన్న సంస్థల్లో పెట్టుబడులు, జాతీయ బ్యాంకుల్లో నగదు దాచుకుంటేనే భరోసా ఉంటుంది.

# ‘సంపు’తోంది..!

కోదాడ : ప్రమాదకరంగా సంపు కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పట్టణంలోనిది. ఇలాంటి ప్రమాదకరమైన సంపులోనే పడి చిన్నారులు మృతి చెందుతున్నారు. అయినా కొందరు సంపులను ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. చిన్నారులే కాదు పెద్దవారూ ఇలాంటి సంపులో పడితే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఇంటి యజమానులు సంపులో చిన్నారులు పడకుండా ప్రత్యేకంగా గ్రిల్, బండలు ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు నివారించొచ్చు. మానవ అవసరాల నిమిత్తం ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న నీటి సంపులతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. అభం శుభం తెలియని చిన్నారుల పాలిట అవి యమపాశాలుగా మారుతున్నాయి. ఇంట్లో చిన్నారులు ఉన్నారని తెలిసి కూడా పెద్దలు సంపుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడం వారికి శాపంగా మారుతోంది.

కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన దంపతుల 20 నెలల కుమారుడు మంగళవారం నీటి సంపులో పడి మృత్యుఒడికి చేరిన విషాద ఘటన అందరినీ కలిచివేసింది. రోజులాగే తల్లి అన్నం తినిపించి చిన్నారిని పడుకోబెట్టింది. నిద్ర లేచిన చిన్నారి ఆడుకునేందుకు ఇంటి వెనక ఉన్న సంపు దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతి చెందాడు.

గతేడాది అనంతగిరి మండలంలోని ఓ గ్రామంలో ఇంట్లో చిన్నారి ఆడుకుంటూ ఉండటంతో తల్లిదండ్రులు పర్యవేక్షించడం మరిచారు. ఇంట్లోని బకెట్ నిండా నీళ్లు ఉండడంతో చిన్నారి ఆ నీటితో ఆడుకుంటున్న క్రమంలో తల బకెట్‌లోకి ముంచడంతో బోర్లా పడ్డాడు. ఊపిరాడక రెండేళ్ల చిన్నారి మృతి చెందాడు.



**తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

సంపు మీద ఏర్పాటు చేసిన బిల్లలు పగిలిపోతే వెంటనే కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. చిన్నారులను సంపుల సమీపంలో ఆడకుండా జాగ్రత్తలు చేపట్టాలి.

సంపులో పడిపోతే ప్రమాదం అనే భయాన్ని పిల్లలకు నేర్పించాలి.

సంపు మీద ఇనుముతో తయారు చేసిన గ్రిల్ ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చు.

తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న ప్రమాదాలను పసిగట్టాలి.

ఆడుకునే సమయంలో ఎలాంటి పనులు పెట్టుకోకుండా నిరంతరం పర్యవేక్షించాలి.

**పర్యవేక్షణ తప్పనిసరి**

శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ

చాలా మంది ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న సంపులను పటిష్ఠపరచాలి. చిన్నారులు సంపుల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆడుకునే సమయంలో కొందరు తల్లిదండ్రులు పిల్లలను వదిలేసి ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. దీంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా కాకుండా పర్యవేక్షణ తప్పనిసరి చేసుకోవాలి.

# తూకమేసి మోసం







కర్నూలు : చిరు ఉద్యోగి రాముడు ఇటీవల 25 కిలోల సోనామసూరి బియ్యం కొనుగోలు చేశారు. ఇందుకు రూ.1,100 చెల్లించారు.. ఆ సంచి తూకం వేయగా 24 కిలోలే ఉంది.. ఆయన రూ.44 అధికంగా చెల్లించారు.ఒక్క రాముడే కాదు.. జిల్లాలో బియ్యం కొనుగోలు చేస్తున్న ప్రతి వినియోగదారుడు ఇలానే మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు 2.32 లక్షల క్వింటాళ్ల బియ్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఒక బియ్యం సంచిపై రూ.50 చొప్పున ఏటా రూ.55.80 కోట్ల మేర వ్యాపారులు దోచుకుంటున్నారు.

**పాతవంటూ బురిడీ**

ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలో 65-80 వేల హెక్టార్లు, కర్నూలులో 12-13 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇందులో 96 శాతం సోనామసూరి రకాలే ఉంటాయి. సాధారణంగా ఎకరాకు 30-40 సంచుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఏడాది కిందట పండిన ధాన్యం అయితే 75 కిలోల సంచి ధాన్యాన్ని రూ.3,000 కొనుగోలు చేస్తున్నారు. అదే కొత్తవి (గత ఖరీఫ్, రబీ కాలం) అయితే రూ.2,000 చెల్లిస్తున్నారు. వ్యాపారులు మిల్లుల్లో మిల్లింగ్ చేసి సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. వరి గింజ నాణ్యతగా ఉంటే 75 కిలోల వరి ధాన్యం మిల్లింగ్ చేయించగా 50 కిలోల బియ్యం వస్తుంది. : రైతుల వద్ద కొత్త బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మరాడించి పాతవంటూ అంటగడుతున్నారు.

**ధరల నియంత్రణ ఊసేలేదు**

ఉమ్మడి జిల్లాలో 9.30 లక్షల కుటుంబాలు (70 శాతానికిపైగా) సోనామసూరి బియ్యాన్నే వినియోగిస్తున్నాయి. నలుగురైదుగురు సభ్యులున్న ఒక కుటుంబం సరాసరిన నెలకు 25 కిలోల చొప్పున ఏడాదిలో 3 క్వింటాళ్ల బియ్యం వినియోగిస్తుంది. 2019 నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే కిలో బియ్యంపై రూ.25 మేర ధర పెరిగింది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. అదుపు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

జేసీ అధ్యక్షతన పౌరసరఫరాల అధికారులతోపాటు అనుబంధ శాఖలు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి ధరలు నియంత్రించాల్సి ఉంది. కమిటీ సమావేశం ఏడాదికి ఒకసారి.. అదీ మొక్కుబడిగా సాగుతోంది. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారులు తమకెలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**తనిఖీలు తకరారు** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 220 వరకు బియ్యం మిల్లులు ఉన్నాయి. ఇక్కడి నుంచి గంపగుత్తగా సంచులు తీసుకొచ్చి చిరు వ్యాపారులు విక్రయిస్తుంటారు. పౌరసరఫరాల శాఖ అధికారులు గతంలో బియ్యం మిల్లుల్లో విస్తృతంగా తనిఖీలు చేసేవారు. తూకాల్లో తేడాలకు సంబంధించి పెద్దఎత్తున కేసులు నమోదయ్యేవి. గత కొన్నేళ్లుగా ఏ ఒక్క శాఖ అధికారి అటువైపు వెళ్లడం లేదు. ఇదే అవకాశంగా వ్యాపారులు వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. సంచిపై 25 కిలోలు అని ముద్రించి 24 కిలోలు నింపి ప్యాకింగ్ చేస్తున్నారు. కిలోకు రూ.2 నుంచి రూ.5, రూ.10 వరకు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా విధించే లక్ష్యాలను పూర్తి చేసేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు చిన్నచిన్న దుకాణాలపై దాడులు చేస్తున్నారు. కానీ బియ్యం సంచుల్లో కిలో నుంచి రెండు కిలోల వరకు తక్కువగా ఉంటున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

## మొదటి ర్యాంకు.. రాదెందుకు?

విశాఖపట్నం : స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులు ప్రకటించిన తొలిసారి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం 25వ స్థానంలో ఉంది. ఆ తర్వాత ఏడాది నుంచి వరుసగా ఎనిమిదేళ్ల ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదంతా ఎలా సాధ్యమైంది? పక్కా ప్రణాళిక, స్వచ్ఛతపై ప్రజలందరికీ అవగాహన, జన భాగస్వామ్యం, మురుగునీటి శుద్ధి, ఘనవ్యర్థాల నిర్వహణ వంటివి అమలు చేయడమే కారణం. మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) ఆ దిశగా సాగుతున్నా తడబడుతోంది. పూర్తిస్థాయిలో కసరత్తు లోపించింది.

**ఎక్కువ ఇక్కడ..తక్కువ సిబ్బంది, వాహనాలు:** స్వచ్ఛ మిషన్, ఆపరేషన్ క్లీన్ ఛాలెంజ్ పేరుతో ఇండోర్‌లో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రతి ఇంటి నుంచి తడి-పొడి చెత్తసేకరణ, రోడ్ల పక్కన ప్రతి 500 మీటర్ల దూరానికి ఒక డస్ట్‌బిన్ ఉండేలా నగరంలో 3 వేలు ఏర్పాటు చేశారు. ప్రజా మరుగుదొడ్ల సంఖ్య అత్యధికంగా పెంచారు. రోడ్లపై ఉమ్మితే జరిమానాలు విధించారు. తడిచెత్తను కంపోస్టుగా, పొడిచెత్తను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో రీసైక్లింగ్ చేస్తున్నారు. బయో మిథనైజేషన్ ప్లాంటు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి చెత్త తరలింపు, ట్రీట్‌మెంట్‌పై సీసీ కెమెరాల నిఘా ఉంచారు. జీవీఎంసీలో ఇండోర్ కంటే ఎక్కువ ఇళ్ల నుంచి చెత్తసేకరణ చేయాల్సి ఉన్నా తక్కువ వాహనాలు, తక్కువ సిబ్బంది ఉన్నారు.

నగరంలో బహిరంగంగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల నిర్వహణ అధ్వానంగా మారింది. కొండవాలు ప్రాంతాల్లో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. పలు చోట్ల అపార్ట్‌మెంట్ల వద్దా ఇదే పరిస్థితి.

స్వచ్ఛ ర్యాంకు సాధనలో ఎన్నో అంశాలు విశాఖకు ప్రతిబంధకాలుగా



మారాయి. రోజువారీ సేకరిస్తున్న చెత్తలో కాపులుప్పాడలోని విద్యుత్ ప్లాంటు, బయోగ్యాస్ ప్లాంట్‌కు, కంపోస్టు తయారీకి వెయ్యి టన్నులకు పైగా వినియోగిస్తున్నారు. అయితే పారిశుద్ధ నిర్వహణ, తరలింపు, ఘనవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక నిఘాలేదు. రెండేళ్ల వర్మీ కంపోస్టు తయారు చేసినా, కొనుగోలుకు ఎవరూ రాకపోవడంతో ఆయా కేంద్రాలు నిలిపివేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం వేరు చేయడం లేదన్న విమర్శలున్నాయి.

**అంతా సముద్రంలోకి:** ఇండోర్‌లో మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే నదుల్లోకి వదులుతారు.అలాగే.. శుద్ధి చేసిన మురుగు నీటిని పలు కూడళ్లలో ఫౌంటైన్లలో, గార్డెన్స్ నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. విశాఖలో రోజూ 263 ఎంఎల్‌డీ మురుగు ఉత్పన్నమవుతుంది. భూగర్భ డ్రైనేజీ కాల్వల ద్వారా వచ్చే మురుగును శుద్ధి చేయడానికి 19 ఎస్‌టీపీలు (శుద్ధికేంద్రాలు) ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని మరమ్మతులకు గురైన నేపథ్యంలో శుద్ధి చేయకుండానే మురుగును నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు.

**జరిమానాల్లేవు:** ఇండోర్ జనాభా దాదాపు 35 లక్షలు. ఇక్కడ ప్రజా మరుగుదొడ్లు 1500పైగా ఏర్పాటు చేశారు. 24 లక్షల జనాభా ఉన్న విశాఖలో 328 ప్రజామరుగు దొడ్లు ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణకు ఏటా రూ.7 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నా కొన్ని ప్రాంతాల్లో అంధకారం తప్పడం లేదు. వెలగని దీపాలను 24 గంటల్లో మరమ్మతు చేయకపోతే జరిమానా విధించాల్సి ఉన్నా ఆ ఊసే కరవైంది. మరోవైపు నిషేధిత ప్లాస్టిక్ ఇబ్బడిముబ్బడిగా విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితులు మారితేనే విశాఖ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ముందుకు దూసుకెళ్లే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

## నీటి సరఫరాలో మాయాజాలం

విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగంలో ఇంటి దొంగలు భారీగా దండుకుంటున్నారు. జోన్-8 పరిధిలోని కొందరు అధికారులు ఓ కంపెనీకి చేసే నీటి సరఫరాలో అక్రమాలకు పాల్పడుతూ రెండు చేతులా సంపాదించుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఏళ్ల తరబడి నీటి సరఫరా నిర్వహణ, ప్రాజెక్టుల్లో ఇంజినీర్లుగా కొనసాగుతూ, నీటి విక్రయాల్లోనూ, లెక్కల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ రెండూ పనులు కొందరికే అప్పగించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేస్తే జరుగుతున్న మాయ బయటపడుతుంది.

నరవ వద్ద 108 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) మురుగునీటి శుద్ధి కేంద్రం ఉంది. ప్రస్తుతం 54 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగును శుద్ధి చేస్తుంది. దాని నుంచి ఉత్పత్తయ్యే నీటిని కిలోలీటరు రూ.45ల చొప్పున ఓ కంపెనీకి విక్రయించాలి. రోజుకు 2 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అందుకు తగ్గ మురుగు నీటిని శుద్ధి చేయాల్సిన బాధ్యత ఓ నిర్వహణ సంస్థది. అయితే వారు సక్రమంగా నీటిని అందించలేకపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేకంగా నరవలోని మంచినీటి ట్యాంకుల నుంచి భారీ పైపులైను కంపెనీకి ఏర్పాటు చేశారు. నగర అవసరాలకు వినియోగించాల్సిన నీటిలో 2 ఎంజీడీల నీటిని గుట్టుగా ఈ మార్గంలో అందిస్తున్నారు. ఒప్పందం మేరకు కిలో లీటరుకు రూ.45 చెల్లిస్తున్నారు. అయితే... వారికి పంపిస్తున్నది శుద్ధి చేయని మంచినీరు. ఇది కిలో లీటరు రూ.90. అలా చూస్తే కిలో లీటరుకు రూ.45ల తక్కువ. ఇలా మిగులుతున్న సొమ్ములో వాటాలు కొందరు అధికారులకు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



నిత్యం 2 ఎంజీడీల నీటి సరఫరాలో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నా, ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై అనుమానాలు రేగుతున్నాయి. 2 ఎంజీడీల నీటికి నెలకు రూ.2.16 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 1.08 కోట్లే చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.25.92 కోట్లు రావాల్సి ఉన్నా రూ.12.96 కోట్లే ఖజానాకు వస్తున్నాయి.

మరో వైపు...పర్యావరణానికి ఇబ్బంది లేకుండా విదేశీ టెక్నాలజీ ఉపయోగించి, మురుగునీటిని మూడు దశల్లో శుద్ధి చేసి మంచినీరుగా మార్చి ఇవ్వాల్సిన ప్రాజెక్టు ఆదిలోనే పక్కదారి పట్టడంపైనా అధికారుల దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

జీవీఎంసీ విక్రయించే నీటిని లెక్కకట్టడానికి ప్రత్యేకంగా మీటర్లను ఏర్పాటు చేసింది. బల్క్ కనెక్షన్ విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరిస్తుంది. దీంతో సదరు కంపెనీకి నీటిని అందించే విషయంలో అధికారులు జాగ్రత్తపడ్డారు. నరవ ఎస్టీపీ వద్ద నీటిని విడిచిపెట్టే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన మీటరును... కంపెనీలో మంచినీరు, ఎస్టీపీ నుంచి వచ్చే నీరు కలిసే సమీప ప్రాంతంలో ఏర్పాటు చేశారు. దీని వల్ల ఎస్టీపీ నుంచి వచ్చే శుద్ధి చేసిన నీరే వినియోగిస్తున్నారన్న భ్రమ కల్పిస్తున్నారు.

# గుర్తింపులేని కష్టం.. కార్మికులకు నష్టం



కర్నూలు : భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు గుర్తింపు కార్డుల్లేక ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతున్నారు. పని ప్రదేశంలో భద్రత లేక ప్రమాదాల బారినపడుతున్నారు. వారికి ఎలాంటి ఆర్థిక సాయం అందక కుటుంబాలు వీధినపడాల్సిన పరిస్థితి నెలకొంది. బీమా పథకాల ప్రయోజనాలకు దూరం అవుతున్నారు. మరోవైపు పని ప్రదేశంలో సౌకర్యాలు, భద్రత కరవయ్యాయి. వాటి గురించి ప్రశ్నిస్తే మళ్లీ పనికి పిలవరన్న భయంతో ప్రమాదాల మధ్యనే కష్టపడుతున్నారు.

**భద్రత కరవు**

ఎత్తయిన ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు నిబంధనల ప్రకారం సేఫ్టీ బెల్టు ధరించాలి. అదుపుతప్పితే జారి కింద పడిపోకుండా మరో గోడకు రక్షణ వలయం ఏర్పాటు చేసుకోవాలి. పని ప్రదేశాల్లో శిరస్త్రాణం ధరించాలి. నేలపై నిల్చుని పనిచేసే వారు, విద్యుత్తు కార్మికులు కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజులు ధరించాలి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇవి అమలు కావడం లేదు. పని ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.

**కార్డు ఎలా పొందాలి..?**

భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందాలంటే 18- 59 మధ్య వయసు వారై ఉండాలి. నమోదు చేసుకునే ఏడాదిలో 90 రోజుల పాటు నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. కార్మికశాఖ అధికారులకు రూ.110 చెల్లించి గుర్తింపు కార్డు పొందవచ్చు. ఐదేళ్ల తర్వాత రూ.60 చెల్లించి కార్డును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-శ్రమ్ కార్డును ఉచితంగా అందిస్తున్నాయి. దీనికి నమోదు చేసుకుంటే మేలు.

**ఇవీ ప్రయోజనాలు**

భవన నిర్మాణ కార్మికులు పనిచేసే ప్రదేశంలో మృతి చెందితే రూ.5 లక్షల బీమా పరిహారం అందజేస్తారు. తక్షణ సాయంగా రూ.20 వేలు మంజూరు చేస్తారు. అంగవైకల్యానికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు అందజేస్తారు. కార్మికులు సాధారణ మరణం పొందితే కుటుంబ సభ్యులకు రూ.60 వేల సాయం అందుతుంది. మహిళా కార్మికులకు రెండు కాన్పుల నిమిత్తం రూ.20 చొప్పున అందజేస్తారు.

**సాయానికి ఎదురుచూపులు**

కర్నూలు జిల్లా గూడూరులో భవన నిర్మాణం కోసం గుంతలు తీస్తుండగా పక్కనే ఉన్న ప్రహరీ కూలడంతో ఇద్దరు కార్మికుల మృతి చెందారు.

ఇటీవల కర్నూలు నగరంలోని బుధవారపేటలో మూడంతస్తుల భవనం నిర్మాణ పనులకు వెళ్లిన ఓ కార్మికుడు సిమెంటు బస్తాను పైకి తీసుకెళ్తూ అదుపుతప్పి కిందపడి మృతి చెందారు.

ఇలా పలువురు మృతి చెందారు. ఎందరో దివ్యాంగులుగా మారారు. వీరిలో చాలామంది గుర్తింపు పత్రాల్లేక నష్టపోయారు. మరోవైపు గుర్తింపు పత్రాలు కలిగిన కార్మికులు మృతి చెందినా వారి కుటుంబాలకు బీమా సొమ్ము సకాలంలో అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు : 1,67,860

ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలు : 5,318

**రెండురోజుల్లో కార్డు ఇస్తాం**

- కె.వెంకటేశ్వర్లు, కార్మికశాఖ ఉప కమిషనరు, కర్నూలు జిల్లా

భవన, ఇతర నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి. కార్మికశాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో మంజూరు చేస్తున్నాం. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందిన సందర్భంలో వారి కుంటుంబం పోలీసు కేసు నమోదు చేయిస్తే పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

# సమయం దాటాక విత్తనమా!

కదిరి : ఖరీఫ్‌లో అదునుకు పెట్టే పంటలే చేతికందటం లేదు. అలాంటిది సీజన్ ముగుస్తున్న సమయంలో వర్షాధార సాగుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. నూతన వంగడం.. నాలుగైదు రోజుల్లో ముగుస్తున్న ఖరీఫ్ సాగు సమయం. ఈ తరుణంలో వర్షాకాలం సాగంటూ విత్తనాలు ఇవ్వడమేంటని రైతులు చర్చించుకుంటున్నారు. నూతన వంగడమైన టీసీజీఎస్ 1694 (విశిష్ట) వేరుసెనగను రైతు పొలాల్లో సాగుకు చర్యలు చేపట్టారు. ఈ విత్తనాన్ని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేసేషన్‌చే సాగు చేయించాలి. ఎంపిక ప్రక్రియ మార్చిలోనే పూర్తవ్వాలి. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో ఎన్జీవోల ప్రమేయంతో పంపిణీకి అధికారులు విత్తనం సరఫరా చేస్తున్నారు. వేరుసెనగ కాయలను పంపిణీ చేసేదెప్పుడు, విత్తనం సిద్ధం చేసుకుని ఎప్పుడు సాగు చేస్తారోనన్న అయోమయం నెలకొంది. దీంతో ఉచిత విత్తన సాగు లక్ష్యం నీరుగారేలా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**డివిజన్‌లో 500 హెక్టార్లు**

కదిరి వ్యవసాయ డివిజన్‌లో 500 హెక్టార్లలో సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కదిరి-6 రకం సాగులోకి వచ్చి 23 ఏళ్లు పూర్తయ్యింది. దీని స్థానంలో తెగుళ్లకు తట్టుకుని ఎక్కువ దిగుబడి వచ్చేలా కొత్తరకం వేరుసెనగ సాగును పెంచేలా చర్యలు చేపట్టారు. ఇందుకు టీసీజీఎస్ 1694 వంగడాన్ని పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 5 బస్తాల చొప్పున విత్తనం అందజేస్తారు. ఇప్పటికే నల్లమాడలో పంపిణీ చేశారు. మిగిలిన మండలాలకు సరఫరా చేస్తున్నారు.

**కొత్తరకంతో సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం**



సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

కదిరి-6 రకం స్థానంలో వాతావరణ మార్పులు, చీడపీడలు, దిగుబడి పెంచేలా విశిష్ట రకం విత్తనాన్ని ఉచితంగా ఇస్తున్నాం. ఎఫ్‌పీఓలతో రైతుల గుర్తింపు, సాగు చేయిస్తాం. వ్యవసాయశాఖ పర్యవేక్షణలో పండించే పంటను తిరిగి వెనక్కు తీసుకునేలా రైతులతో ఒప్పందం చేయిస్తున్నాం. ఎక్కడా సమస్యలేదు. కొత్తరకం విత్తనంతో సాగు విస్తీర్ణం పెంచేలా చూస్తున్నాం.

జిల్లా: శ్రీసత్యసాయి

వేరుసెనగ రకం: టీసీజీఎస్ 1694

సాగు విస్తీర్ణం: 1,250 ఎకరాలు

రైతులు: 500

# విశాఖ కేంద్రంగా అద్దె గర్భం అక్రమాలు

విశాఖపట్నం : ఎంతోమంది చిన్నారులను తల్లి ఒడికి దూరం చేశారు. సరోగసీ ఎరవేసి ఎందరో దంపతులను మనోవేదనకు గురి చేశారు. కాసుల కక్కుర్తితో అడ్డదారి తొక్కారు. తల్లీపిల్లల్ని వేరు చేస్తున్నామనే మానవత్వం మరిచారు. తప్పొప్పుల విచక్షణ గాలికొదిలేసి సంతానలేమిని సొమ్ము చేసుకునేందుకు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. ఇవీ సికింద్రాబాద్‌లోని సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు సాగించిన దారుణాలు. పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో బాధితులు ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేసేందుకు ముందుకొ స్తున్నట్టు సమాచారం. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సరోగసీ కోసం సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లోని డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.35లక్షలు వసూలు చేసి సరోగసీ విధానంలో బిడ్డ పుట్టాడంటూ అసోంలో కొనుగోలు చేసిన పిల్లాడిని విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో గోపాలపురం పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత సహా 8 మందిని 7 రోజుల పోలీసు కస్టడీకి కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే 30 ఏళ్లుగా సాగించిన అక్రమాల బాగోతం బయటపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. డాక్టర్ నమ్రతతో సహా 8 మంది నిందితులు నాంపల్లి న్యాయస్థానంలో బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు.



విశాఖ కేంద్రంగా దందా: సంతానం లేని దంపతులకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కతా, ఒడిశాలో సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల్లో వైద్యచికిత్స అందిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు నాలుగేళ్ల క్రితమే అనుమతి రద్దు చేశారు. అయినా.. దాన్ని నివాస భవనంగా చూపుతూ దందా సాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో వివరాలు సేకరిస్తూ అద్దెగర్భంతో సంతానం పొందే వీలుందని ఎంతోమంది దంపతుల్లో నమ్మకం కలిగించి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులకు వివాహమై 18 ఏళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవటంతో 2019లో కేపీహెచ్‌బీ కాలనీలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.13లక్షలు తీసుకొని సరోగసీతో బిడ్డను అందిస్తామంటూ భరోసా ఇచ్చారు. సరోగసీ చికిత్స అందిస్తున్న మహిళ కొవిడ్‌తో మృతి చెందినట్టు బురిడీ కొట్టించారు. ఫెర్టిలిటీ కేంద్రం సాగిస్తున్న మోసాల గురించి తెలిసిన బాధితులు కేపీహెచ్‌బీ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస దంపతుల నుంచి రూ.12లక్షలు తీసుకొని సరోగసీ బిడ్డ పేరుతో విశాఖపట్నంలో కొనుగోలు చేసిన చిన్నారిని చేతికిచ్చారు. డీఎన్‌ఏ పరీక్షలో అసలు విషయం బయటకు రావటంతో బాధితులు 2015లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లోని కేంద్రాలకు వచ్చిన భార్యాభర్తలకు వైద్యపరీక్షలు నిర్వహించి సరోగసీ కోసం విశాఖపట్నం పంపిస్తున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన నిరుపేద మహిళలు, యువతులను సరోగసీకి సిద్ధంగా ఉన్నట్టు చూపుతారు. దంపతుల నుంచి వీర్యకణాలు, అండాలను సేకరిస్తారు. వాటిని ఏ మహిళ గర్భంలో ప్రవేశపెట్టబోతున్నామనేది వివరిస్తారు. ఏ మాత్రం అనుమానం రాకుండా గర్భంలో ఊపిరిపోసుకుంటున్న బిడ్డకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కాబోయే తల్లిదండ్రులకు తెలియజేస్తుంటారు. డెలివరీ సమయం ముందుగానే చెప్పి విశాఖపట్నంలో బిడ్డను అప్పగిస్తారు. పిల్లల రూపురేఖలపై అనుమానం వచ్చిన బాధితులు డీఎన్‌ఏ పరీక్ష చేయించినప్పుడు అక్రమాలు బయటపడుతున్నాయి. తమ బిడ్డలు కాదని తెలిసినా, విషయం బయటకు పొక్కితే శిశువులను కొనుగోలు చేసినందుకు తమపై కేసు నమోదవుతుందనే ఉద్దేశంతో చాలామంది మౌనం వహిస్తున్నట్టు పోలీసు అధికారి తెలిపారు.

# అచ్యుతాపురం రోడ్డుకు అక్రమ గ్రావెల్!

అచ్యుతాపురం : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు అధికారులు అధికారికంగా ఎక్కడా క్వారీని గుర్తించకపోయినా గ్రావెల్ సరఫరా మాత్రం కొనసాగుతోంది. కొండకర్ల వద్ద 500 మీటర్ల పరిధిలో నమూనా రోడ్డును అభివృద్ధి చేస్తున్న తరుణంలో దీనికి అవసరమైన గ్రావెల్‌ను అక్రమంగా తీసుకొస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కొండకర్ల వద్ద రోడ్డుకు రెండు వైపులా రక్షణగోడ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి కొంత తవ్విన ఎర్రమట్టిని వినియోగిస్తుండగా మరికొంత అక్రమ పద్ధతిలో గ్రావెల్‌ను తీసుకొచ్చి పూడ్పిస్తున్నారని తెలిసింది. ఈ రోడ్డును 100 అడుగుల మేర విస్తరించ



డానికి అవసరమైన గ్రావెల్‌ను కొండకర్ల కొండ నుంచి తవ్వడానికి అనుమతులు కోసం చేసిన దరఖాస్తు పెండింగ్‌లో ఉందని ఆర్అండ్‌బీ ఏఈ పద్మని తెలిపారు. అనధికారంగా ఎక్కడ నుంచి గ్రావెల్ తీసుకురావడంలేదని రక్షణగోడ కోసం తీస్తున్న గోతుల ద్వారా వచ్చిన మట్టినే వినియోగిస్తున్నామని వివరణ ఇచ్చారు.

చురకలు



# అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

అనంతపురం : ముదిగుబ్బ మండలం వట్టికుంటతండాకు చెందిన రమేశ్‌నాయక్ పామిడిలోని ఏడీసీసీ బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. ఈ నెల 19న అనంతపురానికి వచ్చిన ఆయన సాయినగర్ 7వ క్రాస్‌లో ఉన్న ఓ సెలూన్‌కు వెళ్లి కటింగ్, షేవింగ్ చేయించుకున్నారు. ఆ సమయంలో వర్షం కురిసి నీరు పెద్దఎత్తున నిలిచింది. సెలూన్ నుంచి బయటకు వచ్చిన ఆయన నీటిలో రోడ్డు దాటుతూ ఓ ఇనుప పైపును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. రాయదుర్గం పట్టణంలోని కోట ఏరియాలో ఈ నెల 18న తాపీ మేస్త్రీ ఒకరు కూలీలతో భవన నిర్మాణ పనులు చేయిస్తుండగా ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడే క్రమంలో ఆయన విద్యుత్తు తీగలను గమనించకుండా తగలటంతో షాక్‌కు గురై మిద్దెపై నుంచి కిందపడ్డాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుస విద్యుత్తు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం.. అవగాహన లేకపోవడంతో పలువురు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు గాయపడుతున్నారు. వర్షాకాలంలో కరెంటు పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు.

**ఇవి పాటించాలి..!**

ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్తు ఉపకరణాలు వాడకూడదు.

ఎలాంటి విద్యుత్తు సర్వీసులైనా ఎర్తింగ్ చేయించుకోవాలి. ప్రతి గదికి ఎంసీబీలు ఏర్పాటు చేసుకోవాలి.

ఐఎస్ఐ, స్టార్‌రేటింగ్ విద్యుత్తు ఉపకరణాలను మాత్రమే వాడాలి.

గృహ సముదాయాల్లో విద్యుత్తు మీటర్లను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసుకుంటారు. వీటి భద్రత దృష్ట్యా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

తెగిపడిన తీగలను, తడిసిన స్తంభాలను, తడి చేతులతో ఉపకరణాలను



ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు.

చిన్నపిల్లలకు స్విచ్‌బోర్డులు అందుబాటులో లేకుండా చూడాలి.

ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై ఆరేయొద్దు.

హీటర్ వాడే వారు స్విచ్‌ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తరువాతే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టుకోవాలి.

విద్యుత్తు లైన్ల కింద ఫోన్‌లో మాట్లాడకూడదు. ఛార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దు.

రైతులు, ప్రజలు సొంతంగా విద్యుత్తు పనులు చేయకూడదు. ఉద్యోగులు, టెక్నీషియన్లతో మాత్రమే పనులు చేయించుకోవాలి.

**నివారణకు చర్యలు**

శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్, ఎస్ఈలు, విద్యుత్తుశాఖ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు విద్యుత్తు సమస్యలు తలెత్తితే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరిగే తీరు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లఘు చిత్రాలు తీయించ్చా. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కరపత్రాలు అందించి ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే రూ.5 లక్షలు పరిహారం చెల్లిస్తున్నాం.

# శుభ్రత.. బాధ్యత!

నర్సీపటం : పల్లెల స్వచ్ఛతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం వర్షాలకు తోడు గ్రామాల్లో అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ పరిస్థితి ఎక్కడ ఎదురైనా సంబంధిత అధికారులనే బాధ్యులను చేసి చర్యలు తీసుకునేలా ప్రత్యేక కార్యాచరణ అమలవుతోంది. ఏటా వర్షాకాలంలో అతిసారం, మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటిని నివారించడంపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ దృష్టి సారించింది. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఉప ఎంపీడీఓలను బాధ్యులను చేస్తామంటూ ఆ శాఖ కమిషనర్ ఇటీవల హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని గ్రామ పంచాయతీ ఉన్నతాధికారులు వీటి అమలుపై రోజూ సమీక్షిస్తున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో 646 గ్రామాలు ఉన్నాయి. వీటన్నింటిలో పారిశుద్ధ్యం, రక్షిత నీటి పథకాల నిర్వహణ పనులను పక్కాగా చేపట్టాలని పంచాయతీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉప ఎంపీడీఓలు మండల పరిధిలో డీఎల్‌పీఓలు డివిజన్ పరిధిలో ఊర్లన్నీ సందర్శించి పర్యవేక్షించాలని వీటిలో సూచించారు. రోగాలు ఎక్కువయ్యే చోట సంబంధిత అధికారులు బాధ్యులవుతారని, ఆదేశాలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఫలితంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రమంగా పరిశుభ్రతకు బాటలు పడుతున్నాయి. చెత్త కుప్పలతోపాటు వ్యరాలు, కలుషిత నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**తెల్లవారుజాము నుంచే రోడ్లపైకి**

పారిశుద్ధ్యం మెరుగుకు ఉదయం ఆరు గంటలకే పంచాయతీ కార్యదర్శులు, ఉప ఎంపీడీఓ తమ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బందిని పరుగులెట్టిస్తున్నారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లోని సిబ్బందికి సైతం ఉన్నతాధికారులు ప్రత్యేక పనులు అప్పగించారు. ఒక్కొక్కరికి ఇరవై మంది పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. వీరు రోజూ ఉదయం చేయించే పనులను వీడియో కాల్ ద్వారా పరిశీలించి నివేదికలు పంపేలా ఏర్పాట్లు చేశారు.

**చాలా మార్పు కనిపిస్తోంది**

జిల్లా కలెక్టర్, డీపీఓ సూచనలు పాటిస్తూ తీసుకుంటున్న చర్యలు ఫలితంగా పారిశుద్ధ్యంలో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. రోడ్డు పక్కన చెత్తకుప్పలను 80 శాతం వరకు తొలగించాం. ఇంటింటి చెత్త సేకరణ పనులు యాభై శాతానికి పైగా మెరుగుపడ్డాయి. సచివాలయంలోని ఇంజినీరింగ్ కార్యదర్శులను బాధ్యులను చేస్తూ శుద్ధమైన తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. పల్లెల్లో దోమల వృద్ధిని కట్టడి చేసే పనులు ముమ్మరమయ్యాయి. మూర్తి, డీఎల్‌పీఓ, నర్సీపట్నం

# గోకివాడ టూ ఢిల్లీ



పిఠాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ముందంజలో ఉన్న పిఠాపురం మండలం గోకివాడ సర్పంచి కీర్తి హరినాథబాబు ఈ ఏడాది ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగే ఈ సంబరాలకు మన రాష్ట్రం నుంచి 10 జిల్లాలకు చెందిన సర్పంచులకు అవకాశం కల్పించగా, కాకినాడ జిల్లా నుంచి హరినాథ బాబు ఎంపికైయ్యారు. ఆయన జీవిత భాగస్వామితో కలిసి ఈ నెల 13న ఈ వేడుకలకు హాజరుకావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు పంపారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ నిధులు నుంచి ఈయన రాకపోకలకు ఖర్చు చేయనున్నారు.

**అవకాశం ఇలా..**

ప్రభుత్వ పథకాలు అమలులో ముందంజలో ఉన్న గ్రామాల సర్పంచులను ఇందుకు ఎంపిక చేస్తారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి గోకివాడ సర్పంచికి ఈ అవకాశం దక్కింది. జలజీవన్ మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, పీఎం విశ్వ కర్మ యోజన, అంగన్‌వాడీ పోషన్ 2.0, కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం సూర్య ఘర్, మిషన్ ఇంద్ర ధనస్సు తదితర పథకాల అమలులో ముందంజలో ఉన్నట్లు గుర్తించి గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచిని ఎంపిక చేశారు.

**ఉప ముఖ్యమంత్రి చొరవతోనే..**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి మా గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోంది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశాన వాటిక అభివృద్ధి, సచివాలయం, పాఠశాలల నిర్మాణం పూర్తయ్యింది. పారిశుద్ధ్య సమస్య మెరుగుపడుతోంది. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తాను.

కీర్తి హరినాథ బాబు, సర్పంచి, గోకివాడ

# పడవలే ఆధారం..



పి.గన్నవరం : గోదావరి వరద భద్రాచలం వద్ద నెమ్మదించినప్పటికీ కోనసీమ ప్రాంతంలోని నదీపాయల్లో ఇంకా పోటెత్తి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి నుంచి 6,01,844 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజికి సంబంధించి 175 ఫ్లడ్‌గేట్లను 1.0 నుంచి 1.80 మీటర్లు ఎత్తి ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 2,59,704 క్యూసెక్కులు, ర్యాలి ఆర్మ్ నుంచి 1,55,242, మద్దూరు ఆర్మ్ నుంచి 81,636, విజ్జేశ్వరం ఆర్మ్ నుంచి 1,05,262 క్యూసెక్కులు చొప్పున విడిచిపెట్టడంతో దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి గోదావరి నదీపాయాల్లో వరద ఉరవడి పెరిగింది. సాయంత్రం ఆరు గంటలకు బ్యారేజి వద్ద 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఖరీఫ్ సాగుకోసం తూర్పుడెల్టాకు 2,200, మధ్యడెల్టాకు 2,050, పశ్చిమడెల్టాకు 5,000 వెరశి 9,250 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నారు. కోనసీమలో బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక, ఊడుమూడిలంక, పెదమల్లంక, ఆనగార్లంక, మర్రిమూల, అయోధ్యలంక గ్రామాల ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. లోతట్టు లంకభూముల్లోకి వరద నెమ్మదిగా చేరుతోంది. కనకాయలంకకాజ్‌వే వద్ద వరదపెరిగింది. సోమవారం ఉదయానికి ఈ కాజ్‌వే ముంపు బారినపడే అవకాశం ఉంది. పైనుంచి వరద ప్రవాహం తగ్గుతుండటంతో ఇక్కడ నెమ్మదిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

**సాగుకు ఇబ్బందులు**

మామిడికుదురు: వైనతేయ నదిలో వరద నీరు పెరగడంతో లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు, పశుగ్రాసాలు తెచ్చుకునేందుకు పడవలపై వెళ్లి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పాశర్లపూడి మీదుగా ఆదుర్రు వరకు వరద నీరు పోటెత్తడంతో మత్స్యకారులు పడవలను ఒడ్డునే నిలిపివేశారు. తీరాన్ని ఆనుకుని ఉన్న పాటు రేవుల్లోకి వరద నీరు చేరుతోంది. గోదావరి వరద బొబ్బర్లంక వద్ద ఇళ్లకు చేరువవుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందతున్నారు. మరింత పెరిగితే లంకలో పంటలు మునిగి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వరద పర్యవేక్షణ అధికారులు అంటున్నారు.

# పైసలందక.. పనులు సాగక..



ఎమ్మిగనూరు : నెలలు గడుస్తున్నా పైసలు చేతికి రాకపోవడంతో పనులపై గుత్తేదారుల ఆసక్తి సన్నగిల్లుతోంది. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపడుతున్న పనుల పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్నింటికి టెండర్లు పూర్తి చేయగా.. సగం పనులు చేసి వదిలేశారు. కొన్నింటికి టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన కరవవుతోంది. చాలా చోట్ల ప్రారంభించిన పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, కాల్వల పనులు జరగక పురాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో బిల్లుల బకాయిలు, అసంపూర్తిగా వదిలేసిన పనులపై అందిస్తున్న పరిశీలన కథనం.

**యాప్‌తో చిక్కులు...**

ఎమ్మిగనూరు, నంద్యాల, ఆదోని, డోన్, ఆత్మకూరు, నందికొట్కూర్ మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పనులు చేపట్టి ఏడాది కావస్తున్నా.. బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా నిధి యాప్ ద్వారా పూర్తిగా బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. ఎమ్మిగనూరులో 26 పనులకు రూ.4.50కోట్లు, ఆదోనిలో 35 పనులు పూర్తి చేయగా రూ.5.5 కోట్ల మేరకు చెల్లించాలి.. నంద్యాల, ఇతర మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 120 పనులకు రూ.10కోట్లకు పైనే బకాయిలు ఉన్నాయి. మూణ్నెల్లుగా అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు రాక.. గుత్తేదారులు పనులు వదిలేశారు.

**అసంపూర్తిగా ఉన్న పనులు**

ఎమ్మిగనూరు పట్టణంలో రూ.18లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు టెండర్లు వేశారు. 2023 జనవరిలో పనులకు భూమి పూజ నిర్వహించారు. 300 మీటర్లకు పైగానే సీసీ రోడ్డు వేసేందుకు మట్టి పనులు చేపట్టి కంకర పరిచారు. రెండేళ్లు కావస్తున్నా పనులు చేయకుండా గుత్తేదారు వదిలేశారు. నిర్లక్ష్యం చేస్తున్న గుత్తేదారులపై అధికారులు పట్టించుకోవడం లేదు.

గంజహళ్లి దారి గుంతలు పడటంతో రూ.90లక్షలతో పనులు మంజూరు చేసి గుత్తేదారుడికి అప్పజెప్పారు. కానీ వైకాపా హయంలో చేసిన పనులకు రూ.2కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఏడాది కావస్తున్నా తారు రోడ్డు పనులు చేపట్టలేదు. పాత బిల్లులు వస్తే... కొత్త పనులు చేస్తామని మొండికేశారు.

మునెప్పనగర్‌లో రూ.16లక్షలు, మిలటరీ కాలనీ మారెమ్మ దేవాలయం వద్ద రూ.40లక్షలు, సెంట్రల్ లైటింగ్ ఐదు పనులకు దాదాపు రూ.కోటి, రెండో వార్డులో రూ.20లక్షలు, చంద్రయ్యకొట్టాల, వెంకటాపురంలో రూ.30లక్షలు, ఎద్దుల మార్కెట్ సమీపంలో చేసిన పనులకు రూ.30లక్షలు, పట్టణంలో మిగిలిన కాలనీల్లో చేపట్టిన రోడ్లు, ఇతర పనులకు బిల్లులు రాక పట్టణాభివృద్ధి నిలిచిపోయింది.

ఆదోని, నంద్యాల ప్రాంతంలో టెండర్లు పిలిచినా సీసీ రోడ్ల పనులు చేపట్టకుండా వదిలేశారు.

సగంలో వదిలేశారుఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనివాస సర్కిల్ నుంచి మెయిన్ రహదారి ఇది. వైకాపా హయాంలో రహదారి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.కోటితో టెండర్లు పిలిచి సుమారు 750 మీటర్ల తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మిగిలిన 200 మీటర్ల పనులు వదిలేశారు. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు వదిలేశారు.

# చినుకమ్మా ఎటు పోతివే!

అనకాపల్లి : జులై నెల ముగింపు దశకొచ్చింది. ఆకాశంలో మబ్బులు కమ్మి.. జోరువానలతో పుడమి పులకించాల్సిన రోజులివి. కానీ ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వానలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. వేసవిని తలపించే ఉష్ణోగ్రతలతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో వరుణుడు కుంభవృష్టి కురిపిస్తే ఈసారి చిరుజల్లులు పడటమే అరుదైపోయింది. నారు పోసిన రైతన్నలు నీరు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కర్షకులను వరుణుడు కరుణించడం లేదు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. ఫలితంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. జిల్లాలో అన్ని పంటలు కంటే వరి సాగు అధికం. గతంలో ఎప్పుడూ లేని విధంగా కేవలం ఒక్క శాతమే ఇంత వరకు



నాట్లు వేశారు. జిల్లాలో వరి తర్వాత అధికంగా సాగు చేసేది చెరకు. ఇంతవరకు 37 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. మొక్కజొన్న, నువ్వు, కందులు పరిస్థితీ అదే విధంగా ఉంది. నాట్లు వేసిన పంటలు సైతం నీటి ఎద్దడికి గురవుతున్నాయి. వరి సాగుకు సమయం ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మే నెల సాధారణ వర్షపాతం 103.7 మి.మీ. కాగా.. 152.2 మి.మీ. పడింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 131.1 మి.మీ. కాగా దాదాపు అంతమేర వర్షం పడింది. జులై నెల వచ్చేసరికి పరిస్థితి మొత్తం తారుమారైంది. గతేడాది ఈ సమయానికి వర్షాలు మురిపిస్తే ఈ ఏడాది ఎదురుచూపులతోనే గడిపేయాల్సి వచ్చింది.

**ఎండా కాలంలా ఉంది**

వరి విత్తనాలు సకాలంలో లభించడంతో నారు పోశాం. నారు వేసిన తర్వాత వర్షం సరిగా పడలేదు. నీరు లేక నారు ఎండిపోతుంది. ఏమి చేయాలో తెలియడం లేదు. వర్షాకాలం అయినా ఎండాకాలంలా ఉంది. ఇల్ల అప్పారావు, రైతు, కాకరాపల్లి

జులై నెల సాధారణ వర్షపాతం : 146.9 మి.మీ.

గతేడాది ఇదేనెలలో కురిసింది : 251.2 మి.మీ.

ఈ నెలలో కురిసింది : 62.4 మి.మీ.

# తక్షణ రక్షణకు 'వంద'నం

అనకాపల్లి : శాంతిభద్రతల పరిరక్షణకు.. ఆపద వేళ మేమున్నామని ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన డయల్ 100/112తో చాలామంది లబ్ధి పొందుతున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తక్షణ సాయం అందించడానికి వీలుగా పోలీస్ సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నారు. 100/112 నంబర్లలో వేటికి ఫోన్ చేసినా వెంటనే సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సాయం అందిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోలు రూం ఏర్పాటుచేశారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో ఈ కంట్రోల్ రూంను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. డయల్ 100/112కి వచ్చే సమస్యలను పరిష్కరించే సమయంలో గతంలో కాలయాపన జరిగేది. దీనిని తగ్గించేలా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. సిబ్బందికి ట్యాబ్‌లు అందించి బాధితులున్న ప్రదేశంతోపాటు సిబ్బంది వెళ్తున్న ప్రాంతం, ప్రయాణిస్తున్న వేగం, సమయంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు.

జిల్లాలో 34 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌లో ముగ్గురు చొప్పున సిబ్బందికి తక్షణ సహాయక చర్యలపై శిక్షణ ఇచ్చారు. వీరు మిగిలిన సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. దూరాన్ని బట్టి ఫోన్ చేసిన ఐదు నుంచి 15 నిమిషాల్లోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తున్నారు

ఈ ఏడాది జనవరి నుంచి ఇంతవరకు కంట్రోల్ రూంకు 9,025 ఫోన్ కాల్స్ వచ్చాయి. వీటిలో అధికంగా జూదం ఆడటం, వాహనాలు వేగంగా నడపడం, ఈవ్ టీజింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, దుర్భాషలాడుతూ తగాదాలకు దిగడం వంటి వాటిపై 4,845 కాల్స్ వచ్చాయి.

ఇంట్లోనుంచి వెళ్లి అదృశ్యం కావడంపై 97, ఆకతాయిల వేధింపులు, అల్లరిమూకల సంచారం, గృహ హింస, భార్యను కొట్టడం వంటివి 1,282 ఫిర్యాదులు వచ్చాయి. కొట్లాటకు సంబంధించి 1,383 ఫోన్‌కాల్స్, చోరీలు, ఆస్తి తగాదాలకు సంబంధించి 488 ఫోన్లు వచ్చాయి. ఇలా వచ్చిన ఫోన్ కాల్స్‌పై సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించడంతోపాటు అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసుల సేవలు

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆదుకునేందుకూ పోలీసులు చొరవ చూపుతున్నారు. 16న నంబరు జాతీయ రహదారి వెంబడి 9 పెట్రోలింగ్ వాహనాలు ఉన్నాయి. డయల్ 112కి ఎక్కువగా రోడ్డు ప్రమాదాల సమాచారంపై ఫోన్లు వస్తున్నాయి. దీంతో పెట్రోలింగ్ సిబ్బందికి ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించి వీరికి వైద్యులతో శిక్షణ ఇప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకుని అవసరమైన వారికి ప్రథమ చికిత్స అందించడంతోపాటు వేగంగా ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పరవాడలోని ఓ ఇంట్లో దొంగ చోరీ చేయడానికి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంటి యజమాని సీసీ టీవీ ద్వారా చూసి విషయం 112కి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఆ దొంగను పట్టుకున్నారు. ఇలా ప్రజల్లో చైతన్యం రావడంతోపాటు పోలీసులు ఇస్తున్న భరోసాతో శాంతి భద్రతల పరిరక్షణకు 112 నంబరు ఎంతో ఉపయోగపడుతుంది.

**వేగంగా సేవలు అందించేలా..**

ప్రజలకు పోలీస్ సేవలు వేగంగా అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఫోన్ వచ్చిన వెంటనే సంబంధిత స్టేషన్ల సిబ్బందికి అప్రమత్తం చేయడంతోపాటు వారు అక్కడికి వెళ్లే సమయాన్ని సైతం పర్యవేక్షిస్తున్నాం. గతంలో కంటే ఇప్పుడు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల చాలావరకు శాంతిభద్రతల సమస్యలకు పరిష్కారం లభించింది.

రమేశ్, పోలీస్ కంట్రోల్ రూం సీఐ, అనకాపల్లి

# విత్తన వి'పత్తి'

ఎమ్మిగనూరు : పశ్చిమ ప్రాంతం విత్తన పత్తికి సాగుకు అనుకూలం.. గతేడాది రైతులు మంచి లాభాలు పొందారు. ఈ ఏడాది ఓ కంపెనీ ఆర్గనైజర్ కర్షకులను నిండా ముంచారు. బ్రీడర్ సీడ్ విత్తనాలు ఇచ్చారు.. సాగు చేయండి పెట్టుబడి ఇస్తామని నమ్మబలికా రు. పంట వేసిన తర్వాత.. పెట్టుబడి ఇవ్వలేం.. అరకొరగా కొంటామని కొర్రీలు పెడుతున్నారు. చేసేది లేక రైతులు పంటను తొలగించి మరోటి వేయడానికి సిద్ధమవుతున్నారు.

ఎమ్మిగనూరు, కోసిగి, పెద్దకడబూరు, గోనెగండ్ల తదితర మండలాల్లో 500 ఎకరాలకు పైగా సీడ్ పత్తి సాగు చేసున్నట్లు అంచనా. విత్తనం వేసి నెలన్నర కావస్తోంది. బ్రీడర్ సీడ్ విత్తనం, పెట్టుబడులు ఇస్తామని, ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు కొంటామని ఓ ప్రైవేట్ కంపెనీ ఆర్గనైజర్ నమ్మించారు. ఇంతవరకు పెట్టుబడికి రూపాయి ఇవ్వలేదు. సాధారణంగా సీడ్ పత్తి సాగుకు ఎకరానికి రూ.3నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి అవుతుం ది. డబ్బులు అడిగితే ఇవ్వకుండా.. ఈసారి



ఎకరానికి రూ.48వేల చొప్పున రెండు క్వింటాళ్లు కొంటామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

**కొర్రీలు పెట్టి మోసం**

జిల్లాలో దాదాపు మూడు దశాబ్దాలుగా రైతులు సీడ్ పత్తి సాగు చేస్తున్నారు. పలు కంపెనీ ఆర్గనైజర్లు విత్తనంతోపాటు పెట్టుబడి ఇస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు చేస్తారు. ఈసారి పెట్టుబడి ఇవ్వకుండా, పంట రాకముందే రెండు క్వింటాళ్లే కొంటామని కొర్రీలు పెడుతున్నారు. దిక్కుతోచని రైతులు జులై చివరి వరకు ఇతర పంటల సాగుకు సమయం ఉండటంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. కోటేకల్, నక్కలమిట్ట తదితర గ్రామాల్లో సీడ్ పత్తి పంటను తొలగిస్తున్నారు.

"ఎకరన్నరలో సీడ్ పత్తి వేశాం. పంట కొంటాం, పెట్టుబడి ఇస్తామని కంపెనీ ఆర్గనైజర్ చెప్పారు. ఇప్పుడు రెండు క్వింటాళ్లు కొంటామని చెబుతున్నారు. ధర బాగా తగ్గించారు. చేసేది లేక పంటను తొలగించి వేరే పంట వేసుకునేందుకు నేల శుద్ధి చేసుకుంటున్నాం" అని కోటేకల్‌కు చెందిన రంగన్న పేర్కొన్నారు.

# నకిలీ 'మక్కలు'.. నాటగానే నష్టాలు

నంద్యాల : నకిలీ విత్తనాలు మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి.మే, జూన్ నెలల్లో వర్షాలు కురవడంతో పలు మండలాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కొత్తపల్లి, జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు, గడివేముల, పాణ్యం, అవుకు, బనగానపల్లి మండలాల్లో కలిపి 22 వేల ఎకరాల వరకు సాగు చేశారు. చాలాచోట్ల విత్తనాలు మొలకెత్తలేదు. ఫిర్యాదులందుకొన్న వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నకిలీ విత్తనాలతోనే ఈ పరిస్థితి వచ్చిందని తేల్చారు. చేసేది లేక రైతులు మళ్లీ దున్నేసి ఇతర పంటలు వేస్తున్నారు. కొత్తపల్లి మండలం ఎదురుపాడులో ఓ రైతు సాగు చేసిన మొక్కజొన్న. గత నెలలో నాలుగెకరాల్లో విత్తనం నాటారు. పదిరోజులు దాటినా పూర్తిగా మొలకలు రాలేదు. వ్యవసాయాధికారులను సంప్రదించగా నకిలీ విత్తనాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని తేల్చారు. వారంతా వ్యాపారిని నిలదీయగా నష్ట పరిహారం చెల్లిస్తానని అంగీకరించారు.

**గతేడాది భారీగా...**

గతేడాది నంద్యాల మండలం పాండురంగాపురం రైతులు నంద్యాలకు



చెందిన ఓ వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన సీఎంహెచ్ఎస్ 150 రకం విత్తనాన్ని 125 ఎకరాల్లో సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా కంకి మాత్రం రాలేదు. నంద్యాల మండలంలో రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారు. చేసేది లేక ఆందోళన బాట పట్టారు.

**రంగుల ప్యాకెట్లలో పెట్టి**

నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు నకిలీ విత్తనాల దందా చేస్తున్నారు. గుర్తింపు పొందిన, వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన విత్తన సంస్థల ఉత్పత్తులు పోలిన ప్యాకింగ్‌లో విక్రయిస్తున్నారు. మరికొందరు అసలు విత్తనాలతో పాటు వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 5252 రకం, సీఎంహెచ్ 165 రకం, అర్జున్ సంకరం తదితర పేర్లతో అంటకడుతున్నారు. గుంటూరు, హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి ఇవి జిల్లా మార్కెట్‌లోకి వస్తున్నాయి.

**కిలోపై రూ.1500 మిగులు**

సాధారణంగా కిలో మొక్కజొన్న విత్తనాలు సంస్థను బట్టి రూ.1400 నుంచి రూ.1700 వరకు విక్రయిస్తున్నారు. నకిలీవి కిలో రూ.200పైే లభిస్తాయి. వీటిని ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో అధిక ధరలకు విక్రయించడం ద్వారా కిలోపై రూ.1500 వరకు సొమ్ము చేసుకొంటున్నారు.

అవుకులో 15 మంది రైతులు 120 ఎకరాల్లో 5252 రకం మొక్కజొన్న విత్తనం సాగు చేశారు. 30 శాతం పొలాల్లో మొలకలు రాలేదు. రైతులంతా కలిసి వ్యాపారిని ప్రశ్నించడంతో ఉచితంగా మరో రకం విత్తనాలు ఇచ్చారు.

**మద్దతు ధరతో పెరిగిన సాగు**

మొక్కజొన్న క్వింటాకు రూ.2,100 మద్దతు ధర ప్రకటించారు. ఎకరాకు సగటున రూ.20- 22 వేల వరకు వ్యయమవుతుంది. ఒక ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడిపోను రూ.40 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. గతేడాది మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేసినా ఆశించిన దిగుబడులు లేవు. దీంతో ఈ ఏడాది మెట్ట ప్రాంతాల రైతులు ఈసారి పెద్దఎత్తున మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

# ఫ్లోబస్.. సాంకేతికత అదుర్స్




తిరుపతి : 'ఎవడబ్బ సొత్తు కాదురా ట్యాలెంటు'.. అన్న మాటలను నిజం చేశాడా కుర్రాడు. చిన్ననాటి నుంచి తాను అందిపుచ్చుకోలేని సాంకేతికతను నేటితరానికి పరిచయం చేస్తూ సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాడు. కళాశాలల్లో సరైనా ప్రయోగశాలల్లేక తాను పడిన కష్టం మరెవ్వరికీ ఎదురవ్వకూడదని బస్సులోనే ల్యాబ్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. మూడేళ్ల శ్రమకోర్చి దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారి ఫ్లో (ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్) బస్సులో ల్యాబ్‌ను ఆవిష్కరించాడు. అతడే పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన క్రొవ్విడి మధులాష్‌బాబు. ఆ ఆవిష్కరణ గురించి తెలుసుకుందాం రండి.

**ఆలోచనతో మెరిసి..** మధుకు చిన్నప్పటి నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై మక్కువ ఎక్కువ. తండ్రి లారీ డ్రైవర్ కావడంతో ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ కోర్సు తీసుకుని వినూత్నంగా రాణించాలనుకున్నాడు. కానీ కళాశాలలో సరైన ప్రయోగశాలలు, పరికరాల్లేక ఆశించిన స్థాయిలో విద్యాబోధన లేదని మదనపడ్డాడు. తాను పడిన కష్టం మరెవరికీ కలగకూడదని వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. సాంకేతిక పరికరాలతో కూడిన బస్సును రూపొందించాలనుకున్నాడు. అది ఖర్చుతో కూడుకున్న పనైనా విశ్రమించలేదు. తన ఆలోచనలతో ఇన్వెస్టర్లను ఆకర్షించాడు.

**దేశంలోనే మొదటిది..** తన ఆలోచనను వివరిస్తూ శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ)కు దరఖాస్తు చేసుకోగా.. వారు దాన్ని పరిశీలించి స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ కింద రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఇదే కాకుండా అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ నుంచి రూ.80 లక్షల నిధులొచ్చాయి. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో 'ఎడోధ్వజ' అనే పేరుతో తన స్నేహితులతో కలిసి ఒక సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ నిధులతో దేశంలోనే తొలి సంచార ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో) బస్సును రూపొందించాడు.

**16రకాల పరిజ్ఞానాలు..** బస్సులోపల విద్యుత్తు సరఫరా కోసం బస్సుపై 2కే సోలార్ ప్యానల్, త్రీడీ ప్రింటింగ్‌తో బొమ్మలు, అంతరిక్షంలో అడుగుపెట్టినట్లు అనుభూతిని కలిగించే ప్లానెటోరియం, డ్రోన్‌లు, రోబోటిక్స్ తయారీ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, ఐవోటీ, వర్చువల్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఏఐ వంటి పదహారు రకాల టెక్నాలజీలను ఇక్కడ నేర్పిస్తారు. విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో డీఐవై కిట్ల సాయంతో సొంతంగా ప్రయోగాలు చేయొచ్చు. బస్సులో ఉన్న మెంటార్లు సాయం అందిస్తారు.

**మేమే వస్తాం** – మధులాష్‌బాబు, ఎడోధ్వజ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవో

# విభాగాలు సరే.. వైద్యం చేయరే!!



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కేజీహెచ్‌లో కీలకమైన విభాగాల్లో పూర్తిస్థాయి వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరికరాలు, వైద్యుల కొరతతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

'గుండె'కు అందని వైద్యం: గుండె శస్త్రచికిత్స (కార్డియో థొరాసిక్) విభాగంలో కీలకమైన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్ వైద్య పరికరాలు మూలకు చేరాయి. వైద్యనిపుణులు ఉన్నా.. పరికరాలు లేక రెండు నెలల నుంచి గుండె శస్త్రచికిత్సలు, కవాటాల (వాల్వ్) మార్పిడి చికిత్సలు నిలిచిపోయాయి. 1996లో హిందుస్థాన్ షిప్‌యార్డు ఆర్థిక చేయూతతో కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలకు శ్రీకారం చుట్టారు. నెలకు 25 నుంచి 30 వరకు సర్జరీలు చేసేవారు. ఆ తర్వాత పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) కింద హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్‌కు ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ...సర్జరీలు చేశారు. అలా అద్దెకు తీసుకున్న పరికరాలు పాడయ్యాయి. కొత్త పరికరాల కొనుగోలుకు రూ.5 కోట్లు అవసరమని ప్రతిపాదిస్తూ.. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ విషయాన్ని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఊపిరితిత్తులు, వాస్కులర్ సర్జరీలు మాత్రం చేస్తున్నారు.

**సీట్లు కోల్పోయే ప్రమాదం:** నెఫ్రాలజీ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్‌ను ఇటీవల బదిలీ చేశారు. ఆ స్థానాలను భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరు సహాయ ప్రొఫెసర్లతో విభాగం నడుస్తోంది. ఇక్కడ నాలుగు డీఎం కోర్సు సీట్లు ఉన్నాయి. ఆ సీట్లు కొనసాగాలంటే కచ్చితంగా ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్ ఉండాల్సిందే. ఆయా ఖాళీలు భర్తీ కాకుంటే, సీట్ల కొనసాగింపునకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు జారీ చేయదు.

ఈనెల 5 తర్వాత సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈలోపు కొత్తవారిని నియమించాల్సి ఉంది. కేజీహెచ్‌లో వంద మందికి రోజూ డయాలసిస్ జరుగుతుంది. 60 నుంచి 70 మంది కిడ్నీ బాధితులు చికిత్స పొందుతున్నారు. ఇంతటి కీలకమైన విభాగంలో నియామకాలపై దృష్టిసారించాలి.

**'ఎముకల'కు ఒక్కరే:** ఎముకల విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ప్రొఫెసర్లు డాక్టర్ శివానంద, డాక్టర్ లోక్‌నాథ్‌కు ఇటీవల బదిలీ అయింది. వారి స్థానంలో ఎవర్నీ నియమించలేదు. దీంతో ఆ విభాగం బాధ్యతల్ని కేవలం ఒకే ప్రొఫెసర్ పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఎముకల ఓపీ ఉంటుంది. వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు.

# అంధుల జీవితాల్లో 'అక్షర' వెలుగులు



విశాఖపట్నం: రాష్ట్రంలో అంధ బాలికలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక ఆశ్రమ పాఠశాల అది. విశాఖ బీచ్ రోడ్డులో సాగర్‌నగర్ సమీపంలో దాదాపు మూడెకరాల్లో విస్తరించి ఉంది. దృష్టి లోపంతో బాధపడుతున్న బాలికల జీవితాల్లో 38 ఏళ్లుగా వెలుగులు నింపుతోంది. ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అందిస్తున్నారు.

**ఏడాదంతా..:** ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. 40 శాతం, అంత కంటే ఎక్కువ అంధత్వమున్న విద్యార్థులను 'సదరం' ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఉంటే చేర్చుకుంటారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతులకు ఏడాదిలో ఎప్పుడొచ్చినా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ప్రవేశాలు కల్పిస్తారు. ఏటా పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ ఏడాది ఫలితాల్లో శ్రీకాకుళానికి చెందిన ఓ విద్యార్థిని 378 మార్కులు సాధించింది. పాఠశాల పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది.

**కళాశాల ఏర్పాటు చేస్తే:** ఉమ్మడి రాష్ట్రంలో 1987లో పాఠశాలను స్థాపించారు. బోధనకు 19 పోస్టులు మంజూరు కాగా ఉద్యోగ విరమణలు, బదిలీల తర్వాత ప్రస్తుతమున్న ఉపాధ్యాయులు ఆరుగురే. డీఎస్సీ ఫలితాల తర్వాత ఉపాధ్యాయులను కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బోధనేతర సిబ్బంది పోస్టులు 13 మంజూరు కాగా ఆరు ఖాళీలున్నాయి. ఇక్కడ బాలికల కోసం జూనియర్ లేదా వొకేషనల్ కళాశాల ఏర్పాటు చేయాలని గతేడాది ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేవు. కళాశాల ఏర్పాటైతే ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

**ప్రవేశాలకు ఆహ్వానం**

–డి.విజయ, ప్రధానోపాధ్యాయురాలు

అంధుల పాఠశాలలో ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నాం. ఆరు నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల బాలికలు అర్హులు. ఇక్కడ విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో బోధన సాగుతుంది. అందుకు తగ్గ పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఉచిత విద్యతోపాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉచిత వసతి, భోజనం, అన్ని వేళలా వైద్య సౌకర్యం, కంప్యూటర్ శిక్షణ అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

# అ'ధర'గొడుతున్న కొబ్బరి

పాలసముద్రం : పండించిన పంటకు మద్దతు ధర లభిస్తే అన్నదాతల కళ్లలో ఆనందం నిలుస్తుంది. అన్ని రోజులు పడిన కష్టాన్ని వారు మర్చిపోతారు. తాజాగా కొబ్బరి రైతుల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో ఓ వైపు మామిడి రైతులు ధర లేక రోడ్డుపై ట్రాక్టర్లలో లోడుతో పడిగాపులు కాస్తున్నారు. ఇదే సమయంలో.. కొబ్బరి రైతులు మద్దతు ధర రావడంతో ఒకింత ఆశగా ఉన్నారు. ఇక గతంలో ఎన్నడూలేని విధంగా కొబ్బరికి ధర పెరిగింది. వెయ్యి పచ్చికాయల ధర ఏకంగా రూ.17 వేలు పలకడంతో రైతులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడం, అక్కడి చెట్లకు తెగుళ్లు రావడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. పాల సముద్రం మండలం పాలసముద్రం, కమ్మపాళ్యం, వెంగళరాజుకుప్పం, శ్రీబొమ్మరాజుపురం, కనికాపురం గ్రామాల కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం మండలం నుంచి కర్నూలు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగళూరు, పుదుచ్చేరి, గుడియాత్తం సహా ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఒలిచిన వెయ్యి కాయల ధర రూ.25 వేలు పలుకుతోంది.



# పురాలకు అమృత్ బిందువు

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమృత్ ఫలాలు అందనున్నాయి. పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా నీటి ప్రాజెక్టుల కింద రూ.233 కోట్లు, మురుగు నీటి శుద్ధికి రూ.170 కోట్లు విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. అప్పటి వైకాపా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సర్దుబాటు చేయలేదు. కనీసం డీపీఆర్ రూపొందించలేదు. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం పనులు పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 281 పనులకు రూ.10 వేల కోట్లు విలువైన పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది.

**జగన్నాథగట్టుపై నిల్వ**

కర్నూలులో రూ.130 కోట్లుతో 20కి పైగా ఉపరితల నీటి ట్యాంకులు



నిర్మించే దిశగా యోచిస్తున్నారు. ప్రస్తుతం 30 ఉపరితల నీటి ట్యాంకులున్నా.. నీటి సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో పాటు జగన్నాథగట్టు ప్రాంతంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి, నీరు నిల్వ చేయాలనేది లక్ష్యం. గత వైకాపా ప్రభుత్వంలో పై పనులు టెండర్ దశకు వెళ్లి ఆగిపోయాయి. పై పనులు పూర్తయి ఉంటే.. నగరంలో 52 వార్డులకు తాగునీటి ఇబ్బందులు తొలగేవి. సుంకేసుల నుంచి మునగలపాడు రూ.83 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టారు. కేసీ కాలువ నుంచి నీటిని పైపులైన్‌తో సరఫరా చేయాలనే దిశగా ఆలోచనలు చేస్తున్నారు.

**మురుగు శుద్ధికి ప్రణాళికలు**

అమృత్ పథకాలకు కొనసాగింపుగా అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులు చేపట్టింది. దీంతోపాటు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్నూలుకు రూ.2.47 కోట్లు, నంద్యాల రూ.74 కోట్లు, ఆదోనిలో రెండు చోట్ల రూ.93.79 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

**ఆదోని అవస్థలు తీర్చేలా**

ఆదోనిలో రెండు పనుల ప్రణాళికలు చేశారు. మొదటిది రూ.12.9 కోట్లు, రెండోది రూ.22.27 కోట్లతో నీటి పైపులైన్ ఏర్పాటు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఉపరితల నీటి ట్యాంకులు, నీటిశుద్ధి కేంద్రంతో పాటు బలహీనవర్గాల కాలనీల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పనులు పట్టాలెక్కలేదు.

**ఇక్కడా పనులు చేపడతారు**

డోన్‌లో రూ.23.56 కోట్లు, బేతంచెర్ల రూ.2.66, ఆత్మకూరులో రూ.9.66, నందికొట్కూరులో రూ.10.18, ఎమ్మిగనూరులో రూ.3.52, గూడూరు రూ.5.68 కోట్లతో బలహీనవర్గాల కాలనీలు, నివాస ప్రాంతాల్లో నీటి వనరుల పెంపు, నీటి నిల్వ పనులు చేసి.. సరఫరా చేయాలని సంకల్పించారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి.

**నందుల కోటలో**

నంద్యాలలో రెండు ప్యాకేజీల్లో పనుల ప్రణాళిక చేశారు. రూ.10.47 కోట్లతో 7కేఎల్ ఈఎల్ఎస్ఆర్, 19 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 3006 కొత్తగా కుళాయి కనెక్షన్లు, 4.51 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం. రెండోది రూ.32.94 కోట్లతో 12.50 ఎం.ఎల్.డి. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 13.32 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 500 కేఎల్ సామర్థ్యంతో క్లియర్ వాటర్ సంప్ నిర్మించాలనుకున్నారు.

# గుట్టకో.. కబ్జా గుట్టు

రామచంద్రాపురం : మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు ఎంతకూ అడ్డుకట్ట పడటం లేదు. ఐదేళ్లు యథేచ్ఛగా సాగిన కబ్జాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రామాపురంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించారు. సర్వే నంబరు 28లో ఐదెకరాల భూమిని కబ్జా చేయడమే కాకుండా లేఅవుట్ వేసి అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. రోడ్డువైపు ఇప్పటికే వాణిజ్య సముదాయం నిర్మించి విక్రయించేశారు. తహసీల్దార్ల బదిలీల నేపథ్యంలో ఇప్పటికే ఆక్రమించిన భూముల్లో రాత్రికిరాత్రే కట్టడాలు వెలుస్తున్నాయి. ఈ దందాలో 20 శాతం రెవెన్యూ, 30 శాతం ప్రతిపక్షం, 50 శాతం అధికారపక్షం దండుకుంటోందనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా నెన్నూరు సమీపంలోని జూబ్లీహిల్స్ పక్కన, కొత్తకండ్రిగ, మిట్టకండ్రిగ పంచాయతీల మధ్యలోని గుండోడు కణంగుట్ట, రాయలచెరువుపేట, గణేష్‌పురం ప్రాంతాల్లోని గుట్టలపై కబ్జాకోరులు పట్టు బిగించారు. భారీ యంత్రాలు ఉపయోగించి గ్రావెల్ తరలించడం, ఆపై చదునుచేసి దర్జాగా కబ్జా చేస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు.

**పరిశీలించి చర్యలు చేపడతాం–** అన్వర్ బాషా, ఉపతహసీల్దారు

గతంలోనే ప్లాట్లు వేసి విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లాస్థాయి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

## భవిష్య నిధి

కర్నూలు : ఉద్యోగులను గత వైకాపా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. వేతనాలు సరైన సమయానికి చెల్లించలేదు. చివరికి భవిష్య నిధిలో దాచుకున్న సొమ్మును చెల్లించడంలోనూ నిర్లక్ష్యం చేసింది. గృహాల కొనుగోలు, పిల్లల చదువు, వారి పెళ్లిళ్లు తదితర అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసినా వాటిని పక్కన పెట్టేసింది. ఫలితంగా చాలామంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించింది. పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న రెండు మూడు నెలల్లోనే సొమ్ము అందజేస్తోంది.

470 మంది దరఖాస్తు ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి 470 మంది సభ్యులు నగదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 443 మంది సభ్యులకు రూ.21.08 కోట్లు మంజూరు చేశారు. పదవీ విరమణ పొందిన 234 మంది సభ్యులకు సంబంధించి రూ.28.12 కోట్లు చెల్లించేందుకు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందులో 190 మందికి రూ.18.82 కోట్ల మేర సొమ్ము జమైంది. మరో రూ.9.30 కోట్లు విడుదల కావాల్సి ఉంది. దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తుండటంతో ఉద్యోగులతోపాటు విశ్రాంత సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా పొదుపు చేస్తూ..ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ భవిష్య నిధికి సంబంధించి 6,960 మంది సభ్యులున్నారు. జడ్పీ పరిధిలో ఏర్పాటుచేసిన భవిష్యనిధిలో జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సభ్యులుగా చేరి ప్రతి నెలా పొదుపు చేస్తుంటారు. దీనిపై ఏడాదికోసారి వడ్డీతో లెక్కగట్టి సంబంధిత ఉద్యోగి ఖాతాకు జమ చేస్తారు. ఇప్పటివరకు రూ.282.38 కోట్ల సొమ్మును ఉద్యోగులు పీఎఫ్ ఖాతాలో దాచుకున్నారు. వివరాలు నవీకరించక..జడ్పీ భవిష్యనిధి ఖాతా సభ్యుల వివరాలు నవీకరించక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్ చేస్తేనే వివరాలు పూర్తిగా అందుబాటులో ఉంటాయని సభ్యులు చెబుతున్నారు.

చురకలు



## వడివడిగా ఉక్కు అడుగులు

నక్కపల్లి : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమపైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,300 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతోపాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమా రు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూములకోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు




చేపట్టింది. కొద్దిరోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లేలా మంత్రి వంగలపూడి అనిత చర్చలు ప్రారంభించారు. మరోవైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే స్లైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూములు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలానికి సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోనే దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు తెలిపారు.

## అడ్డేదెవరు.. ఆపేదెవరు!

అనకాపల్లి : జిల్లాలో అక్రమ మైనింగ్‌కు హద్దు, అదుపూ లేకుండా పోతోంది. సహజ వనరులు ఎక్కడ కనిపించినా.. వాటిని పిప్పి చేసేంతవరకు అక్రమార్కులు వదలడం లేదు. అధికారులు అడ్డుకున్నా.. లెక్కచేయడం లేదు. ముఖ్యంగా సాగుకు ఆధారమైన చెరువుల రూపురేఖలు మార్చేస్తున్నారు. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు బరితెగిస్తున్నా.. అధికారులు మాత్రం కొరడా ఝుళిపించడం లేదు. ఫిర్యాదులొచ్చినా తూతూమంత్రం చర్యలతోనే సరి పెడుతున్నారు.

రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 57-2లో భూపతి చెరువు ఉంది. దీనికింద 40 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు ఆధారంగా కొన్ని సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువు గర్భాన్ని చదును చేసి రోడ్డుగా మార్చేశారు ఓ మైనింగ్ నిర్వాహకుడు. కొండలను పేల్చి బండరాళ్లను ఈ దారిమీదుగా తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. దీనిపై కొన్ని రోజుల క్రితం స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టారు. జలవనరులు, రెవెన్యూ అధికారులు రెండేసిసార్లు నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఇటీవల దారికి అడ్డంగా పొక్లెయిన్ గండ్లు తీసి..



రవాణాకు వీలులేకుండా చేశారు. అయినా అక్రమార్కులు దానిని ఏమాత్రం లెక్కచేయలేదు. చక్కగా గండ్లుపూడ్చేసి.. మళ్లీ రోడ్డు వేసి దర్జాగా మైనింగ్ సాగిస్తున్నారు.

**చెరువుల చిక్కిపోతున్నాయి..** జిల్లాలో సుమారు 2,890 వరకు చెరువులు, సాగునీటి వనరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ఆధారపడి 2.5లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి సాగునీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఎనిమిదెకరాల్లో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పంటకాలువలను కలిపేసుకున్నారు. రావికమతం మండలం మేడివాడలో ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ వేసిన లేఅవుట్‌లో భారీగా ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం...**- వి.వి.రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

రాజన్నపేట చెవులో అక్రమంగా వేసిన రోడ్డును అడ్డుకున్నాం. మళ్లీ రోడ్డు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.. అతిక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ పరిధిలో భూ అక్రమాలను సహించేదే లేదు. సహజవనరుల దోపిడీకి పాల్పడితే చర్యలు తప్పవు.

# నైరుతి.. నైరాశ్యం



అనంతపురం : మరో రెండు రోజుల్లో ఆరుద్ర కార్తె ముగియనుంది. ఇంతవరకు చినుకు జాడలేదు. గతేడాది కంటే ఈసారి ఉమ్మడి అనంత జిల్లాలో ముందస్తుగా రుతుపవనాలు ప్రవేశించడంతో భారీ వర్షాలు కురుస్తాయని తొలుత వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చింది. దీంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. జులై వచ్చినా వరుణుడు కరుణించడం లేదు. కారుమబ్బులు కమ్ముకుంటున్నా బలమైన గాలులతో మేఘాలను తరిమేస్తున్నాయి. దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు

**వేసవిలో అధికం..**

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆయా నెలల్లోనే సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లింది. అనంత జిల్లాలో గతేడాది జూన్‌లో 61.0 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 142 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో గతేడాది జూన్‌లో 66.6 మి.మీ గాను 148.9 మి.మీ అత్యధికంగా నమోదైంది.

**47 వేల ఎకరాల్లోనే..**

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని రకాల పంటల సాధారణ సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47,487 ఎకరాల్లోనే సాగయ్యాయి. అనంత జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 8,48,149 ఎకరాలు కాగా...అందులో 24,044 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 6,64,842 ఎకరాలకుగాను 23,449 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

**18 వేల ఎకరాల్లోనే వేరుసెనగ**

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ ఇప్పటివరకు 18,786 ఎకరాల్లోనే సాగైంది. ఈనేపథ్యంలో కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కంది 8,653 ఎకరాలు, మొక్కజొన్న 6,714, పత్తి 6,675, ఆముదం 2,595, సజ్జ 1000 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

**అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు**

ఖరీఫ్ పంటల సాగుకు సమయం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. జులై మొదటి వారం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు. మొలకరాక నష్టపోతారు. జులై నెలంతా సాగుకు అనుకూలమే. వేరుసెనగతో పాటు కంది, సజ్జ, కొర్రలు, పెసర తదితరాలు సాగు చేసుకోవడం ఉత్తమం.

డాక్టర్ మల్లీశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే, రెడ్డిపల్లి

# అటు వెడల్పు.. ఇటు లైనింగ్



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. నీటి సీజన్ మొదలు కావడం.. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పనుల పురోగతిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కాలువకు ఈనెలాఖరులోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్.. క్షేత్ర స్థాయి పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రధాన కాలువ పనుల్లో వేగం పెరిగింది. కానీ పుంగనూరు ఉప కాలువ(పీబీసీ) పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇక్కడ మట్టి తొలగింపులో వేగం పెరగాల్సి ఉంది. ఈనెల 10 నాటికి పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. ప్రధాన కాలువ తొలి దశ కింద వెడల్పు, రెండో దశలో పీబీసీ లైనింగ్ పనులు చేస్తున్న సంగతి తెలిసిందే.

**తొలి దశ కీలకం**

ప్రధాన కాలువ తొలి దశ కింద విస్తరణ పనులు చేస్తున్నారు. 88 కి.మీ. నుంచి 216.300 కి.మీ. దాకా వెడల్పు చేయడానికి ప్రభుత్వం రూ.695.53 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఉత్తర్వు ఇచ్చిన సంగతి తెలిసిందే. 3850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో విస్తరిస్తున్నారు. మార్చి రెండో వారం నుంచి పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకు 71.02 శాతం పనులు జరిగాయి. 84.97లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉండగా.. 60.345 క్యూబిక్ మీటర్ల మట్టిని ఎత్తిపోశారు. తొలి దశ కాలువ ద్వారా గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు నీరు అందనుంది.

**259 కి.మీ.మేరకు..** రెండో దశలో ప్రధాన కాలువ, పీబీసీ కలిపి లైనింగ్ పనులు 259 కి.మీ. చేయాల్సి ఉంది. 216 నుంచి 400 కి.మీ. దాకా ఇద్దరు గుత్తేదారులు ఐదు ప్యాకేజీలుగా విభజించారు. ఇందుకు రూ.1256.30 కోట్ల అంచనా వ్యయంతో పని చేస్తున్నారు. లైనింగ్ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇక పీబీసీని రెండు ప్యాకేజీలు విభజించారు. రూ.266.24 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరణ సాగుతోంది. లైనింగ్‌లోనే కాదు.. మట్టి పనిలోనూ నత్తనడక కొనసాగుతోంది. ఈ రెండు ప్యాకేజీల్లో వేగం పెరగాల్సి ఉంది. మేలో కొంతమేర వర్షాలు పడటంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఈనెలాఖరుకు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్ఈ స్వరూప్‌కుమార్ తెలిపారు.రెండో దశ ప్రధాన కాలువ ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, హిందూపురం, కదిరి నియోజకవర్గాల మీదుగా వెళ్తుంది.

# జేఎన్‌టీయూ టు స్వీడన్

విశాఖపట్నం : అనంత జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివితే స్వీడన్‌కు వెళ్లే అవకాశం ఉంది. స్వీడన్‌లోని బకింగ్‌హమ్ విశ్వవిద్యాలయంతో జేఎన్‌టీయూ ఒప్పందం కుదుర్చుకుంది. సాధారణంగా బీటెక్ చదివితే ఒక డిగ్రీ పట్టా వస్తుంది. జేఎన్‌టీయూ అందిస్తున్న డబుల్ డిగ్రీ కోర్సుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేస్తే ఒకేసారి రెండు డిగ్రీలు పొందొచ్చు. ఇక్కడ మూడేళ్లు, స్వీడన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు జేఎన్‌టీయూ బీటెక్ పట్టా, స్వీడన్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. 2017 నుంచి కళాశాల ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. ఇటీవలే మాస్టర్స్ డిగ్రీ జత కలిపారు.

**ప్రవేశాలు ఎలా..**

డబుల్ డిగ్రీ కోర్సులో చేరాలంటే ఇంటర్మీడియట్‌లో 60 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ, ఈఏపీసెట్ గాని, తెలంగాణ ఈఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలి. జేఈఈలో ర్యాంకు సాధించిన వారికి 50 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 20, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 10 సీట్లున్నాయి.

**ప్రయోజనం ఏమిటి?**

విదేశీ విద్య, ఉద్యోగాలు చేయాలనుకొనేవారికి కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జేఎన్‌టీయూ అందించే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్సీ) సర్టిఫికెట్‌తో ఎంఎస్‌లో చేరడానికి ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఎంఎస్‌లో చేరి స్వీడన్‌లోనే కొలువులు



సాధించవచ్చు.

**ఈనెల 10 వరకు గడువు**

దరఖాస్తుకు ఈనెల 10 తుది గడువుగా నిర్ణయించాం. 14 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం. ఏటా రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్ కళాశాల నిర్ణయించిన మేరకు ఫీజు చెల్లించాలి. అక్కడ ఉత్తమ మార్కులు సాధిస్తే ఉపకారవేతనం లభిస్తుంది. సాధారణ బీటెక్‌లా కాకుండా డబుల్‌డిగ్రీ కోర్సులో చేరడం వల్ల రెండు డిగ్రీలు లభిస్తాయి. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు.

ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ

## పొదుపు ఖాతాకు కన్నం

కర్నూలు : పేదల పొదుపు సొమ్మును కాజేశారు.. ఖాతాదారుల సొమ్ముకు రక్షణగా నిలవాల్సిన వారే భక్షకులుగా మారారు. నగరంలోని “ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ”లో రూ.2.42 కోట్లు పక్కదారి పట్టిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. పాతబస్తీలోని కర్నూలు అర్బన్ బ్యాంకు 2010లో ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీగా ఏర్పాటైంది. నాలుగు వేల మంది సభ్యులున్నారు. వ్యాపారాన్ని పెంచుకునేందుకు 100 రోజుల కాలపరిమితితో రోజువారీ డిపాజిట్లు సేకరించారు. 2018-19 నుంచి 2021-22 వరకు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

**విచారణ పేరుతో కాలయాపన**

ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కాలపరిమితి పూర్తయినప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. 2021-22లో లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు తేలింది. పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో 2023 నవంబరులో సహకార అధికారులు విచారణకు ఆదేశించారు. నిధుల స్వాహా జరిగి మూడేళ్లవుతున్నా విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప నిందితులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 2018లోనే తగుచర్యలు తీసుకొని ఉంటే పేదల సొమ్ముకు రెక్కలొచ్చేవి కాదు.

**రూ.2.42 కోట్లు స్వాహా**

డైలీ డిపాజిట్లలో రూ.60 లక్షలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్స్ డిపాజిట్లలో రూ.99 లక్షలు పక్కదారి పట్టించారు. షేర్ క్యాపిటల్ (మూలధనం) నగదు రూ.32 లక్షలు, చేతిలో ఉంచుకున్న



నగదు రూ.10 లక్షలు, పాతబకాయిల వసూళ్లలో రూ.56 లక్షలు, నగదు పుస్తకంలోని కూడికల్లో రూ.3.50 లక్షలు, ఉద్యోగుల వేతనాల పేరుతో రూ.6 లక్షలు, ఇంకా ఇతరత్రా రూపాల్లో కలిపి మొత్తం రూ.2,42,76,980 సొమ్ము కాజేసినట్లు తేలిందని జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

**కాపాడాల్సిన వారే కాజేశారు**

2023 నవంబరు వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సహకార చట్టంలో ఛైర్మన్, సీఈవోకు జాయింట్ చెక్ పవర్ ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం నాన్ అఫీషియల్ పాలకమండలి ఛైర్మన్ అయిన బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఉండడంతో అవినీతి అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి 2023 నవంబరు వరకు బాలరాజు పాలకమండలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సొసైటీలో పనిచేసే క్లర్క్ పదోన్నతిపై సీఈవో జాకీర్ బాషా 2022 వరకు పనిచేశారు. అదే సొసైటీలో క్లర్క్, క్యాషియర్, సీఈవోగా పనిచేసిన ఎస్.ఏ రఫీక్ పాత్ర ఉన్నట్లు తేలింది. బ్యాంకులో పనిచేస్తూ.. బ్యాంకుకే కన్నం వేశారు. పాలకమండలి ఛైర్మన్‌గా పనిచేస్తూ సహకార సొసైటీని అభివృద్ధి చేయాల్సిన వ్యక్తి.. ఆయనకు ఒక్కడికే చెక్ పవర్ ఉండడంతో తనను అడిగేదెవరూ అంటూ అందిన కాడికి దోచుకున్నారు.

## ‘అద్దె’రువు

నంద్యాల: ఓ ప్రైవేటు గోదాము ప్రతినిధులు, పౌరసరఫరాలశాఖ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. గోదాము విస్తీర్ణాన్ని పెంచి భారీ ఎత్తున అద్దెను (స్టోరేజీ రుసుములు) దండుకొన్నారు. ప్రతి నెలా రూ.1,68,640 చొప్పున నాలుగున్నరేళ్లలో సుమారు రూ.కోటి వరకు అదనంగా చెల్లింపులు జరిగాయి. జిల్లా అవసరాల నిమిత్తం పౌరసరఫరాలశాఖ గోపవరంలోని ‘శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్’ను 2019లో అద్దెకు తీసుకుంది. దానిని నేరుగా వేర్‌హౌస్ యాజమాన్యం నుంచి కాకుండా రాజ్‌కుమార్ నుంచి తీసుకోవడం గమనార్హం. ఆ గోదామును రాజ్‌కుమార్ లీజుకు తీసుకుని పౌరసరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. దాని సామర్థ్యం 13 వేల మెట్రిక్ టన్నులని చెప్పి అద్దె ఒప్పందం చేసుకొన్నారు. సుమారు నాలుగున్నరేళ్లపాటు ఎలాంటి సమస్య తలెత్తలేదు. అక్కడ తాజాగా కొలతలు తీయడంతో ప్రతి నెలా 1984 టన్నులకు అదనంగా అద్దె వసూలు చేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది.

**1,800 సంచుల బియ్యం మాయం**గోపవరం బఫర్ గోదాములో ఉండాల్సిన 1,800 సంచుల బియ్యాన్ని పక్కదారి పట్టించారు. లెక్క ప్రకారం ఉండాల్సిన బియ్యం సంచులు లేకపోవడంతో ఆయా వివరాలు దస్త్రాల్లో మళ్లీ రాయాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు రాస్తే అక్రమాల విషయం బయటపడుతుందన్న ఉద్దేశంతో గోదాములో సరకు మొత్తం ఖాళీ చేసిన తర్వాతే గిడ్డంగుల సంస్థ స్వాధీనం చేసుకున్నట్లు చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**లీజు మార్పుతో వెలుగులోకి**

: అద్దెకు తీసుకొన్న ప్రైవేటు గోదాముల (ఇన్వెస్టర్ గోదాము) విషయంలో భారీ అక్రమాలు జరిగినట్లు ‘కూటమి’ ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ‘ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ’ (ఏపీఎస్‌డబ్ల్యూసీ) గోదాములను తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో ఏపీఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సదరు సంస్థకు జిల్లాలో సొంత గోదాములు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. తాము అద్దెకు తీసుకున్న ‘శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్’ను గిడ్డంగుల సంస్థకు బదలాయించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు గిడ్డంగుల సంస్థ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో గిడ్డంగుల సంస్థ అధికారులు పరిశీలించి దాని కొలతలు తీసుకోవడంతో తేడాలొచ్చాయి. అందులో 13 వేల టన్నులు సరకు పట్టదని.... 11,016 టన్నులు నిల్వ చేసేందుకే సరిపోతుందని తేల్చారు. అంత విస్తీర్ణానికే అద్దె చెల్లిస్తామని తేల్చి చెప్పారు. ఆమేరకు ఏపీఎస్‌డబ్ల్యూసీ అధికారులు పౌరసరఫరాలశాఖ అధికారులకు లేఖ రాయడంతో అక్రమాల గుట్టు రట్టయింది. అక్రమం జరిగిన విషయం తెలినా గోదాము అనుమతిని గత నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

చురకలు



## నమ్రత మేడం సర్ మేడం అంతే..!

ఈ జనరేషన్ ప్రేక్షకులకు నమ్రత శిరోద్కర్ కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే తెలుసు. కానీ రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్తే ఆమె స్థాయి ఏంటో అందరికీ అర్థం అవుతుంది. 1993లో ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకుంది. హిందీలో ఎన్నో సినిమాల్లో నటించి సూపర్ హిట్స్‌ను సైతం అందుకుంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో పాటు పలు సినిమాల్లో నటించింది. మహేష్ బాబుతో ప్రేమలో పడ్డ నమ్రత శిరోద్కర్ ఆయన్ను పెళ్లి చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయింది. ఆమె ఫ్యామిలీ వ్యవహారాలు చూసుకుంటే ఈ జనరేషన్‌కి కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే గుర్తు ఉండి పోయేలా ఆమె లో ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ వస్తుంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నమ్రత తన హద్దులు దాటకుండా, పరిధిలో ఉంటూ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. చాలా మంది పెళ్లి అయిన హీరోయిన్స్ అందాల ఆరబోత చేస్తూ ఇప్పటికీ వార్తల్లో ఉన్నారు. వారి ఫామ్ కోల్పోయినా కూడా స్కిన్ షో చేయడం ద్వారా వార్తల్లో నిలవాలని ప్రయత్నాలు చేస్తున్న వారు కొందరు ఉన్నారు. కానీ నమ్రత మాత్రం ఎప్పుడూ చాలా హుందగా ప్రవర్తిస్తూ వస్తున్నారు. ఆమె తన గౌరవ, మర్యాదలు కాపాడుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. నమ్రత భార్య కావడం అనేది మహేష్ బాబు అదృష్టం అంటూ చాలా మంది అభిమానులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నమ్రత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా



అందమైన ఫోటోలను షేర్ చేసింది. విభిన్నమైన డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన నమ్రత అంతే స్టైలిష్ ఆభరణాలు ధరించడం ద్వారా చాలా ఆకర్షణీయంగా కనిపించింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ నమ్రత సొంతం అంటూ ఉంటారు. ఆమె వయసు పెరిగినా కొద్ది మరింత అందంగా కనిపిస్తుందని, మిస్ ఇండియా సమయంలో ఎంత అందంగా ఉందో అంతే అందంగా కనిపిస్తుందని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి నమ్రత సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలను రెగ్యులర్‌గా షేర్ చేయాలని అభిమానులు కోరుకుంటూ ఉన్నారు. తరుణ్ తాహిళాని డిజైన్ చేసిన ఈ ఔట్ ఫిట్ నమ్రత ధరించడంతో మరింత అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో నమ్రత ఏ ఫోటోలు షేర్ చేసినా వెంటనే వైరల్ అవుతూ ఉంటాయి. ఎక్కువ శాతం తన పిల్లలు గౌతమ్, సితార ఫోటోలను షేర్ చేస్తూ ఉండే నమ్రత ఈసారి మాత్రం తన పిక్స్‌ను షేర్ చేసింది. ఇంత అందంగా ఉన్న నమ్రత ఎందుకు సినిమాలకు దూరం అయిందని అభిమానులు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల బాధ్యత ఉన్న కారణంగా అప్పుడు సినిమాలకు దూరంగా ఉన్న నమ్రత ఇప్పుడు అయినా రీ ఎంట్రీ ఇవ్వచ్చు కదా అంటున్నారు. ఆ మధ్య రేణు దేశాయ్ తో పాటు పలువురు రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. వారిలాగే నమ్రత ఏదో ఒక రోజున రీ ఎంట్రీ ఇస్తుందని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి నమ్రత మనసులో ఏముందో తెలియాల్సి ఉంది.

## జూనియర్ అతిలోక సుందరి వైబ్స్

నేటి జెన్ జెడ్ స్టార్లలో దూసుకుపోయే తత్వం జాన్వీకపూర్ కి ఉంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా సినీ ఆరంగేట్రం చేసిన జాన్వీ కపూర్ తనను తాను నటిగా నిరూపించుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతోంది. అదే సమయంలో జాన్వీ నిరంతర ఫ్యాషన్ సెన్స్ తో ప్రజల దృష్టిని తనవైపు తిప్పేసుకోవడంలో పెద్ద సక్సెసైంది. ఇప్పుడు మరోసారి జాన్వీ తనదైన యూనిక్ స్టైల్ తో కనిపించింది. ఈ బ్యూటీ జగదేక వీరుడు – అతిలోక సుందరి పోస్టర్ ప్రింట్ చేసి ఉన్న క్లాసిక్ డెనిమ్ జీన్స్ షర్ట్ ధరించి కనిపించింది. డెనిమ్స్ షర్ట్ వెనక భాగంలో ఈ పోస్టర్ ముద్రించి ఉండటం ఆసక్తికరం. ఈ స్పెషల్ డెనిమ్ జాకెట్ అంటే తనకు చాలా ఇష్టం అని జాన్వీ తెలిపింది. శ్రీదేవిని –ఒక



దేవదూత అద్భుత యువరాణి%–% అని ప్రశంసించారు. చిరంజీవి –శ్రీదేవితో పాటు ఈ పోస్టర్ లో నాటి మేటి విలన్ అమ్రీష్ పురి ఫోటో కూడా ఉంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉంది. ఈ బ్యూటీ తదుపరి రామ్ చరణ్ తో కలిసి పెద్దిలో కనిపిస్తుంది. ఆ తర్వాత జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ ని తెరకెక్కిస్తే నటించేందుకు సిద్ధమేనని కూడా జాన్వీ ఇంతకుముందు చెప్పింది. రామ్ చరణ్– జాన్వీ కపూర్ జంటగా జగదేక వీరుడు సీక్వెల్ ని తెకెక్కిస్తే బావుంటుందని చిరు కూడా సూచించారు. అయితే ఈ ప్రాజెక్టుకు ఇంకా చాలా సమయం పడుతుంది.




## డీజే టిల్లు కాదు.. ఇప్పట్నుంచి తెలుసు కదా అంటారు




డీజే టిల్లు సినిమాలతో యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డకు యూత్ లో ఫుల్ క్రేజ్ వచ్చిన విషయం తెలిసింది. ప్రస్తుతం ఆయన తెలుసు కదా సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. నీరజ కోనా తెరక్కిస్తున్న ఈ సినిమాలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా సినిమా నుంచి తొలి పాట రిలీజ్ చేశారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ రిలీజ్ కోసం ఓ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లోనే తమన్ స్వరాలు సమకూర్చిన మల్లిక గంధ అనే పాట తాజాగా రిలీజైంది. లిరిసిస్ట్ కృష్ణ కాంత్ రాసిన ఈ పాటను సిధ్ శ్రీరామ్ పాటను ఆలపించారు. మెలోడియస్ గా ఉన్న ఈ పాట మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుంటుంది. తమన్ మ్యూజిక్ తో మరోసారి మ్యాజిక్ చేశారు. ఇక ఈ పాటలో సిద్ధు– రాశీ ఖన్నా మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరినట్లు కనిపిస్తుంది. వైఫ్ అండ్ హస్బెండ్ గా కనిపిస్తున్నారు. రొమాంటిక్ గా ఉన్న ఈ పాట ఆలరిస్తుంది. ఇది పక్కా 2025 రొమాంటిక్ హిట్ లో ఒకటిగా నిలువడం పక్కా అని ఆడియెన్స్ కామెంట్ పెడుతున్నారు. మరోవైపు ఈ సాంగ్ రిలీజ్ ఈవెంట్ లో పాల్గొన్న రాశీ ఖన్నా మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ లో తమన్, సిద్ శ్రీరామ్ స్టార్లు. తమన్ అద్భుతమైన సంగీతం అందించారు. లవ్ స్టోరీకి మ్యూజిక్ అందించాలంటే అందిరికీ ఫస్ట్ ఛాయిస్ తమనే. ఇక ఫీమేల్ డైరెక్టర్ తో పనిచేయడం నాకు ఇదే తొలిసారి. నీరజా కోన ఈ సినిమాకు వెన్నుముక. అయితే అందరూ సిద్దు బెస్ట్ ఫిల్మ్ డీజే టిల్లు అని చెబుతున్నారు. కానీ, ఈ సినిమా చూసిన తర్వాత అందరూ తెలుసు కదా అని చెబుతారు.

ఈ సినిమాలో సిద్ధు క్యారెక్టర్ తో ప్రేమలో పడిపోతారు. అంత బాగా వచ్చింది. అని రాశీ ఖన్నా అన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాతోనే నీరజ కోన డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. ట్రై యాంగిల్ స్టోరీగా ఇది తెరకెక్కుతుంది. ఇటీవల టీజర్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో సిద్ధు– రాశీ ఖన్నా– శ్రీనిధి శెట్టి మధ్య సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అక్టోబర్ 17న ఈ సినిమా రిలీజ్ కానుంది.

## వార్-2.. నిర్మాతలు పెద్ద యుద్ధమే చేయాలేమో?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ ప్రముఖ నటుడు హృతిక్ రోషన్ కాంబినేషన్ లో వార్–2 మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే తారక్ బాలీవుడ్ లోకి ఎంట్రీ (డైరెక్ట్ హిందీ మూవీ) ఇస్తున్నారు. స్పై జోనర్ లో స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యష్ రాజ్ ఫిల్మ్స్ భారీగా నిర్మిస్తోంది. బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్న వార్–2ను ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ కు సంబంధించిన వ్యవహారాలు పూర్తి చేస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే తెలుగులో కూడా వార్–2 రిలీజ్ కానుండగా.. ఇప్పటికే థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌసెస్ పోటీ పడినట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. కానీ వారెవరికీ హక్కులు ఇవ్వమని యష్ రాజ్ ఫిల్మ్స్ చెప్పిందని టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా సినిమాను సొంతంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకుందని సమాచారం. అదే సమయంలో తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ వాల్యూ రూ. 90 కోట్ల వరకు ఉంటుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు వాటిని తిరిగి పొందాలంటే.. వార్–2 మేకర్స్.. పెద్ద యుద్ధమే చేయాలేమోనని అంటున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ సేఫ్ జోన్ ఉండే ఛాన్స్ ఉన్నా.. రిస్క్ చేస్తుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా స్పై జోనర్ కు తెలుగులో మరింత అంత ఫ్యాన్ బేస్ ఉండదు. అందుకే జోనర్ తోనే ఫస్ట్ సమస్య. ఆ తర్వాత ఎన్టీఆర్ సోలో మూవీ అయితే.. తెలుగులో భారీ వసూళ్లు రాబట్టడం ఈజీనే. కానీ సినిమా కంటెంట్ అంతా బాలీవుడ్ ఫ్లేవర్ లో ఉన్నట్టు క్లియర్ గా తెలుస్తోంది. కాబట్టి తారక్ ప్రమోషన్స్ చేసినా అది సరిపోదు. అదే సమయంలో వార్–2 రిలీజ్ రోజు కూలీ మూవీ విడుదల కానుంది. రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబోలో రానున్న ఆ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. సినిమాలో అన్ని ఇండస్ట్రీల నటులున్నారు. దీంతో వార్–2 కన్నా కూలీకే ఎక్కువ బ్రాండ్ వాల్యూ ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు వార్–2.. తెలుగులో ఎలా గట్టెక్కుతుందో వేచి చూడాలి.

## శ్రీలీల కొంటె చూపుల వలపు బాణం

టాలీవుడ్ కోలీవుడ్ బాలీవుడ్ .. పరిశ్రమ ఏదైనా శ్రీలీల కొంటె చూపులకు దాసోహం అనాల్సిందే! అందానికి అందం, ప్రతిభ ఈ అమ్మడి సొంతం. ముఖ్యంగా డ్యాన్సింగ్ క్వీన్ గా ఓ వెలుగు వెలుగుతున్న శ్రీలీలలో గ్లామ్ యాంగిల్ కూడా ఎప్పుడూ యూత్ లో చర్చకొస్తుంది. ఇక ఫ్యాషన్ సెన్స్ లోను ఈ తెలుగమ్మాయి తగ్గేదే లే! అంటోంది. ముంబై, దిల్లీ, కోల్ కతా, బెంగళూరు లాంటి మెట్రో నగరాల నుంచి వచ్చిన చాలా మంది టాప్ మోడల్స్ కి పోటీనిచ్చేంత మ్యాటర్ ఉంది ఈ బ్యూటీలో. గత కొంత కాలంగా శ్రీలీల ఇన్



స్టాలో స్పెషల్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ లో శ్రీలీల సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. సింపుల్ గా నవ్వేస్తూ, హాఫ్ షోల్డర్ ఫ్రాక్‌లో ప్లెజెంట్ గా కనిపిస్తున్న ఈ బ్యూటీ గజిబిజి షూట్ లైఫ్ నుంచి రిలాక్స్ అవుతున్నట్టే కనిపిస్తోంది. ఈ అందాల భామ ప్రస్తుతం అరడజను సినిమాలతో బిజీ బిజీగా ఉంది. జూనియర్స్, మాస్ జాతర, లెనిన్ అనే చిత్రాల్లో నటిస్తోంది. మరోవైపు కార్తీక్ ఆర్యన్ సరసనా ఓ చిత్రంలో శ్రీలీల కథానాయిక. ఇది ఆషిఖి ఫ్రాంఛైజీ నుంచి వస్తున్న సినిమాగా ప్రచారం ఉన్నా, అలాంటిదేమీ లేదని చిత్రబృందం తెలిపింది. పరాశక్తి అనే తమిళ చిత్రంలోను ఈ భామ నటించింది.

## 'తెలుసు కదా' రాశి ఖన్నాకు...!

ఊహలు గుసగుసలాడే సినిమాతో దశాబ్ద కాలం క్రితం హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఆ సినిమా నటిగా రాశి ఖన్నాకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆ సినిమా కమర్షియల్‌గా కూడా మంచి ఫలితాన్ని సొంతం చేసుకుంది. అందుకే రాశి ఖన్నా చాలా సినిమా ఆఫర్లను సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచింది. టాలీవుడ్ టైర్ 2 హీరోల్లో చాలా మందికి జోడీగా నటించడం ద్వారా నాలుగు... ఐదేళ్ల పాటు బిజీ బిజీగా సినిమాల్లో నటించింది. ఒకానొక సమయంలో ఈమె ఏడాదికి నాలుగు అయిదు సినిమాల్లో కనిపించింది. ఈమధ్య కాలంలో టాలీవుడ్ కి రాశి ఖన్నా దూరం అయింది. తెలుగు సినిమాల్లో ఈమె చివరిగా కనిపించి రెండేళ్లకు పైగా అయింది. ఈమె నాగ చైతన్య హీరోగా నటించిన థాంక్యూ సినిమాలో చివరగా కనిపించింది. 2022లో విడుదలైన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. పైగా అంతకు ముందు ఈమె చేసిన తెలుగు సినిమాలు కూడా అంతంత మాత్రమే అన్నట్లుగా ఆడటంతో మెల్ల మెల్లగా ఆఫర్లు తగ్గాయి. అదే సమయంలో తెలుగులో



వచ్చే చిన్నా చితకా ఆఫర్లను కాదని కోలీవుడ్‌లో రాశి ఖన్నా బిజీ అయింది. తెలుగులో సినిమా ఆఫర్లు రాకున్నా కోలీవుడ్, బాలీవుడ్‌లో ఈ అమ్మడు నటించి మెప్పించింది. టాలీవుడ్‌లో 'థాంక్యూ' సినిమా తర్వాత రాశి ఖన్నా ఎట్టకేలకు 'తెలుసు కదా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సిద్దు జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. చాలా కాలం క్రితమే రావాల్సిన ఈ తెలుసు కదా సినిమా కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు విడుదలకు సంబంధించిన ప్రకటన వచ్చింది. అంతే కాకుండా ఈ సినిమా జోనర్ ఏంటి... ఎలాంటి కంటెంట్ ఈ సినిమాలో ఉండబోతుంది అనే విషయాన్ని తెలియజేస్తూ సరదాగా ఒక వీడియోను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఇద్దరు హీరోయిన్స్ ఈ సినిమాలో కనిపించబోతున్నారు. సిద్దు జొన్నలగడ్డకు జోడీగా రాశి ఖన్నాతో పాటు కేజీఎఫ్ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి సైతం హీరోయిన్‌గా నటించింది. వీరిద్దరి కాంబోలో ఉండే సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయని ఇటీవల విడుదల అయిన ప్రమోషన్ వీడియోను చూస్తే అనిపిస్తుంది. తెలుగు కదా సినిమా యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సాగే ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అని క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో సినిమాలో రాశి ఖన్నా పాత్ర చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంటుందని తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో చాలా కాలం తర్వాత కనిపించబోతున్న రాశి ఖన్నాకు తెలుసు కదా అయినా మంచి విజయాన్ని తెచ్చి పెడుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తెలుసు కదా హిట్ అయితే టాలీవుడ్‌లో మరో రెండు మూడు ఏళ్ల పాటు రాశి ఖన్నా బిజీగా ఉండే అవకాశం ఉంటుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536